ఆంధ్రభూమి

సంపుటి: 30 · సంచిక: 214 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 3 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం - దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం
తిథి: బహుళ త్రయోదశి రా.తె.3.33
నక్షత్రం: అనూరాధ మ.12.23
వర్జ్యం: సా.6.13 నుండి 7.53 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు

అయ్యప్పకు అపచారం!

సన్నిధానం చేరుకున్న ఇద్దరు 50ఏళ్ల లోపు మహిళలు

ఆలయం మూసివేత.. సంప్రోక్షణ ◆ సుప్రీం తీర్పు అమలైందన్న కేరళ సీఎం

సచివాలయాన్ని ముట్టడించిన బీజేపీ ◆ అట్టుడికిన కేరళ ◆ భగ్గుమన్న భక్తులు



ఆలయ సన్నిధానంలో బిందు, కనకదుర్గ



ఆలయంలో సంప్రోక్షణ నిర్వహిస్తున్నరు అర్చకులు

శబరిమల/తిరువనంతపురం, జనవరి 2: పవిత్రమైన శబరిమల అయ్యప్పకు అపచారం జరిగింది.. ఇంతకాలం మహిళలు ప్రవేశించకుండా కాపాడుకుంటున్న ఆలయ ప్రాంగణంలోకి ఇద్దరు నిషేధిత వయస్సున్న (50 ఏళ్లలోపు) మహిళలు ప్రవేశించి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకోవడం సంచలనం సృష్టించింది. సుప్రీం తీర్పు అనంతరం ఏ రకంగా ఆలయంలోకి ప్రవేశించాలా అని ఉవ్విళ్లూరుతున్న కొంతమందికి ఇది ఊరటనిచ్చే అంశమే.. అయితే ఇది సంప్రదాయంపై జరిగిన దాడిగా హిందువులు భావిస్తే.. సుప్రీం కోర్టు తీర్పు అమలు చేశామనంటూ కేరళ ముఖ్యమంత్రి సమర్థించుకున్నారు.

అన్నివయస్సుల మహిళలకు ఆలయ ప్రవేశం కల్పించాలన్న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ప్రభుత్వ ఆదేశం మేరకు పోలీసులు అమలు చేశారు. కోర్టు తీర్పును అమలు చేసేది లేదంటూ గత కొన్ని నెలలుగా సనాతనవాదులు చేస్తున్న ఆందోళనను లెక్కచేయకుండా, శబరిమలలోని స్వామి అయ్యప్ప ఆలయంలో 40 సంవత్సరాల వయస్సున్న ఇద్దరు మహిళలు బుధవారం తెల్లవారు జామున ప్రవేశించి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలిసిన వెంటనే అర్చకులు ఆలయాన్ని మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం మళ్లీ భక్తుల దర్శనార్థం తెరిచారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేరళకు చెందిన బిందూ (44), కనకదుర్గ (42) అనే మహిళలు నల్లటి ముసుగులు ధరించి పోలీసు భద్రత మధ్య భక్తుల్లో కలిసిపోయి పవిత్ర మందిరంలోకి ప్రవేశించి స్వామి అయ్యప్ప దర్శనం చేసుకున్నారు. దీంతో శతాబ్దాలుగా బహిష్టు వయస్సులో ఉన్న మహిళలు ప్రవేశించడంపై ఉన్న నిషేధానికి చరమగీతం పాడినట్లయింది. సుప్రీంకోర్టు అన్ని వయస్సులకు చెందిన మహిళలు శబరిమల ఆలయంలో ప్రవేశించవచ్చని మూడు నెలల క్రితం తీర్పు ఇచ్చింది. ఈ ఇద్దరు మహిళలు పోలీసు భద్రత మధ్య ఆలయంలోకి వచ్చారు. ఉదయం

- మిగతా 6వ పేజీలో

శంకరాభరణం
ఏమిది పోగాలముగా
కేమిది శబరిమలదాకిరెవరీపాపుల్
స్వామీ నీవే శరణిక
ఏమైననుజేసి శాంతినేర్పడజేయుమ్

కొత్తగా ఏర్పడింది.. ఇబ్బందులు తప్పవు!

హైకోర్టు విభజనపై దాఖలైన పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజనను తాత్కాలికంగా వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో హైకోర్టు భవనాలు, మౌలిక సాదుపాయలు, జడ్జీల నివాస సముదాయాలు పూర్తయ్యేవరకు హైకోర్టు విభజనపై విడుదలైన గెజిట్ నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలంటూ ఏపీ న్యాయవాదుల సంఘం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఏపీ న్యాయవాదులు సంఘం తరపున కె.సీతారాం, కె.జగన్మోహన్‌రెడ్డి సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. న్యాయమూర్తులు ఏకే సిక్రీ, అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం ముందుకు బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. రెండు హైకోర్టులకు సంబంధించి వేర్వేరుగా ప్రమాణ స్వీకారాలు కూడా పూర్తయినందున ఈ పిటిషన్‌పై జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. కొత్తగా ఏర్పాటయినప్పుడు చిన్న చిన్న అటంకాలు మామూలేనని ధర్మాసనం అభిప్రాయపడింది.




కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను పత్రికల వారికి వివరిస్తున్న రవిశంకర్ ప్రసాద్, రాజ్‌నాథ్ సింగ్

3 బ్యాంకుల విలీనానికి కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 2: విజయా బ్యాంక్, దేనా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా విలీనానికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోద ముద్ర వేసింది. దీనితో బ్యాంక్ ఆఫ్ బరోడా దేశంలోనే మూడో అతి పెద్ద బ్యాంక్‌గా ఆవిర్భవించేందుకు మార్గం సుగమమైంది. ఈ విలీనం తర్వాత, విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌కు ఉన్న వ్యాపార లావాదేవీలన్నీ బ్యాంక్ ఆఫ్ బరోడాకు బదిలీ అవుతాయి. ఆస్తులు, అప్పులు, ఇతరత్రా ఖాతాలు కూడా బ్యాంక్ ఆఫ్ బరోడాతో కలిసిపోతాయి. విలీనంలో భాగంగా, విజయా బ్యాంక్‌కు సంబంధించిన రూ.10 విలువైన ప్రతి 1000 షేర్లకుగాను రూ.2 విలువైన 402 షేర్లను బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేస్తుంది. అదే విధంగా రూ.10 విలువైన ప్రతి 1000 దేనా బ్యాంక్ షేర్లకు బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.2 విలువైన 110 షేర్లను అందిస్తుంది.

ఫన్‌గామా



అయితే ఇంకేం.. కాబోయే మంత్రులకు తలా ఒక విమానం గిఫ్ట్‌గా ఇద్దాం సార్..!





కుప్పం మండలం వడ్డిపల్లి గ్రామంలో బుధవారం జరిగిన జన్మభూమి మావూరు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హాజరైన ప్రజానీకం

కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వండి

రాష్ట్ర ప్రజలను కోరిన సీఎం చంద్రబాబు

కుప్పంలో జన్మభూమికి శ్రీకారం ◆ కేంద్రంపై పోరాటానికి కలసి రావాలని పవన్‌కు పిలుపు

కేసీఆర్, మోదీవి కుట్ర రాజకీయాలు ◆ జగన్ మోదీకి సరెండర్ అయ్యాడంటూ విమర్శలు

ఆంధ్రభూమి బ్యూరో

చిత్తూరు, జనవరి 2: విభజన కష్టాలు, ఆర్థిక లోటుతోను సతమతమవుతున్న రాష్ట్రాన్ని గత నాలుగున్నర సంవత్సరాలుగా అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కష్టపడ్డానని, అందుకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఆరవ విడత జన్మభూమి కార్యక్రమాన్ని ఆయన సొంత నియోజకవర్గమైన కుప్పంలోని వడ్డిపల్లిలో బుధవారం శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విభజన వల్ల జరిగిన నష్టాన్ని, అన్యాయాన్ని అధిగమించేందుకు ఎన్డీఎలో చేరామని కానీ, కేంద్రం సహకరించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. నిధులు ఇవ్వక రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటోందన్నారు. కేంద్రం నిధులు ఇవ్వక పోయినా పోలవరాన్ని పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. ఏడాదికి కేంద్రానికి రాష్ట్రం తరపున 6వేల కోట్ల రూపాయలు పన్నుల రూపాన కడుతున్నామని, కనీసం ఆ డబ్బుకూడా రాష్ట్రానికి ఇవ్వక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఫోన్‌లు కూడా ప్రధాని మోదీ ట్యాబ్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పెద్దనోట్లు, జీఎస్టీ వల్ల దేశ ఆర్థిక స్థితిగతులు అతలాకుతలమయ్యాయన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకపోవడం వల్లనే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కడపలో స్టీల్ ఫ్యాక్టరీతో పాటు రామాయంపేటలో నౌకాశ్రయం కట్టుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నుండే రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లింలకు సంబంధించి త్రిపుల్‌కలాబ్ బిల్లులో కూడా కేంద్ర ప్రభుత్వం న్యాయవ్యవస్థను కూడా భంగం కలిగించే విధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పవన్ కల్యాణ్ కూడా కేంద్రంపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. గతంలో ఓ కమిటీ ద్వారా రాష్ట్రానికి 70వేల కోట్లు కేంద్రం నుంచి రావాలని నిర్ణయించినా పవన్ కల్యాణ్ దీనిపై కేంద్రం నిలదీయాల్సి ఉందన్నారు. తెలంగాణలో

- మిగతా 6వ పేజీలో

చంద్రబాబుది దుష్ప్రచారం

- తిప్పికొట్టాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపు
- ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని
- ఏపీకి రూ.20 వేల కోట్లు మంజూరు చేశాం
- ఏం చేశారని ఏపీ సీఎంను నిలదీసిన మోదీ

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, జనవరి 2: ఏ రాష్ట్రానికీ ఇవ్వనన్ని నిధులు కేంద్రం ఏపీకి మంజూరు చేసినప్పటికీ, వాస్తవాలను పక్కన పెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దుష్ప్రచారం చేస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుష్ప్రచారాన్ని పార్టీ కార్యకర్తలే తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం ఆయన రాష్ట్రంలోని విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, నర్సాపూర్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని బూత్ కమిటీ కన్వీనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ గతంలో జార్ఖండ్, ఉత్తరాంచల్, ఛత్తీస్‌గడ్ రాష్ట్ర విభజన జరిగినప్పటికీ

- మిగతా 6వ పేజీలో



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, విజయనగరం జిల్లాలో కాన్ఫరెన్స్‌కు హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్ర కో-కన్వీనర్ సునీల్ దియోధర్ తదితరులు

ప్రచారం కోసం.. పథకం!

అక్టోబర్ 18నే జగన్‌పై దాడికి శ్రీనివాసరావు వ్యూహం

సిట్ దర్యాప్తు వివరాలు వెల్లడించిన సీపీ



దర్యాప్తు వివరాలు వెల్లడిస్తున్న విశాఖ నగర పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 2: విపక్ష వైసీపీ నేత జగన్‌పై విశాఖ ఎయిర్‌పోర్టులో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ప్రచారం కోసం పథకం ప్రకారమే జరిగినట్టు విశాఖ నగర పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఠానేలంకకు చెందిన జనిపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి విశాఖ విమానాశ్రయంలో గత ఏడాది అక్టోబర్ 25న దాడికి పాల్పడిన కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ వివరాలను బుధవారం వెల్లడించారు. విపక్ష నేతపై దాడికి సంబంధించిన కేసులో వాస్తవాలు ప్రకటించాలని భావించి, న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పటికీ అనుమతితో వివరాలు వెల్లడిస్తున్నట్టు సీపీ పేర్కొన్నారు. దీనిలో రాజకీయ కోణం ఏమీ లేదని స్పష్టం చేశారు. విమానాశ్రయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక నేతకు చెందిన

- మిగతా 6వ పేజీలో

నెత్తురోడిన రహదారులు

రెండు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

గుంటూరు, జనవరి 2: గుంటూరు జిల్లాలో రహదారులు నెత్తురోడాయి. బుధవారం జరిగిన రెండు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. కంటైనర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతిచెందగా. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం యడ్లపాడు - వంకాయలపాడు గ్రామాల నడుమ జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల పాపతో సహా నలుగురు మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రోడ్డుపై ఆగివున్న కంటైనర్‌ను కారు బలంగా ఢీకొట్టడంతో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. కారు ఢీకొన్న వేగానికి కారు ముందు భాగం

- మిగతా 6వ పేజీలో



కంటైనర్‌ను ఢీకొని నుజ్జయిన కారు

రాఫెల్‌పై దద్దరిల్లిన లోక్‌సభ

జేపీసీ విచారణకు తిరస్కరించిన కేంద్రం ◆ సభలో కలకలం సృష్టించిన పారికర్ ఆడియో టేపులు

టేపుల ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలన్న రాహుల్ ◆ కుదరదన్న స్పీకర్ ◆ అవి కల్పితాలన్న జైట్లీ

పార్లమెంట్ అంటే మోదీకి ఎందుకు భయం?: రాహుల్ ◆ జేపీసీ డిమాండ్ అర్థరహితం: జైట్లీ



బుధవారం లోక్‌సభలో మాట్లాడుతున్న అరుణ్ జైట్లీ, రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్ ఫైటర్ జెట్స్ కొనుగోళ్లపై అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదంతో లోక్‌సభ దద్దరిల్లింది. పలు దఫాలు వాయిదాల మధ్య ఈ అంశంపై సభలో మూడు గంటలసేపు చర్చ జరిగింది. కాగా బీజేపీ నమ్మకమైన కూటమిలోని పార్టీ శివసేన కూడా రాఫెల్‌పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ చేత విచారణ జరిపించాలని ప్రతిపక్ష కాంగ్రెస్‌తో గొంతు కలిపింది. రాఫెల్ అంశంపై అట్టుడికింది. జేపీసీ చేత విచారణ జరిపించాలన్న డిమాండ్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తిరస్కరించారు. ప్రతిపక్ష సభ్యులు చేసిన ఆరోపణలకు జైట్లీ ఘాటుగా స్పందించారు. తన బెడ్‌రూంలో రాఫెల్ ఫైళ్లు ఉన్నాయని గోవా సీఎం పారికర్ తనతో అన్నట్లు ఆ రాష్ట్ర మంత్రి విశ్వజిత్ రాణే పేర్కొన్నట్లుగా ఆడియో క్లిప్‌ను ప్రదర్శించేందుకు అనుమతి ఇవ్వాలని, అవినీతికి తిరుగులేని రుజువులు ఉన్నాయని ఎఐసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సభ్యుడు రాహుల్ గాంధీ తీవ్రమైన అభియోగం మోపారు. పరస్పర ఆరోపణలతో సభలో తీవ్రమైన గందరగోళం ఏర్పడింది. కేంద్రమంత్రి జైట్లీ ప్రసంగాన్ని కాంగ్రెస్ సభ్యులు అడ్డుకున్నారు.

అరుణ్ జైట్లీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఈ అంశంపై సంతృప్తి వ్యక్తం చేసినందున, జేపీసీ విచారణ అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సభ్యులు పేపర్‌తో తయారు చేసిన విమానాలను గాలిలోకి వదలడంపై మండిపడ్డారు. అవినీతితో నిండిపోయిన కాంగ్రెస్ అబద్ధాల ఫ్యాక్టరీతో నిరాధారమైన ఆరోపణలను చేస్తోందన్నారు. నీతికి మారుపేరు మోదీ ప్రభుత్వమన్నారు. జేపీసీ విచారణ అర్థంలేదన్నారు. ఒకప్పుడు చాలా గొప్పవాళ్లు కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షులుగా పని చేశారని, ఈ రోజు కనీస అవగాహన లేని వ్యక్తి ఆ పార్టీకి అధ్యక్షుడిగా ఉండడం విచారకరమన్నారు. గతంలో రక్షణ రంగం స్కాంలకు

- మిగతా 6వ పేజీలో



జన్మభూమి కార్యక్రమంపై సమీక్షిస్తున్న సీఎస్ పునేఠా

జన్మభూమిపై ప్రజా స్పందన తెలుసుకోండి

ఆర్టీజీఎస్‌కు సీఎస్ ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: రాష్ట్రంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమంపై ప్రజా స్పందన తెలుసుకోవాలని ఆర్టీజీఎస్ సీఈవో బాబు అహ్మద్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో జన్మభూమి కార్యక్రమ ఏర్పాట్లపై బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమికి సంబంధించి ప్రజల అభిప్రాయాలను ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. రోజు వారీ నివేదికలను సకాలంలో సేకరించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు నిర్దేశిత ఫార్మాట్‌ను క్షేత్ర స్థాయి వరకూ పంపాలన్నారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్స్‌ను అందించాలని ప్రణాళికా విభాగం కార్యదర్శి సంజయ్ గుప్తాను ఆదేశించారు. ఇంకా కొన్ని గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయకపోవడాన్ని ప్రస్తావించారు. బుధవారం సాయంత్రం నాటికి వాటిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలు, వార్డుల వారీగా జన్మభూమి కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించాలన్నారు.

బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం

వైసీపీ బీసీ అధ్యయన కమిటీ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి డిమాండ్

విశాఖపట్నం, జనవరి 2: టీడీపీ ప్రభుత్వం బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించలేదని, సంక్షేమ పథకాల మంజూరులోనూ విఫలమైందని వైసీపీ బీసీ అధ్యయన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి ఆరోపించారు. బీసీ కులాలు, వర్గాల్లోని సమస్యలను తెలుసుకునేందుకు విశాఖ వచ్చిన కమిటీ సభ్యుల బృందం బుధవారం బీసీ సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 52శాతం ఉన్న బీసీలకు కనీస ప్రాతినిధ్యం కల్పించకుండా, కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ బీసీ అధ్యయన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి

టీడీపీ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశామని ప్రకటిస్తున్నారే తప్ప, వాస్తవానికి అర్హులైన వారికి బ్యాంక్ రుణాలు, పథకాలు అందడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి బీసీలకు అవసరమైయ్యే పథకాలు, తదితర వాటిని గుర్తించేందుకు ప్రత్యేకంగా అధ్యయన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర పర్యటన అనంతరం బీసీల సమస్యలపై ప్రత్యేక నివేదికను తయారు చేసి ఆ నివేదికను వైసీపీ అధినేత జగన్‌కు అందించి, వచ్చే ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాధాన్యతను కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ అధ్యయన కమిటీ రాష్ట్ర సభ్యులు నరసయ్య గౌడ్, అవాల ముసలయ్య, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

970 ప్రాంతాల్లో ఉచిత వైఫై

ఫిబ్రవరి 15 నాటికి అందుబాటులోకి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: రాష్ట్రంలో 110 పురపాలక సంఘాల పరిధిలో 970 ప్రాంతాల్లో ఉచిత వైఫై సేవలు ఫిబ్రవరి 15 నాటికి అందుబాటులోకి రానున్నాయి. వెలగపూడి సచివాలయంలో ఏపీ డిజిటల్ ఇన్ఫ్రా, ఏపీ ఫైబర్ నెట్ కార్యకలాపాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) అనిల్ చంద్ర పునేఠా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 15 నాటికి 1000 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా ఏపీ ఫైబర్ నెట్ పెట్టుకుందన్నారు. 53 కోట్ల రూపాయలు ఖర్చు అయ్యే ఈ ప్రాజెక్టులో గూగుల్ సంస్థ పాలుపంచుకోనుంది. గూగుల్ సంస్థ నెట్ సేవలను ఉచితంగా అందచేస్తుంది. ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంలో 70 శాతం ప్రభుత్వానికి గూగుల్ చెల్లించనుంది. ఈ ప్రాజెక్టు వల్ల ఇంటర్నెట్ సేవలు మరింతగా అందుబాటులోకి రానున్నాయి. ప్రజా ప్రయోజనాలు కలిగిన ఈ ప్రాజెక్టు ద్వారా 4000 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఆ తరువాత గ్రామీణ ప్రాంతాలకు విస్తరించనున్నట్లు సీఎస్‌కు అధికారులు తెలిపారు. ఏపీ డిజిటల్ ఇన్‌ఫ్రాతో జాయింట్ వెంచర్‌తో ఒప్పందం చేసుకున్న కంపెనీకి ప్రభుత్వ స్థలాలను న్యాయమైన ధరలకు అద్దెకు ఇవ్వాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీకి వచ్చే ఆదాయం నుంచి ప్రతి సంవత్సరం 30.33 శాతం ప్రభుత్వానికి సమకూరుతుందని ఇంధన శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో 5జి సేవల కోసం 12000 టవర్లు అవసరం ఉంటుందని, ప్రైవేట్ కంపెనీలకు అద్దెకు ఇవ్వడం ద్వారా స్థానిక సంస్థలకు, వివిధ శాఖలకు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రభుత్వ స్థలాలు, భవనాలపై ఏర్పాటు చేసే టవర్లకు ఎంత అద్దె వసూలు చేయాలనే దానిపై పొరుగు రాష్ట్రాల్లో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సీఎస్ తెలిపారు.

అభివృద్ధి కావాలా? అరాచకం కావాలా?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా ప్రశ్న

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, జనవరి 2: రాష్ట్రంలో అభివృద్ధి కావాలో.. అరాచకం కావాలో ప్రజలే తేల్చుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం ఇక్కడ విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేఖరులతో ఆయన మాట్లాడుతూ దేశంలో అవినీతి రహిత పాలన, అభివృద్ధి కొనసాగాలంటే ప్రధానిగా మోదీ అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసత్య ప్రచారాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. దుగరాజపట్నం పోర్టుకు నాసా ఆంక్షలు విధించగా ప్రత్యామ్నాయ స్థలం చూపమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం కోరగా, నేటి వరకు ప్రత్యామ్నాయం చూపలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరకు కొరత ఉందని చెప్పిన వారం రోజుల్లోనే చంద్రబాబునా



విలేఖరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, పక్కన రాష్ట్ర కో కన్వీనర్ సునీల్ దియోధర్, పాకలపాటి సన్యాసిరాజు తదితరులు

యుడు శంకుస్థాపన ఎలా చేశాన్నారని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కో కన్వీనర్ సునీల్ దియోధర్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి పాకలపాటి సన్యాసిరాజు, జిల్లా అధ్యక్షుడు పెద్దింటి జగన్మోహన్, జిల్లా ఇన్‌ఛార్జి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

12 నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ నెల 12 నుంచి 20 వరకు సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల క్యాలెండర్ ప్రకారం 8 నుండి సెలవులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ జన్మభూమి కార్యక్రమం దృష్ట్యా మార్పు చేశారు. ఈమేరకు విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

సంపద సృష్టితో ఆర్థిక వెలుగులు

★ సంక్షోభాలే అవకాశాలు ★ అభివృద్ధి, సంక్షేమ పథకాల సమతుల్యత

★ పేదరిక నిర్మూలనే ప్రాతిపదిక ★ ప్రభుత్వ చర్యలతో పెరుగుతున్న తలసరి ఆదాయం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 2: వద్దన్నా వచ్చిన విభజనతో అంతా అయోమయం. రాజధాని ఎక్కడంటే ఏంచెప్పాలో తెలీని పరిస్థితి. స్వరాష్ట్రంలో పరిపాలనకు సొంత భవనాల్లేవు. అధికార యంత్రాంగానికి సౌకర్యాల్లేవు. అన్నింటినీ మించి ఆర్థిక కష్టాలు. ఈ స్థితిలో సరిగ్గా నాలుగున్నరేళ్ల గడిచేసరికి ఆర్థిక వృద్ధిరేటు ఎలా ఉంటుందన్న ఆందోళన మాయమై.. దేశంలోనే అత్యధిక వృద్ధిరేటును సాధించింది ఆంధ్ర రాష్ట్రం. బుడిబుడి నడకల నుంచి వడివడి పరుగుల నవ్యాంధ్రగా రూపాంతరం చెందింది. రూపాయి లేకున్నా వ్యూహాత్మకంగా నూతన రాజధాని అభివృద్ధికి ముందడుగు పడింది. పాలనా యంత్రాంగం ప్రజల చెంతకు వచ్చింది. పెట్టుబడులు పెట్టేందుకు మా రాష్ట్రం కూడా సిద్ధంగా ఉందని సగర్వంగా చెప్పడమే కాకుండా పెట్టేవారికి ఎంత సురక్షితమో, ప్రయోజనకరమో చెప్పగలిగింది. సొంత గడ్డపై నుంచే పాలన సాగిద్దామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునందుకుని ఉద్యోగులు తరలి రావడం, అమరావతికి భూములిస్తామంటూ రైతులు ముందుకు రావడం, ప్రవాసాంధ్రులూ చేయూతనివ్వడం ఏపీ ఆర్థికాభివృద్ధికి మార్గం సుగమం చేశాయి.

నిర్మాణాల్లో రికార్డు

డబ్బుల్లేవని గుడిసె వేసుకుని ఉండబోమని.. ప్రపంచంలోనే ఐదు అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా అమరావతిని నిర్మిస్తామని ఆత్మవిశ్వాసంతో చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దిశగా స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో నిర్మాణాలకు టెండర్లు ముగించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ఇతర రోడ్ల నిర్మాణమూ ప్రారంభించారు. అంతకంటే ముందు వెలగపూడి గ్రామంలో తాత్కాలిక సచివాలయాన్ని శరవేగంగా నిర్మించి చూపించారు. అంతే వేగంగా శాసనసభ నిర్మాణం పూర్తిచేశారు. తద్వారా నూతన రాజధానిని అనుకున్న స్థాయిలో నిర్మించగలమనే ఆశల్ని ప్రజల్లో నిలిపారు.

సవాళ్లను అధిగమించి..

సవాళ్లను అధిగమించేందుకు శ్రమిస్తూ, సంక్షోభాలను అవకాశంగా మలచుకుంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు దోహదపడే కార్యక్రమాలను అమలుపరచటమే కాకుండా 7 మిషన్‌లు, 5 గ్రిడ్‌లు, మరో 5 క్యాంపెయినింగ్ మోడ్‌లతో వినూత్న చర్యలు చేపట్టింది. స్థూల విలువ చేర్పు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, సమాజ, కుటుంబ వికాసం, కీలక పనితీరు సూచికలు అనే ఐదు ఇతివృత్తాలతో ఒక చారిత్రక పర్యవేక్షణ వ్యూహాన్ని రూపొందించింది. ఇబ్బందులను అధిగమించడమే కాకుండా సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోవడం ద్వారా 'సూర్యోదయ ఆంధ్రప్రదేశ్'కు గట్టి పునాది వేయగలిగింది.

వృద్ధిరేటులో తొలి స్థానం

గత నాలుగేళ్లలో రాష్ట్రం గణనీయమైన వృద్ధిరేటును నమోదు చేయగలిగింది. దేశ సగటు వృద్ధి 7.3శాతం, తెలంగాణ సగటు వృద్ధిరేటు 9.7శాతం కాగా, 10.52 శాతం (స్థిర ధరలతో) సగటు వృద్ధిని నమోదు చేయడం ద్వారా ఉత్తమ ఆర్థిక నిర్వహణదారుగా రాష్ట్రం నిలిచింది. ప్రస్తుత ధర ప్రకారం 2013-14లో రూ 4.64 లక్షల కోట్ల నుండి 2017-18 (ఏఈ)లో రూ 8.04 లక్షల కోట్లకు ఏటేటా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గణనీయంగా మెరుగుపడింది. నాలుగేళ్ల కాలంలో నికర పెరుగుదల రూ 3.4 లక్షల కోట్లుగా ఉంది. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జనాభాను 58,32-41,68 నిష్పత్తిలో విభజించారు. అయితే జీఎస్‌డీపీ వాటా 5.07, 49.3 దామాషాలో ఉంది. రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య వ్యత్యాసం రూ 12,692 కోట్లు మాత్రమే. గత నాలుగేళ్లలో ప్రస్తుత ధరలలో సగటు వృద్ధిరేటు 14.72 శాతంతో ఏపీ స్థిరమైన పనితీరు వల్ల రూ. 71,216 కోట్ల వ్యత్యాసం, 2017-18లో జీఎస్‌డీపీ వాటా 52.3, 47.7 దామాషాలో ఉంది. రాష్ట్ర విభజన సమయంలో అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, కోశ సంబంధిత సామాజిక పరిస్థితులు ప్రతికూలంగా ప్రభావితం అవుతాయని కేంద్ర ప్రభుత్వం ముందే గుర్తించినప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. రాష్ట్ర విభజన వల్ల ఉత్పన్నమైన ప్రతికూల పరిస్థితులు, 2014 ఏపీఆర్ఏ చట్టంలోని హామీలు, నిబంధనలను నెరవేర్చడంలో కేంద్రం సహకరించక పోయినప్పటికీ రాష్ట్రం కష్టపడి ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగుపరచుకోగలిగింది. గడచిన నాలుగేళ్ల సగటు చూస్తే ఏపీ ఆర్థిక వృద్ధిరేటు 10.35 శాతంగా ఉంది. ఇది దేశ వృద్ధిరేటు, మిగిలిన అన్ని రాష్ట్రాల వృద్ధిరేటు కంటే ఎక్కువ. ప్రపంచ పోటీ సూచికలోనూ దేశ ర్యాంకు కంటే ఏపీ స్కోరు బాగుంది.

ఆర్థిక వ్యవస్థ స్వభావం

అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ స్వభావం కలిగింది. 2013-14 కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగం వాటా 23శాతంగా ఉంటే, విభజన సమయంలో ఇది 30.2 శాతం వరకు, 2017-18 కాలంలో మరింత పెరిగి 34.4 శాతానికి చేరింది. గత నాలుగేళ్లలో రుతుపవనాలు అనుకూలంగా లేకపోయినప్పటికీ జాతీయ సగటు వృద్ధిరేటు 2.4 శాతం ఉండగా, వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సగటు వృద్ధిరేటు 11 శాతంగా కనిపిస్తోంది. స్థూల నిబంధనల ప్రకారం ప్రస్తుత ధరల్లో వ్యవసాయం, అనుబంధ రంగాలు 2013-14 సంవత్సరంలో 1.28 లక్షల కోట్ల నుండి 2017-18 సంవత్సరంలో రూ 2.53 లక్షల కోట్ల వరకు గణనీయంగా పెరిగాయి. సుస్థిరతకు దారితీస్తున్న ఉద్యానవన, ఆక్వా కల్చర్ కలయిక విధానం, ప్రభావవంతమైన సహజవనరుల నిర్వహణ, వ్యవసాయం, అనుబంధ రంగాలపై ప్రభుత్వం దృష్టిసారిస్తూ చేసిన కృషి ఫలితంగా గత నాలుగేళ్ల వ్యవధిలోనే రూ 1.25 లక్ష కోట్ల నికర పెరుగుదలతో దాదాపు రెండింతలైంది. పారిశ్రామికరంగ ఆర్థిక వ్యవస్థ 2013-14 సంవత్సరంలో రూ 1.07 లక్ష కోట్ల నుండి ప్రస్తుత ధరలతో 2017-18 సంవత్సరంలో రూ 1.62లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది. రూ 0.55 లక్ష కోట్ల నికర పెరుగుదల ఉంది. సమర్థవంతమైన సులభతర వ్యాపార నిర్వహణలో మొదటి స్థానానికి దారితీస్తున్న సమర్థవంతమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయటం ద్వారా స్వదేశం, విదేశాలు రెండింటిలో పెట్టుబడులను చేజిక్కించుకుంటూ ప్రభుత్వం పారిశ్రామిక కార్యకలాపాలను అభివృద్ధి చేస్తోంది. సర్వీస్ రంగ ఆర్థిక వ్యవస్థ 2013-14లో రూ 1.90 లక్షల కోట్ల నుండి ప్రస్తుత ధరల్లో 2017-18లో రూ 3.20 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది. అమరావతికి తరలించడం, సేవా రంగం, పరిశ్రమల రంగం, సులభతర వ్యాపార నిర్వహణలో వృద్ధి, పర్యాటక రంగాన్ని పెంచడానికి ఓడరేవులను ఏర్పాటు చేయడం, మౌలిక సదుపాయాల రంగం సేవా విభాగానికి మరింత ప్రోత్సాహాన్నిస్తోంది. ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్‌సీ వంటి ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థలు ఏర్పాటు చేయటంలో ప్రభుత్వం చేసిన ప్రయత్నాల వల్ల సర్వీస్ రంగంలో నిలకడగా ఆర్థిక వృద్ధి సాధ్యమైంది. ఆర్థిక పన్ను ఆదాయం, తలసరి ఆదాయం అధికంగా ఉత్పత్తి చేసే సేవారంగం సుమారు 43.5 శాతం వాటాను ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు అందిస్తోంది. ఇది ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే, అంటే తెలంగాణ 63.8 శాతం, తమిళనాడు 53.36, కర్ణాటక 66.27, కేరళ 64.41శాతం, అఖిల భారత సగటు 53.85 శాతాని కంటే చాలా తక్కువ. జీఎస్డీపీలో పన్ను రెవెన్యూ 2015-16, 2016-17, 2017-18 సంవత్సరాలకు వరుసగా 14వ ఆర్థిక సంఘం అంచనా ప్రకారం 7.98, 8.26, 8.31 శాతానికి గాను 6.71, 6.32 శాతం, 6.6 శాతంగా ఉంది. ఆర్థిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌ను కోల్పోయిన తరువాత పన్ను మూలాల్ని రాష్ట్రంలో ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. అవశేష రాష్ట్ర జీఎస్‌డీపీకి వ్యవసాయం నుండి ప్రధాన వాటా, సర్వీస్ రంగం నుండి వాటా తక్కువ ఉన్నందున జీఎస్‌డీపీ దామాషాకు పన్ను కూడా తక్కువగా ఉంది. హైదరాబాద్ నుండి అమరావతికి రాజధాని, కార్యాలయాలను తరలించడం 2015-16 నుండి ఉద్యోగుల వేతనస్కేళ్ల సవరణ, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజన పథకం, ఆహార చార్జీలు, రైతులకు రుణ మాఫీ, సామాజిక భద్రతా పింఛన్లలో ఐదురెట్ల పెరుగుదల, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు మూలధన చేర్పు వంటి వివిధ సంక్షేమ కార్యక్రమాల రేట్లలో పెరుగుదల వంటివి రెవెన్యూ ఆదాయం పెరుగుదలకు ప్రధాన కారణం. అశాస్త్రీయ విభజన వల్ల భారీ రుణం వారసత్వంగా వచ్చి, దానికితోడు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రం సహాయ నిరాకరణ వైఖరి రాష్ట్ర ఆర్థిక వనరులపై మరింత ఒత్తిడిని పెంచింది. ఏమైనప్పటికీ ఆర్థిక ఆటంకాలను తొలగించుకుంటూ తక్కువ వడ్డీకి రుణాలు సమీకరించడం, పునర్వ్యవస్థీకరించడం ద్వారా లక్ష్యాలను అధిగమిస్తోంది. ప్రభుత్వం పరిమిత వనరులతో అత్యధిక ఫలితాలను సాధించడానికి వినూత్న ఆలోచనలు, సమ్మిళిత విధానాన్ని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ అవలంభిస్తోంది. సుస్థిర ప్రాతిపదికన ఆర్థిక వ్యవస్థలో స్థూల విలువ చేర్పును పెంచటానికి పేదరిక నిర్మూలనకు దారితీసే సంపద సృష్టి కోసం ఎకో సిస్టంను అభివృద్ధి చేయటానికి దార్శనికతగా ఉంది. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి, సంపద సృష్టి ఉండేలా చూడటానికి సహజ వనరుల వ్యూహాత్మక నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించింది.

అవినీతి రహిత రాష్ట్రమే లక్ష్యం

★ 19 నుంచి 3వ స్థానానికి వచ్చాం

★ సీబీఐకి అనుమతి నిరాకరణతో పెరిగిన బాధ్యత

★ ఏసీబీ డీజీ ఆర్‌పీ ఠాకూర్

విజయవాడ (క్రైం), జనవరి 2: ఆంధ్రప్రదేశ్‌ను పూర్తి స్థాయి అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ ఆర్‌పీ ఠాకూర్ అన్నారు. అవినీతి నిర్మూలనలో రాష్ట్రం 19వ స్థానం నుంచి మూడవ స్థానానికి చేరుకుందన్నారు. రాష్ట్ర ఏసీబీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరిన్ని సంస్కరణలతో అవినీతి రహిత రాష్ట్రాల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరుకునేలా మరింత కృషి చేస్తామని అన్నారు. అవినీతి నిర్మూలన కోసం ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు సోషల్ మీడియా వినియోగం తమకు మరింత దోహదపడిందని, అదేవిధంగా ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేస్తామన్నారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు నిర్వహించే విషయంలో సీబీఐకి అనుమతి నిరాకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంతో ఏసీబీ భాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈక్రమంలో రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై అవినీతి కేసు నమోదు చేశామన్నారు. నిజాయితీగా పని చేసే వారు భయపడాల్సిన అవసరం లేదని, అవినీతికి పాల్పడేవారిని మాత్రం వదిలేది లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న అకౌంట్లపై తాము ఆరా తీస్తున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. 2018లో ఏసీబీ రాష్ట్రవ్యాప్తంగా 31 అక్రమాస్తుల కేసులు నమోదు చేయగా.. 54.72 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను సీజ్ చేసిందన్నారు. అదేవిధంగా లంచం తీసుకుని అవినీతికి పాల్పడిన ఘటనలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 107 ట్రాప్ కేసులు నమోదు చేసి మొత్తం రూ. 21.64 లక్షలు సీజ్ చేశామని వెల్లడించారు. నమోదైన కేసుల్లో నిందితులపై కోర్టు విచారణలో సమర్థవంతంగా వాదనలు వినిపించి దోషులకు శిక్షలు పడేలా కృషి చేశామన్నారు. 2017లో 52శాతం శిక్షల శాతం ఉండగా, 2018లో 57శాతానికి పెరిగిందన్నారు. ఏసీబీకి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహకారం లభిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఏసిబి కార్యాలయాలకు స్వంత భవనాల నిర్మించామని, ప్రభుత్వం నుంచి రూ. 15.94 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. భవన నిర్మాణాలు ఆరు మాసాల నుంచి సంవత్సరం లోగా రికార్డు సమయంలో పూర్తి చేశామన్నారు. అదేవిధంగా అదనంగా 2018లో వివిధ కేడర్‌కు చెందిన 350 మంది సిబ్బందిని ప్రభుత్వం మంజూరు చేసిందని, రాష్ట్ర విభజన తర్వాత ఇంత మంది సిబ్బందిని పెంచడం తొలిసారన్నారు. అధికారులు, సిబ్బందికి కొత్త వాహనాల కొనుగోలు కోసం ప్రభుత్వం కోటి రూపాయలు విడుదల చేసిందని చెప్పారు. టోల్‌ఫ్రీ, ఇ మెయిల్, వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాను ఏసిబి పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా ప్రజల నుంచి స్పందన లభిస్తోందని, అవినీతి నిర్మూలన పట్ల ప్రజలను మరింత చైతన్య పరిచేందుకు నేరుగా వారి వద్దకే వెళ్లి అవగాహన ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. విలేఖరుల సమావేశంలో డైరెక్టర్లు శంకర బ్రత బాగ్చి, చీఫ్ లీగల్ అడ్వయిజర్ ఎం వెంగయ్య, హరికుమార్, అబ్రహాం లింకన్, షరీన్‌బేగం పాల్గొన్నారు.

టీడీపీతో జనసేన జతకట్టేనా!

★ పవన్ మౌనంపై ఉత్కంఠ ★ కాంగ్రెస్ పొత్తుపై సీడబ్ల్యూసీలో నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 2: తెలుగు రాష్ట్రాలు కేంద్రంగా ఫెడరల్ ఫ్రంట్.. బీజేపీ యేతర ఐక్య ఫ్రంట్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో మహా కూటమి.. ఇలా పొత్తులపై వ్యూహాత్మక రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఫెడరల్ ఫ్రంట్‌లో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ భాగస్వామి కానున్నారని కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ అధినేత చంద్రబాబు స్పందిస్తూ కేంద్రంలో రెండే రెండు కూటములని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేతో పాటు కాంగ్రెస్ నేతృత్వంలోని బీజేపీ యేతర కూటమి మాత్రమే మిగులుతాయని స్పష్టం చేస్తున్నారు. తనతో పాటు మమత కూడా ఈ కూటమిలో భాగస్వామిగా ఉంటారని తేల్చిచెప్తున్నారు. అంతేకాదు రాష్ట్ర హక్కుల సాధన కోసం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తమతో కలసి వస్తే వైసీపీకి అభ్యంతరమెందుకని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం కేసీఆర్, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డితో పాటు పవన్‌కళ్యాణ్ ప్రభుత్వంపై కత్తికట్టారని చంద్రబాబు ఆరోపిస్తూ వస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం వరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. లోకేష్.. మంత్రులు..ఎమ్మెల్యేలపై కత్తులు నూరుతున్న జనసేన పార్టీ టీడీపీతో జతకడుతుందనే ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. దీనిపై పవన్ కళ్యాణ్ మౌనం వహించటం ఈ ఊహాగానాలకు మరింత ఊతమిస్తోంది.

రాష్ట్ర విభజన సమయంలో పవన్‌కళ్యాణ్ దేశంలో కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేస్తామని, అవసరమైతే ఇతర రాష్ట్రాలకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తానని ప్రకటించటంతో పాటు గత సార్వత్రిక ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీకి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అంతేకాదు రాష్ట్రంలో అనుభవం ఉన్న వ్యక్తిగా చంద్రబాబుతో జతకట్టి తెలుగుదేశం పార్టీకి మద్దతిచ్చారు. అయితే అప్పటికి పార్టీ ఆవిర్భవించిన తొలిరోజులు కావటంతో గత సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి మద్దతిచ్చి ప్రచారం చేశారు. గత ఏడాదిన్నర కాలంగా పవన్‌కళ్యాణ్ టీడీపీతో విభేదిస్తూ తీవ్ర విమర్శలకు దిగటంతో టీడీపీ ఒంటరి పోరాటం చేస్తోంది. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలసి టీడీపీ ఏర్పాటు చేసిన మహాకూటమి ఘోర పరాజయాన్ని చవిచూసిన నేపథ్యంలో ఏపీలో పొత్తులపై సందిగ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో కేంద్రం అనుసరిస్తున్న అణచివేత విధానాలపై ప్రజల సెంటిమెంట్‌ను రగిల్చేలా టీడీపీ ప్రచారం చేస్తోంది. బీజేపీతో తెగదెంపులు చేసుకున్న తరువాత విభజనతో రాష్ట్రానికి రూ 75వేల కోట్లు రావాల్సి ఉందని జనసేన పార్టీ నిజనిర్ధారణలో తేలింది. టీడీపీతో ఢీకొన్న దగ్గర నుంచి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఈ అంశాలను పక్కనపెట్టారనే ఆరోపణలు ప్రచారంలో ఉన్నాయి. అంతేకాదు కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌లో వైసీపీ, జనసేన చేరతాయనే వాదనలు కూడా వినవచ్చాయి. అంతేకాదు టీడీపీపై మూకుమ్మడి దాడి కూడా ఈ వాదనలకు బలాన్నిచ్చింది. ఫెడరల్ ఫ్రంట్ మాటెలా ఉన్నప్పటికీ రాష్ట్రంలో 175 శాసనసభ స్థానాలకు పోటీచేయాలని జనసేన నిర్ణయించింది. ఇంతలో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందించాల్సి ఉంది. రాష్ట్ర హక్కుల సాధన కోసం ఒంటరి పోరాటం చేస్తున్నట్లు టీడీపీ ప్రచారం చేసుకుంటోంది. ఈ పరిస్థితుల్లో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లాలంటే ప్రత్యేక హోదాతో పాటు విభజన అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశాలు లేకపోలేదని పవన్ భావిస్తున్నారు. అయితే రాష్ట్రంలో తెలుగుదేశం నేతల అవినీతికి అంతులేకుండా పోతోందనే ఆరోపణలపైనే ఆయన నిలదీస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయానికొస్తే టీడీపీతో జతకట్టినా లేకున్నా ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు నెరవేర్చాలనే డిమాండ్‌ను ముందుకు తీసుకురాక తప్పదు. ఈ పరిస్థితుల్లో గత కొద్దిరోజులుగా జనసేన అధినేత టీడీపీపై విరుచుకుపడటం తగ్గించారు.

ఇదే అదనుగా టీడీపీ, జనసేన మధ్య ముసుగు తొలగిందంటూ వైసీపీ ప్రచారం చేస్తోంది. ఇదిలా ఉండగా గత కొద్దిరోజుల క్రితం వరకు రాష్ట్రంలో 25 పార్లమెంటు, 175 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ గెలిచి తీరాలని పార్టీనేతలకు దిశానిర్దేశం చేస్తున్న చంద్రబాబు తాజాగా 25 పార్లమెంటుతో పాటు 150 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిస్తున్నారు. దీంతో ఆ పాతిక సీట్లు పొత్తు కుదుర్చుకునే పార్టీకి ఆఫర్ చేస్తున్నారేమో అని పార్టీ వర్గాలు భావిస్తున్నారు. మహాకూటమి ఏర్పాటైతే కాంగ్రెస్ కలయికతో పోటీ చేసేందుకు సంఖ్యను తగ్గించారా? లేక జాతీయ స్థాయిలో బీజేపీ యేతర కాంగ్రెస్ కూటమికి మద్దతిస్తూ జనసేనకు ఆఫర్ చేస్తారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. కాంగ్రెస్‌తో పొత్తు అంశంపై ఢిల్లీలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. కాగా బాబు వ్యాఖ్యలపై పవన్ ఏ రకంగా స్పందిస్తారనేది వేచి చూడాల్సిందే.

పింఛనుదారులు ఇకపై డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: రాష్ట్రంలోని పింఛనుదారులు ఇకపై జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి పీయూష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందుబాటులో ఉన్న ఇంటర్నెట్ కేంద్రాలు, మీ-సేవ కేంద్రాలు, పింఛను సర్వీస్ అసోసియేషన్స్, గుర్తింపు పొందిన వారి నుంచి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించవచ్చు. ఈ సేవలు ఉపయోగించుకున్నందుకు వినియోగదారులు కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. సబ్‌ట్రెజరీలు, ట్రెజరీల్లో కూడా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను అందచేయవచ్చు. వేలి ముద్రలు పడనివారి వద్ద నుంచి ఐరిష్ స్కానర్ల ద్వారా సమర్పించవచ్చు, అది కూడా అందుబాటులో లేకపోతే భౌతికంగా తీసుకుంటారు. కదలలేని పరిస్థితుల్లోని పింఛనుదారులు ఎక్కడ ఉంటే అక్కడి నుంచే ఇవ్వచ్చు. సాధ్యం కాకుంటే భౌతిక జీవన పత్రం జారీ చేస్తారు. ఆ పత్రం ఎస్టీవోకు అందాక, వీడియో కాలింగ్ ద్వారా పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోతే ఇచ్చే వరకూ నిలిపివేస్తారు. 2020 నుంచి జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ సర్టిఫికెట్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.


సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

అధికారులతో సమీక్షలో సీఎస్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తే, ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు వీలు కలుగడమే కాకుండా, ప్రజల మన్ననలు పొందుతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. వెలగపూడి సచివాలయంలో వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సమీక్ష బుధవారం ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో కొన్ని శాఖల పనితీరు మెరుగుపరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని గుర్తు చేశారు. పౌర సరఫరాల శాఖ ప్రజల సంతృప్తి శాతాన్ని 90కి పైగా ఉండేలా చూడాల్సిందేనన్నారు. ప్రస్తుతం 81 శాతంగా ఉందని గుర్తు చేశారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లలో భాగంగా ప్రతివారం మున్సిపల్, జలవనరుల శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించుకుంటూ మంచినీటి సరఫరాలో అడ్డంకులను అధిగమించాలన్నారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే అధికారుల్లో చిత్తశుద్ధి అవసరమన్నారు.

మతంతో లబ్ధికి బీజేపీ కుట్రలు



- ఓ వైపు ట్రిపుల్ తలాక్..మరోవైపు శబరిమల
- ఏమీ చేయని టీఆర్ఎస్‌కు అన్ని సీట్లు వస్తే మాకెన్ని రావాలి
- కేసుల మాఫీ.. అధికార దాహంతోనే జగన్ మిలాఖత్
- సంక్రాంతి వరకు పార్టీ సభ్యత్వ నమోదు
- పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 2: జన్మభూమి- మా వూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. మతసంబంధమైన వ్యవహారాల్లో జోక్యం చేసుకుని లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందన్నారు. టీడీపీకి సంబంధించి ఇదే కీలకమైన సమయం.. ఈ పదిరోజులు గ్రామాలు, వార్డులలోనే ఉండాలని నిర్దేశించారు. భావితరాల భవిష్యత్తు వచ్చే ఎన్నికలపై ఆధారపడి ఉందన్నారు. ఎన్నికల్లో గెలుపే ప్రధానంగా పార్టీశ్రేణులు పనిచేయాలన్నారు. బుధవారం పార్టీ నాయకులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దుష్టశక్తులు పార్టీ, రాష్ట్రంపై కక్ష కట్టాయి..ఏపీకి విద్యుత్ బకాయిలు చెల్లించరు కానీ, పొరుగు రాష్ట్రాల్లో ప్రచారానికి కోట్లు వెచ్చిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మండిపడ్డారు. నేనేదో ఆక్రోశంలో ఉన్నానని మోదీ అంటున్నారు.. గుజరాత్‌ను ఏపీ మించిపోతుందనే ఆక్రోశం ఆయనకే ఉందని వ్యాఖ్యానించారు. అందుకే ఏపీకి నిధులివ్వకుండా అక్కసు వెళ్లగక్కుతున్నారని ధ్వజమెత్తారు. అడుగడుగునా ఏపీ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు..ఇద్దరం ముఖ్యమంత్రులుగా పనిచేశాం.. మోదీ అహ్మదాబాద్‌కు చేసిందేమీలేదు.. హైదరాబాద్‌ను మాత్రం తాను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. అహ్మదాబాద్‌కు, హైదరాబాద్‌కు పొంతన లేదన్నారు. ఏపీకి సహకరిస్తే అభివృద్ధిలో మించిపోతుందని మోదీ భయమన్నారు. హుందాతనం లేకుండా మోదీ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడ నిలదీస్తారో అని ఏపీ పర్యటన రద్దు చేసుకున్నారని, దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ జీరో.. మోదీ, షా, ముగ్గురు సీఎంలు, 13 మంది కేంద్రమంత్రులు ప్రచారం చేసినా తెలంగాణలో ఒక్క సీటు మాత్రమే గెలిచారని విమర్శించారు. తెలంగాణలో కూటమి విఫలమయిందని బీజేపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు..బీజేపీ యేతర కూటమికి బీటలు పడ్డాయని అరుణ్‌జైట్లీ చేస్తున్న వ్యాఖ్యానాలన్నీ హాస్యాస్పదమన్నారు. టీడీపీని జీరోచేస్తే బీజేపీ గెలుపుగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. నాలుగు రోజులు కూడ గడువు ఇవ్వకుండా హైకోర్టును తరలించారని ఆక్షేపించారు. కరవు, తుపాన్లకు మోదీ డబ్బులు ఇవ్వరు.. విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు మంజూరు చేయరు.. హామీలు నెరవేర్చరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో టీడీపీ గెలిస్తే తన అసమర్థత బయటపడుతుందని కేసీఆర్ భయపడుతున్నారని విమర్శించారు. కేసుల మాఫీ కోసం, అధికార దాహంతోనే మోదీతో ప్రతిపక్షనేత జగన్ జతకట్టారని ఆరోపించారు. ఎవరైతే మనకు అన్యాయం చేశారో వారిపై మనం పోరాడుతున్నాం.. రాష్ట్రానికి అన్యాయం చేసిన వారితో జగన్ మిలాఖత్ అయ్యారు. ముగ్గురు మోదీలతో మనం పోరాటం చేస్తున్నాం.. ప్రజల్లో పట్టుదల పెరగాలి.. కసితో పనిచేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధికి చేయూతనివ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆశయం కోసం ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలన్నారు. ప్రతిపక్షానికి ఎక్కడా అవకాశం ఇవ్వరాదన్నారు. మంచి పనులు చేయటమే కాదు.. చేసిన మంచిని ప్రజలు గుర్తించేలా ప్రచారం చేయాలని పార్టీ కార్యకర్తలను కోరారు. మళ్లీ టీడీపీయే అధికారంలోకి రావాలి.. లేకపోతే రాష్ట్రం దెబ్బతింటుందనే భయం ఉంది.. ప్రజల ఆశలు..ఆకాంక్షల మేరకు పనిచేయాలన్నారు. 25 ఎంపీ సీట్లు, 150 అసెంబ్లీ సీట్లలో గెలుపే లక్ష్యమన్నారు. పరిపాలనలో పారదర్శకత కోసమే శ్వేతపత్రాలు విడుదల చేశామని నాలుగున్నరేళ్లలో అనేక సమస్యలు పరిష్కరించామన్నారు. గ్రామాలు, వార్డుల్లో వసతులు పెంచామని తెలిపారు. సిమెంట్ రహదారులు, ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ ఖర్చులు రూ. 5 లక్షలకు పెంచామని, చంద్రన్న బీమా కింద రూ. 5 లక్షలు అందిస్తున్నట్లు వివరించారు. ఆపదల్లో అందరికీ అండగా ప్రభుత్వం ఉందన్నారు. ఎన్నో అవార్డులు సాధించాం.. రాష్ట్రాన్ని తిరుగులేని శక్తిగా మార్చామన్నారు. కేంద్ర సహకారం లేకపోయినా ఇన్ని పనులు చేశాం.. అదే కేంద్రం తోడ్పాటు ఉంటే మరెన్నో చేసేవాళ్లమని స్పష్టం చేశారు.

దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని నిర్దేశించారు. ఏపీ చేయని కేసీఆర్ అన్ని సీట్లలో గెలిచారు.. అన్నీ చేసిన మనం ఎన్ని సీట్లలో గెలవాలి.. ఆ కసి టీడీపీ నేతలు, కార్యకర్తల్లో రావాలన్నారు. మత వ్యవహారాల్లో బీజేపీ జోక్యం చేసుకుంటోందన్నారు. ట్రిపుల్ తలాక్ వ్యవహారంలో ఓ రకంగా, శబరిమల విషయంలో మరో రకంగా కుట్రలు చేస్తోందని ఆరోపించారు. విభజించి పాలించాలనే దురుద్దేశంతో ఉందన్నారు. ముస్లిం కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదును సంక్రాంతి వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు 60,09,408 సభ్యులు నమోదు కాగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.. ఆదరణ పరికరాలపై 90 శాతం సబ్సిడీ ఇస్తున్నాం.. దీన్ని బీసీలకు వివరించాలి.. బీసీలలో పార్టీ పట్టును పటిష్టం చేయాలి.. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనారిటీలకు అండగా నిలవాలని దిశానిర్దేశం చేశారు.

విశాఖ - చెన్నై కారిడార్ పనులు ఇక వేగవంతం

★ రేపు ముఖ్యమంత్రితో శంకుస్థాపన

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: విశాఖపట్నం - చెన్నై పారిశ్రామిక కారిడార్ పనులు ఇక వేగవంతం కానున్నాయి. ఇందులో భాగమైన సామర్లకోట - రాజానగరం రోడ్డు వెడల్పు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్ల రహదారిగా ఈ ప్రాజెక్టులో మారుస్తారు. 30 నెలల్లో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టుకు రూ. 300.28 కోట్లు ఖర్చవుతాయి. ఇందులో 78.5 శాతం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రుణంగా లభించగా 21.5 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరిస్తుంది. ఈ రోడ్డు వెడల్పుకు మొత్తం 72.17 ఎకరాల భూమిని సేకరించి, రూ. 106.75 కోట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇరువైపులా 4.5 మీటర్ల ఖాళీ ఉండే ఈ రహదారికి, అర్బన్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లతోపాటు సర్వీసు రోడ్డు కూడా ఉంటాయి. రాజానగరంలో ఈ రోడ్డు జాతీయ రహదారికి అనుసంధానం కావడమే కాక, కాకినాడ పోర్టుకు కూడా మార్గం కానుంది.

రహదారి అభివృద్ధిలో భాగంగా మూడు చిన్న వంతెనలు, 75 కల్వర్టులు, రెండు ఫ్లైఓవర్లు, రెండు అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తారు. ఈ రహదారితో ఈ ప్రాంతంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాలకు ఊతం లభించడంతో సాంఘీక, ఆర్థికాభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ అంచనా.

ఈ క్రమంలో పెద్దాపురం, రంగంపేట, సూరంపాలెం, రాజానగరం చుట్టుపక్కల వెనుకబడిన ప్రాంతాలకు రోడ్డు అనుసంధానం కూడా పెరుగుతుంది.

ఆయేషా కేసు విచారణలో కీలక మలుపు

★ రికార్డుల ధ్వంసం వెనుక కుట్రపై అనుమానాలు

★ కోర్టు సిబ్బందిపై కేసు నమోదు

విజయవాడ (క్రైం), జనవరి 2: దాదాపు పదేళ్ళ క్రితం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించిన బి ఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా హత్య కేసుకు సంబంధించి కీలక మలుపు చోటు చేసుకుంది. ఇప్పటికే ఈ కేసులో నందిగామ అనాసాగరంకు చెందిన పిడతల సత్యంబాబును దోషికి తేల్చి విజయవాడ కోర్టు 2010 శిక్ష వేసింది. అయితే ఆ తర్వాత అతడిని నిర్దోషిగా నిర్ధారిస్తూ రాష్ట్ర హైకోర్టు విడుదల చేసింది. హైకోర్టు ఆదేశాలతో కేసు విచారణకు ఇటీవల సీబీఐ రంగంలోకి దిగింది. ఈక్రమంలో కేసుకు సంబంధించి రికార్డులు విజయవాడ కోర్టులో ధ్వంసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇదే అంశాన్ని హైకోర్టుకు నివేదించారు.

దీంతో రికార్డుల ధ్వంసానికి సంబంధించి సీబీఐ విశాఖ కేంద్రంగా మరో కేసు నమోదు చేసింది. ప్రస్తుతం ఆయేషా కేసుకు సంబంధించి రికార్డుల ధ్వంసంలో విజయవాడలోని నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు సిబ్బందిని నిందితులుగా చేర్చుతూ సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ వ్యవహారంలో విజయవాడ కోర్టు సిబ్బంది ప్రమేయాన్ని గుర్తించిన సీబీఐ.. ప్రాపర్టీ క్లర్క్ కుమారి, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి వెంకటకుమార్‌లను ఏ వన్, ఏ టు, ఏ త్రి నిందితులుగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొంటూ కేసులు నమోదు చేశారు.

రాష్ట్రాన్ని దోచేస్తున్న టీడీపీ నేతలు

ప్రధానిని చర్చకు రమ్మనడం బాబు అవివేకం ★ నెహ్రూ యువ కేంద్రం జాతీయ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

అనంతపురం సిటీ, జనవరి 2: తెలుగుదేశం నేతలు రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుంటున్నారని, వారి అవినీతి, అక్రమాలకు అడ్డులేకుండా పోయిందని నెహ్రూ యువ కేంద్ర జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం అనంతపురం నగరంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఏ విభాగం చూసినా అవినీతి పెరిగిపోయిందన్నారు. ఇందుకు సాక్షం విజయవాడ మేయర్ వ్యాఖ్యలేనన్నారు. విజయవాడలో ప్రభుత్వ భూములకు రాత్రికి రాత్రే జీవోలు పుట్టిస్తూ అక్రమిస్తున్నారని, ఎప్పుడూ జైలుకు వెళ్తామోనని భయంగా ఉందని, తనలాంటి నాయకులు టీడీపీలో ఉండలేరని బాధపడటం అందరూ గమనించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రకటిస్తూ దేశ ప్రధాని నరేంద్రమోదీ నిధులు విడుదల చేస్తేంటే వాటితో రాష్ట్రాభివృద్ధి చేయకుండా సొంత ఖాతాల్లోకి మార్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధిపై ప్రధాని మోదీని చర్చకు రమ్మని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలవడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి దేశ ప్రధానిని చర్చకు పిలవడం వింత అన్నారు. ఇది బాబు అవివేకానికి అద్దం పడుతోందన్నారు. ముగ్గురు మోదీలతో నా పోరాటం అంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మరి నాల్గవ మోదీ పవన్ కల్యాణ్ గురించి వ్యాఖ్యానించమంటే ఆయన మా వాడే అంటున్నాడన్నారు. టీడీపీ అతి పెద్ద దొంగల ముఠా పార్టీ అని పవన్ ఆరోపించారని, అయినా పవన్‌తో కలుస్తున్నారంటే దీనికి మీరే సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రానికి ప్రధాని వస్తున్నారంటే టీడీపీ వారికి వెన్నులో వణుకు పుడుతోందన్నారు. ప్రధాని ఎక్కడ తమ బండారం బయటపెడతారన్న భయం టీడీపీ నేతలకు పట్టుకుందన్నారు. అందుకే మోదీని అడ్డుకుంటామని ప్రకటనలిస్తున్నారన్నారు. ఈ నెలలోపు రాయలసీమ జిల్లాల్లో బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్ షా పర్యటన ఉంటుందన్నారు. టీడీపీ వారికి దమ్ముంటే షా పర్యటనను అడ్డుకోవాలని ఛాలెంజ్ విసిరారు.

రాష్ట్రంలో ప్రజలు కట్టిన పన్నులతో టీడీపీ ప్రభుత్వం సిగ్గులేకుండా పత్రికా ప్రకటనలిచ్చుకుంటూ మోదీని తిడుతోందన్నారు. ఇదేనా మీ స్థాయి అని నిలదీశారు. మీరు చెప్పిన మాటలు ఎవరూ నమ్మరు కాబట్టే ఇలా ప్రకటనలు, పత్రికల్లో డప్పుకొట్టుకుంటున్నారని ఆరోపించారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా నాలుగు సంవత్సరాల్లో ఏం సాధించారని విష్ణు నిలదీశారు. ఐదు విడతలుగా జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తే లక్షల కొద్దీ వినతులు వచ్చాయని, అవన్నీ ఆయా జిల్లాల కలెక్టరేట్లలో మూలుగుతున్నాయన్నారు. అవినీతికి పాల్పడుతున్న టీడీపీ నాయకులు జేబులు నింపుకోవడానికే జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు తప్ప ప్రజల కోసం కాదన్నారు. అవినీతికి పాల్పడుతున్న టీడీపీ నేతలను అరెస్టు చేస్తే దేశంలోని జైళ్లు చాలవని అన్నారు. ప్రజాసామ్య వ్యవస్థను నాశం చేయడంలో టీడీపీ ప్రభుత్వం ముందుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమాలు పెరిగిపోయాయన్నారు. సామాన్య ప్రజల ఇబ్బందులు, సమస్యలు తీర్చడానికి ప్రయత్నించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విష్ణు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎంఎస్.పార్థసారథి, జిల్లా అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా ఆక్రోశిస్తున్న సీఎం

★ టీడీపీ అధికార ప్రతినిధి యామినీ శర్మ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: తనను నమ్ముకున్న 5 కోట్ల మంది ఆంధ్రులతోపాటు దేశ ప్రజలందరి గొంతుకగా మారి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశత్వ విధానాలపై తన ఆక్రోశాన్ని వెలిబుస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ అన్నారు. విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో ఆమె బుధవారం విలేఖర్లతో మాట్లాడుతూ ప్రధాని మోదీ అడ్డగోలు నిర్ణయాలతో ఉద్యోగాలు లేక రోడ్డున పడిన యువత, రైతులు, దళితులు, మైనార్టీల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు పోరాడుతున్నారన్నారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చంద్రబాబుపై నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఢిల్లీ పీఠం దద్దరిల్లేలా, వచ్చే ఎన్నికల్లో మోదీ నియంత్రత్వ పోకడలకు చరమగీతం పాడటానికి ఒకవైపు బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకం చేస్తూనే మరోవైపు తన ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా చంద్రబాబు వర్సెస్ నరేంద్రమోదీ ప్రాతిపదికనే ఎన్నికలు ఉంటాయన్నారు. కేసీఆర్, జగన్‌లు మోదీ కుడి, ఎడమలుగా మారిపోయారని ఈ ముగ్గురి కలయికలోని ఆంతర్యం ఏమిటో వారే బహిర్గతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతగా తన అసమర్థతను నిరూపించుకున్న జగన్, నిత్యం ఆంధ్రులను దూషిస్తూ తన చర్యలతో, చేష్టలతో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తున్న కేసీఆర్ సాయంతో ముఖ్యమంత్రి బాబుని ఢీకొనాలని చూస్తే కొండను ఢీకొన్న పొట్టేలు మాదిరిగానే అవుతుందని యామినీ శర్మ స్పష్టం చేశారు.


మోదీజీ.. మా సీఎం సవాల్ స్వీకరించండి

★ ఐదుకోట్ల ఆంధ్రుల హక్కు కోసమే ధర్మపోరాటం

★ మంత్రి అచ్చెన్నాయుడు

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, జనవరి 2: ఎవరూ చేయనంతగా ఏపీకి ఎన్నో అభివృద్ధి-సంక్షేమ పథకాలు అందించామంటున్న ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ప్రసంగంపై చర్చకు రావాలన్న ముఖ్యమంత్రి సవాల్‌ను స్వీకరించాలంటూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేసారు. ఐదు కోట్ల ఆంధ్రుల హక్కుల కోసం బాబు చేస్తున్న ధర్మపోరాటానికి విజ్ఞతతో ఆలోచించి ప్రజలంతా సహకరించాలని కోరారు. బుధవారం శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన ఆరోవిడత జన్మభూమి-మా వార్డు మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్థికంగా ఎన్ని ఆటుపోట్లున్నా మంచి పాలన అందించారన్నారు. కేంద్రాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, విభజన చట్టం, రాజ్యసభలో ఇచ్చిన హామీలనే నెరవేర్చమంటున్నామన్నారు.ఏపీకి రూ. 16,000 కోట్లు లోటు బడ్జెట్ అంటూ చెప్పిన కేంద్రప్రభుత్వమే రూ. 3,900 కోట్లు ఇచ్చిందన్నారు. రాజధాని లేక, ఎక్కడ కట్టాలో తెలియక ఆర్థిక నగరంగా తయారు చేయాలంటూనే ఢిల్లీని తలదన్నేలా నిర్మించాలన్న మోదీయే అందుకు కావల్సిన నిధులు రూ. 4,900 కోట్లకు కేవలం రూ. 1500 కోట్లు ఇచ్చారన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులకే ఆ మొత్తం సరిపోదని అచ్చెన్న అన్నారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం నీతి ఆయోగ్ సూచనల మేరకు రాష్ట్రానికే ఆ ప్రాజెక్టు పనులు అప్పగించి నిధులు ఇవ్వకుండా ఇప్పటికీ అష్టకష్టాలు పెడుతోందన్నారు. ఇప్పటి వరకూ జరిగిన 75 శాతం పనులకు రూ. 5000 కోట్లు కేంద్రం ఇంకా ఇవ్వాల్సివుందన్నారు. ఎంతో ఖనిజసంపద ఉందని చెప్పి కడపలో స్టీల్ ప్లాంటు నిర్మాణానికి అంగీకరించిన కేంద్రం మాటమార్చడంతో అక్కడ స్టీల్ ప్లాంటు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు రావల్సివచ్చిందన్నారు. విశాఖ రైల్వే జోన్ ఇస్తామంటూ ఒక రోజు, ఇవ్వలేమంటూ మరోరోజు మాటలు చెప్పే కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి 11 సంస్థలు కేటాయించాలంటూ విభజన చట్టంలో ఉన్నప్పటికీ వాటిని అమలుచేయకపోవడం వల్లే ధర్మ పోరాటానికి ముఖ్యమంత్రి దిగాల్సి వచ్చిందన్నారు. నాలుగున్నరేళ్ళుగా రాష్ట్రంలో పేదోడి స్వగృహం కల నెరవేర్చడానికి 30 లక్షల మందికి గృహాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షపార్టీలు అడుగడుగునా అడ్డుపడుతున్నా, ఆర్థికంగా ఈ రాష్ట్రానికి అనేక సమస్యలు ఉన్నా, ఎక్కడా సంక్షేమ పథకాలను అమలు చేయడమన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలపై చర్చ జరగాలని, సీఎం విడుదల చేసిన శ్వేతపత్రాలపై గ్రామస్థాయిల్లో కూడా చర్చ జరిగినప్పుడే కేంద్రం చేసిన దగా ప్రతీ పౌరుడికీ అర్థమవుతుందన్నారు. 2014 ముందు మనకు ఇష్టం లేకపోయినా, మనం కోరుకోపోయినా రాష్ట్రాన్ని రెండుగా విభజించారని, విభజన జరిగినప్పటికీ, ఆంధ్రాకు జరిగిన అన్యాయాన్ని కేంద్రప్రభుత్వం సరిచేస్తుందన్న నమ్మకంతోనే వారితో జతకట్టి ఎన్నికల్లోకి వెళ్ళి ప్రభుత్వాలను ఏర్పాటు చేసామన్నారు. కానీ, వారే మోసం చేయడంతో ధర్మపోరాటం చేస్తున్నామన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల హక్కులను అడిగేందుకు మరో అవకాశం లేకపోగా మరో పార్టీతో జతకట్టి ప్రాంతీయ పార్టీలను ఒక తాటిమీదకు తీసుకువస్తున్న ముఖ్యమంత్రిపై కేంద్రం కన్నెర్ర చేస్తే భయపడేది లేదంటూ హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



జన్మభూమి సభలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

గృహ నిర్మాణ ప్రాజెక్టులు గడువులోగా పూర్తి

★ అధికారులకు సీఎస్ ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: రాష్ట్రంలోని గృహ నిర్మాణ ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఏపీటిడ్కో (ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) అనిల్ చంద్ర పుణేతా ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో ఏపీటిడ్కోకు సంబంధించి రాష్ట్ర స్థాయి మంజూరు, పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ ప్రాజెక్టులు అన్నిటినీ సకాలంలో పూర్తి చేసేందుకు వీలుగా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణానికి సంబంధించి రెండు దశల ప్రాజెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటి దశ పనులను రానున్న నాలుగు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఈ గృహాలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు సకాలంలో విడుదల అయ్యేలా చూడాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఏపీటిడ్కో ఎండీ బిఎం దివాన్ మాట్లాడుతూ వివిధ పట్టణాల్లో 5.79 లక్షల ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 4.60 లక్షల ఇళ్లకు టెండర్లు ఖరారు చేశామన్నారు. వాటిలో 3.6 లక్షల ఇళ్లు ప్రారంభమైనాయన్నారు. ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ కింద 4.28 లక్షల ఇళ్లు మంజూరు కాగా, 1.69 ఇళ్లకు పాలనా ఆమోదం మంజూరైందన్నారు. వీటిలో 71 వేల ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. మొదటి దశ పనులను మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 11 అర్బన్ లోకల్ బాడీస్, 5 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి 41 డీపీఆర్‌లు వచ్చాయన్నారు. వాటి ద్వారా 57 వేల ఇళ్లను నిర్మించాల్సి ఉంటుందన్నారు. ఈ ఇళ్ల నిర్మాణానికి 3,183 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని, ఇందులో కేంద్రం నుంచి 861 కోట్ల రూపాయలు సమకూర్చుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం 676 కోట్ల రూపాయలు, లబ్ధిదారులు 1191 కోట్ల రూపాయలు భరించాల్సి ఉంటుందని వివరించారు.



గృహ నిర్మాణంపై సమీక్షిస్తున్న దృశ్యం

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయకపోవడం చారిత్రక తప్పిదమే

★ పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి

విజయవాడ (కార్పొరేషన్), జనవరి 2: శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలో రాష్ట్ర హైకోర్టును ఏర్పాటు చేయకపోవడం చారిత్రిక తప్పిదమేనని పీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆంధ్రరత్నభవన్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో భాగంగా జరిగిన హైకోర్టు విభజన ప్రక్రియలో అధికార వికేంద్రీకరణ సూత్రాన్ని విస్మరించడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రితోపాటు ప్రతిపక్ష నాయకుడు కూడా రాయలసీమవాసులే అయినప్పటికీ ఈ తప్పిదం జరగడం దురదృష్టకరమన్నారు. దేశంలో 12 రాష్ట్రాలలో రాజధాని ప్రాంతం, హైకోర్టు భవనాలు వేర్వేరు ప్రదేశాల్లో ఉన్నాయని, అలాగే దేశంలో 9 రాష్ట్రాలలో హైకోర్టు బెంచీలు ఉన్నాయన్నారు. కనీసం హైకోర్టు బెంచీనైనా రాయలసీమలో ఏర్పాటు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

క్రమబద్ధీకరణపై ఏ నిర్ణయం తీసుకున్నారు?

ఆ వివరాలు సమర్పించండి

ప్రభాస్ కేసులో కోర్టు ఆదేశం ★ విచారణ నేటికి వాయిదా

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: సినీ హీరో ప్రభాస్ గెస్టుహౌస్ రెవిన్యూ అధికారులు సీజ్ చేయడానికి సంబంధించిన కేసుపై బుధవారం హైకోర్టులో వాదనలు వాడివేడిగా జరిగాయి. గెస్టుహౌస్ క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభాస్ పెట్టుకున్న దరఖాస్తుపై ఏ నిర్ణయాలు తీసుకున్నదీ తెలపాలని రెవిన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తులు రామసుబ్రహ్మణ్యం, కేశవరావుతో కూడిన ధర్మాసనం కేసును విచారించింది. ప్రభాస్ దరఖాస్తు తిరస్కరణకు గురైందని అధికారులు కోర్టుకు తెలిపారు. తిరస్కరించనట్టు దరఖాస్తుదారునికి సమాచారం ఇచ్చిన ఉత్తర్వులు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించి, ఉంటే కోర్టు ముందుపెట్టాలని న్యాయమూర్తులు అన్నప్పుడు అధికారులు తడబడ్డారు. ప్రభాస్‌కు ఆన్‌లైన్‌లో సమాచారం పంపించామని ప్రభుత్వ తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు.

దానికి సంబంధించిన వివరాలు తమకు అందించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశానుసారం ఆ వివరాలను గురువారం కోర్టుకు సమర్పిస్తామని న్యాయవాది తెలిపారు. దీంతో కేసు గురువారానికి వాయిదా పడింది. తనకు సమాచారం ఇవ్వకుండా తన గెస్టుహౌస్‌ను రెవిన్యూ అధికారులు సీజ్ చేశారని ప్రభాస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

గురువారం, 3 జనవరి 2019

'ప్రయాణ' వైపరీత్యం..

ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రయాణికులను 'వీలు'ను బట్టి దోపిడీ చేయడం నడుస్తున్న చరిత్ర! ఇలా దోపిడీ చేయడాన్ని గతంలో 'నల్లబజారు'- 'బ్లాక్ మార్కెటింగ్'- అని పిలిచేవారు. 'బ్లాక్ మార్కెటింగ్' చేసేవారిని ప్రభుత్వాలు శిక్షించేవి, ప్రజలు నిరసించేవారు. ప్రస్తుతం ఇలాంటి దోపిడీ సక్రమ వ్యవస్థగా చెలామణి అవుతోంది! వినియోగదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని 'ధర'ను 'వెల'ను 'శుల్కాన్ని' 'సుంకాన్ని' పెంచడం గతంలో 'బ్లాక్ మార్కెటింగ్'.. ప్రస్తుతం ఈ 'నల్లబజారు'ను నల్లబజారు అనడానికి వీలులేదు.. ఇలా అవసరాన్ని ఆసరాగా చేసుకొని వినియోగదారులను, ప్రయాణికులను, సేవలను పొందే వారిని దోచుకొనడానికి ప్రస్తుతం 'ప్రీమియమ్ ప్రయిసింగ్'- ప్రాధాన్యాన్ని బట్టి వెలను నిర్ణయించడం-, 'డైనమిక్ ప్రయిసింగ్'- బహుముఖ క్రియాశీలతను బట్టి వెలను నిర్ణయించడం- వంటి గౌరవప్రదమైన పేర్లను పెట్టారు! ఇలాంటి విచిత్ర విచిత్ర నామధేయాల వల్ల 'నల్లబజారు' వంటి వికృతులు నాగరిక పద్ధతులుగా చెలామణి అవుతుండడం ప్రపంచీకరణం సృష్టించిన మాయ.. సినిమా టిక్కెట్టును అసలు వెలకంటె రూపాయికి అధికంగా అమ్మిన ''మురికి బట్టల వాణ్ని'' పోలీసులు కసిగా కొట్టుకుంటూ స్టేషన్‌కు ఈడ్చుకువెళ్లి శిక్షించేవారు.. ఇది గతం... ప్రయాణీకుల అవసరాన్ని బట్టి 'క్యాబ్' 'బస్సు' 'రైలు' విమానం ధరలను పెంచిపారేసే ఇబ్బడి ముబ్బడిగా దోచుకుంటున్న ''మురికి హృదయాల'' వాణిజ్యవేత్తలను పోలీసులు శిక్షించడం లేదు.. ఇది వర్తమానం! గతంలో 'బ్లాక్ మార్కెట్'-నల్లబజారు- పేరుతో నిరసనకు, శిక్షకు గురి అయిన పద్ధతులన్నీ ఇప్పుడు 'ప్రీమియమ్ ప్రయిసింగ్' 'డైనమిక్ ప్రయిసింగ్' వంటి గౌరవప్రదమైన పేర్లతో చెలామణి అవుతున్నాయి. జనానికి 'ద్రాసలేదు..' ఇలా 'సేవ- సర్వీసెస్- పేరుతో దోపిడీ జరుగుతోంది. దోపిడీ చేస్తున్న వాణిజ్య సంస్థలను శిక్షించడం అసంభవమన్నది 'ప్రపంచీకరణ'- 'గ్లోబలైజేషన్'- వ్యవస్థీకరించిన వికృత వాస్తవం! వాణిజ్య సంస్థల యజమానులు ప్రభుత్వ నిర్వాహకులకు లంచాలిచ్చి విధానాన్ని ప్రభావితం చేయడం గత చరిత్ర. ఇలా ప్రభావితం చేయడం కూడ 'అపవాదం'మాత్రమే.. కొన్ని సందర్భాలలో మాత్రమే కొన్ని పథకాలు, పరిశ్రమలు, కొనుగోళ్ల వ్యవహారాలలో మాత్రమే ఈ ప్రభావ వైపరీత్యం ప్రస్ఫుటిస్తోంది. వాణిజ్య అక్రమ లాభార్జనపరులు రాజకీయవేత్తలుగా, ప్రభుత్వ నిర్వాహకులుగా రూపొందుతుండడం 'ప్రపంచీకరణ' వ్యవస్థ మొదలైన తరువాత నడిచిపోతున్న అక్రమ కలాపం. అక్రమ కలాపాలు 'సక్రమం'గా మారిపోతుండడానికి మరో పేరు 'ప్రపంచీకరణ'. 'బ్లాక్ మార్కెటింగ్' ప్రస్తుతం 'ప్రీమియర్ ప్రయిసింగ్' పేరుతో, 'డైనమిక్ ప్రయిసింగ్' పేరుతో కొనసాగుతోంది.

హైదరాబాదు వంటి నగరాలలో 'ఓలా' 'ఉబర్' వంటి సంస్థలు 'క్యాబ్'లను 'ఆటోరిక్షా'లను నడిపిస్తున్నాయి. ఈ సంస్థల 'క్యాబ్'లు రంగప్రవేశం చేయకముందు దేశవ్యాప్తంగా నగరాలలో పెద్ద పట్టణాలలో 'కిరాయి కార్లు'- టాక్సీలను రహదారిపై నిలబడిన ప్రయాణీకులు కుదుర్చుకునేవారు. 'టాక్సీ'లను యజమానులు నడిపేవారు లేదా యజమానుల వద్ద 'టాక్సీ'లను అద్దెకు తీసుకొని 'చోదకులు'- డ్రయివర్లు- నడుపుకునేవారు. ఎన్ని కిలోమీటర్లు ప్రయాణం చేస్తే ఎంత సొమ్ము చెల్లించాలన్నది ప్రభుత్వాలు నిర్ణయించేవి! 'ఓలా' 'ఉబర్' సంస్థలు రంగప్రవేశం చేసిన తరువాత దేశవ్యాప్తంగా లక్షల మంది యజమానుల 'కార్'-టాక్సీ- క్యాబ్-లు స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయాయి. ఈ ఘరానా సంస్థల పోటీకి తట్టుకోలేక చిన్న చిన్న 'ప్రయాణ సేవల సంస్థలు' మూతపడిపోయాయి. అందువల్ల గతంలోవలె ప్రస్తుతం హైదరాబాద్ వంటి నగరాలలోను, పెద్ద పట్టణాలలోను ప్రయాణీకులు 'టాక్సీ స్టాండ్'వద్ద కాని, రహదారిపై నిలబడి కాని 'కారు'- టాక్సీ- క్యాబ్-ను కుదుర్చుకొనడానికి వీలులేదు. అలాంటి సదుపాయం గతమైంది, హతమైంది.. హతం చేసిన వారు 'ఓలా' 'ఉబర్' సంస్థల వారు. ప్రభుత్వాలు ఈ 'వాణిజ్య హంతకుల'ను శిక్షించడం లేదు, ప్రోత్సహిస్తున్నాయి. ఎందుకంటె వివిధ రాష్ట్రాలలోని ప్రభుత్వ నిర్వాహకులకు ఈ సంస్థలలో భాగస్వామ్యం ఉందట.. ఉందా? లేదా? అన్నది ధ్రువపడని అంశం! కానీ 'ఓలా' 'ఉబర్' సంస్థలు తమ 'క్యాబ్'లలో ఎక్కి ప్రయాణిస్తున్నవారిని రాత్రింబగళ్లు దోపిడీ చేస్తుండడం మాత్రం ధ్రువపడిన వాస్తవం! ప్రభుత్వ నిర్వాహక రాజకీయ వేత్తలు ప్రజల, ప్రయాణీకుల అవసరాల పట్ల క్రూరమైన పాశవికమైన పైశాచికమైన ఘోరమైన నిర్లక్ష్యం వహించి ఉండడం 'ఓలా' 'ఉబర్' వంటి సంస్థల ఆర్థిక నేరాలు సక్రమమైన కలాపాలుగా సాగిపోతుండడానికి కారణం..

ఇలా ఈ రెండు సంస్థల గుత్తాధిపత్యం వల్ల 'ప్రయాణీకుల'కు భయంకరమైన అసౌకర్యం ఏర్పడిపోయింది. ఎక్కడపడితే అక్కడ 'క్యాబ్' దొరకదు. ''నాగరికుల'' ప్రయాణ స్వాతంత్ర్యాన్ని ఈ సంస్థలు హరించి వేశాయి. 'ఓలా'క్యాబ్ ఎక్కాలి లేదా 'ఉబర్' క్యాబ్ కోసం పడిగాపులు పడి ఉండాలి! ఈ 'క్యాబ్' ఎక్కదలచినవారి వద్ద 'లావణ్యవాణి'- స్మార్ట్‌ఫోన్- తప్పనిసరిగా ఉండాలి, దానికి 'అంతర్జాల'- ఇంటర్‌నెట్ అనుసంధాన వ్యవస్థ- ఏర్పడి ఉండాలి! అలా ఉన్నప్పుడు మాత్రమే ఈ ప్రయాణీకులు తాము ఉన్నచోట నుంచి గమ్యానికి పోవడానికి వీలుగా 'ఓలా లేదా 'ఉబర్' - 'క్యాబ్'ను రప్పించుకోగలరు. 'ఇవి' లేనివారు ఆటోరిక్షాను ఎక్కిపోవాలి, 'బస్'కోసం నిలబడి ఉండాలి. లేదా ప్రయాణం రద్దు చేసుకోవాలి! బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు నెలకొల్పిన 'బందిఖానా'లలో ప్రజలు బందీలుగా మారిపోతుండడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే! గతంలో ఒకటి, రెండు, మూడు, నాలుగు 'కార్ల'ను అద్దెకు నడిపిన యజమానులు, చోదకులు ప్రస్తుతం 'ఓలా' 'ఉబర్' సంస్థలలో వెట్టిచాకిరి చేస్తున్న కూలీలు! ఇలా వికేంద్రీకృత, మానవీయ భారతీయ ఆర్థిక వ్యవస్థ కేంద్రీకృత స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థగా, పెట్టుబడుదారుల అక్రమ వాణిజ్య సామ్రాజ్యంగా మారిపోతుండడం ప్రపంచీకరణ... హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ నుంచి ఒక ప్రయాణీకుడు 'ఓలా' క్యాబ్ ఎక్కి సికిందరాబాద్ రైలుస్టేషన్‌కు వెళ్లి తిరిగి వచ్చాడు! వెళ్లినప్పుడు 'క్యాబ్' ప్రయాణ శుల్కం నూట యాబయి రూపాయలు, గంట తరువాత తిరిగి వచ్చినప్పుడు అదే దూరానికి నాలుగువందల యాబయి రూపాయలు.. ఇదీ 'డైనమిక్' ప్రయిజింగ్! 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థల'- విదేశీయ సంస్థల- వికృత స్వభావం స్వదేశీయ ప్రభుత్వేతర సంస్థలను ఆవహించి ఉంది. ప్రభుత్వేతర సంస్థల స్వభావం ప్రభుత్వరంగ సంస్థలను ఆవహించి ఉంది. ఇదీ ప్రపంచీకరణవల్ల మనకు జరిగిన ''మేలు''! అందువల్ల ఈ 'డైనమిక్ ప్రయిసింగ్' పద్ధతి ప్రభుత్వ సంస్థల బస్సులలోను, రైలు సంస్థలలోను కూడ అమలు జరుగుతోంది. పూణె నగరం నుంచి హైదరాబాద్‌కు 'స్లీపర్ క్లాస్'- శయనయానం- టిక్కెట్టు వెల మూడువందల ముప్ఫయి రూపాయలు. కానీ ప్రీమియర్ 'తత్కాల్' టిక్కెట్టు ధర వెయ్యినుంచి పది హేనువందల రూపాయల మధ్య నడుస్తోందట! హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లడానికి ఒకే సంస్థవారి విమానంలో మూడువేల రూపాయలు ప్రయాణ శుల్కం కావచ్చు లేదా పదకొండు వేల రూపాయలు కావచ్చు! అదే విమానం, అదే ప్రయాణం.... దోపిడీ జరిగిపోతున్న తీరు ఇది!

హైదరాబాద్‌లో 'ఆటోరిక్షా'లో పయనించడానికి ప్రభుత్వం నిర్ధారించిన కనీసపు ధర ఇరవై రూపాయలు. 'ఓలా' సంస్థవారు ఈ కనీసపు శుల్కాన్ని ఇరవై తొమ్మిది రూపాయలకు పెంచేశారు. ఇలా వాణిజ్య సంస్థలు సమాంతర ప్రభుత్వాలను నిర్వహిస్తుండడం హరించిపోతున్న దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి మరో నిదర్శనం. అందువల్ల 'ఆటోరిక్షాల'లో మీటర్లు తిరగవు. చోదకులు చెప్పినంత సొమ్మును ప్రయాణీకులు ఇవ్వాల్సిందే..!

మన క్రికెట్‌దే హవా!

మూడేళ్లుగా క్రికెట్ క్రీడలో 'విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌దే హవా!' జయభేరి మోగిస్తూ, తిరుగులేని 'బ్యాటింగ్ కింగ్'గా మనవాడు నిలిచాడు. అది 'టెస్ట్ మ్యాచ్' అయినా 'వన్ డే' లేదా 'ఇరవై-ఇరవై' పోటీ అయినా అతని బ్యాట్ మెరుపులు మెరిపించింది. ఇప్పుడు ఇండియాకి ఆస్ట్రేలియా మీద చరిత్రాత్మక గెలుపు-34 సంవత్సరాల తర్వాత- కళ్లు జిగేల్ మనిపించే మెరుపులాగ ప్రసాదించిన 2018 సంవత్సరం- వివాదగ్రస్తుడయిన ఇండియన్ కెప్టెన్‌కి తిరుగులేని 'నెంబర్ వన్' స్థానాన్ని ప్రసాదించింది.

ప్రత్యర్థుల మీద బ్యాట్‌తోనే గాక, నోటితో కూడా 'కస్సున' కలియబడిపోయినా, వర్తమాన క్రికెట్‌లో కోహ్లీ పుణ్యమాని- ఇండియన్ క్రికెట్‌దే 'హవా'గా చెలరేగుతోంది. విరాట్ 2018లో మొత్తం పదమూడు సెంచరీలు చేశాడు. అమితవేగంగా సాధించిన ఆ పరుగుల్లో ఐదు శతకాలు, ఐదు అర్ధ శతకాలు వున్నాయి.

మూడేళ్లుగా- 'నేనే మొనగాణ్ని' అన్నట్లు ఐ.సి.సి. టెస్ట్ ర్యాకింగ్‌ల్లో కింగ్- 'నెంబర్ వన్'గా రాణిస్తున్న విరాట్ కోహ్లీకి మరోవైపు నోటి దురుసుతనం ఎక్కువే! ఫీల్డులో దూకుడూ ఎక్కువే. వివాదగ్రస్తుడే అయినా- అతనికి 2018 చాలా గొప్పగా అచ్చొచ్చింది. రికార్డుల మీద రికార్డులు అతనికి 'భుజకీర్తులై' రాణిస్తున్నాయి. ఇది మనకి 'క్రికెట్ నామ సంవత్సరమా?' అన్నట్లుగా, ఇండియా - మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా జట్టుని పచ్చడి చేసి మరీ బోర్డర్-గవాస్కర్ కప్పుకి దగ్గిరగా చేరి యిప్పుడు నాలుగో టెస్ట్ ఆడుతున్నది. 'రెండూ- ఒకటి' ఆధిక్యంతో వున్న విరాట్ బృందానికి ఇంకొక్క గెలుపు దక్కితే- 'కప్పు'- ఫుల్‌గా మనకి లభిస్తుంది. లేదా 'సిరీస్ సమం' అయితే - ఆర్నెళ్లు కప్పు మన దగ్గిరే వుంటుంది- ఓటమి భయం లేదు.

చిత్రం ఏమిటీ అంటే, యీ కప్పు ఎవ్వరి పేర స్థాపితమై రాణిస్తున్నదో- ఆ



లెజెండ్స్ ఈ ఆటని ప్రత్యక్షంగా తిలకిస్తున్నారు. అన్నింటినీ మించి- మన ఉపఖండానికి క్రికెట్ వ్యామోహం లేదా అదంటే 'వేలం వెర్రి' అన్న మాటను కూడా 2018 రుజువు చేసింది మరోసారి.

బంగ్లాదేశ్‌లో 2018 మళ్లీ హసీనా చేతిలోనే- నువ్వేనమ్మా అందరికన్నా 'హసీనా'ని (అందగత్తె) అన్నట్లు ప్రభుత్వ పగ్గాలు పెట్టేస్తే- జనాలు ఆ గెలుపులో 'క్రికెటర్ మోర్తాజా'కొక రికార్డు విజయం వుంది. బంగ్లాదేశ్ వన్ డే టీమ్ కెప్టెన్ ముషారఫ్ మోర్తాజా తనకి సీటు యిచ్చిన అవామీ లీగ్‌కి, బండ మెజారిటీ (రెండు లక్షల డెబ్బయి నాలుగు వేల ఓట్లు)తో గెల్చి- ఉపఖండంలోని క్రికెట్ ప్రభావాన్ని రుజువుచేశాడు.

కేవలం క్రికెట్ ఆట పేరుప్రఖ్యాతుల మీదనే ఇమ్రాన్ ఖాన్- మన శత్రుదేశం పాకిస్తాన్‌కి ప్రధానమంత్రి అయినాడు. ప్రధాని నరేంద్ర మోదీ గారి మహోన్నత అధికార పక్షం భాజపాకూడా- 'రేపు 2019లో పార్లమెంట్‌లో మిమ్మల్ని కూర్చోబెడతాం రండ'ని క్రికెటర్లకి కన్నుగీటుతోంది...

మన దేశంలో ఐ.పి.ఎల్. అనే ఎండాకాలం క్రికెట్ జాతరకు మొత్తం హోల్ వరల్డ్ క్రికెట్‌కి ''ఫిదా''! ఇంతకాలం సౌరభ్ గంగూలీ పేరిట వున్న రికార్డుని (17



విజయాలు) కూడా యిప్పుడు సమం చేసి, దాన్ని దాటబోతున్నాడు మన దూకుడు దురుసు మాస్టర్ విరాట్. విదేశీ గెడ్డమీద లోగడ మన 'చొక్కా వీరుడు' సౌరభ్ గంగూలీ మహాశయుడు పదిహేడు విజయాలు సాధించాడు. ఆ 'చొక్కా'ని - యిప్పుడు చాలారకాలుగా విరాట్ కోహ్లీ లాక్కుంటున్నాడు. అంతటి దూకుడు మనవాడికే వుంది. విదేశీ గడ్డమీద మాత్రం 'పిల్లులు'.. పెరట్లో 'పిచ్'ల మీద 'పులులు'అన్న అపవాదును మన క్రికెట్ టీము చెరిపేస్తోంది. 2016లో 2,595; ఆనక 2017లో 2,818; 2018లో 2,653 'రన్స్' జేగీయమానంగా చేసిన విరాట్ ఒక్కడే మన విజయపరంపరకి కారణం కాదు. మన ఫాస్ట్ బౌలింగ్ 'రాటు' దేలింది. కపిల్ దేవ్ మన ఫాస్ట్ మీడియమ్ బౌలర్‌గా తొలి వరల్డ్ కప్ విజేతగా- ఆల్ రౌండర్‌గా ఖ్యాతిగాంచినా నాటి మన ''స్పీడు'' మాస్టర్లు అంతా- 'ఫాస్టు మీడియా' అన్న లేబిల్ తగిలించుకున్న వాళ్లే! గానీ, యివాళ మన ఇషాంత్, షమీ, బుమ్రా, యాదవ్ లాంటి అనుభవజ్ఞులు బంతి విసిరితే ప్రత్యర్థి జట్టు వీరుల పాదాల కింద భూమి కంపిస్తోంది. ముఖ్యంగా, అందరిలోకీ కుర్రాడు జస్‌ప్రీత్ బుమ్రా- రానురానూ టెస్ట్ మ్యాచ్‌ల్లో కూడా ఆడి మొనగాడిననిపించుకున్నాడు. ''బూమ్... బూమ్... బుమ్రా- గా యార్కర్ బంతుల సుడిగాలి లాగా రాణిస్తూన్న యీ పైలాపచ్చీస్ బంతివీరుడు- మొన్నటి 'బాక్సింగ్ డే'- క్రికెట్‌లో బంతులు కాదు- పిడుగులు కురిపించాడు. మన అశ్విన్‌కి దెబ్బతగలటంతో వాళ్ల 'నాథన్‌లైన్' సింహంలా విజృంభిస్తూ- మొత్తం 3 టెస్టులకీ 17 వికెట్లు లాక్కుంటే- ''ఆగు బ్రదర్! నా వికెట్లు కూడా లెక్కెట్టుకో''- అన్నట్లు జస్‌ప్రీత్ బుమ్రా ఏకంగా 20 వికెట్లు లాగేసి, వరల్డ్ రికార్డుని జేబులో వేసుకున్నాడు.

కపిల్ దేవుడే అన్నాడు- ''ఓరి పిడుగా! నువ్వు నా అంచనాల్నే తిప్పి కొట్టేశావు''- అంటూ ప్రశంసల వర్షం కురిపించాడు. అలనాటి 'కపిల్ డెవిల్'.

బుమ్రా 3 రకాల క్రికెట్‌లలోను యిక మీదట 'మస్ట్' అయినాడు. ఎన్నడో 2004లో రాహుల్ ద్రవిడ్, సౌరభ్ గంగూలీ- పాక్, బంగ్లాదేశ్ గడ్డలపై ఘన విజయాలు సాధించారు. ఆనక 2010లో వీరేంద్ర సెహవాగ్, ఎమ్మెస్ ధోనీల నాయకత్వంలో మన జట్టు ఒకే ఏడాది సీమాంతర విజయాలు నాలుగింటిని సాధించింది. అంతే... తర్వాత ఖ్యాతి- క్రెడిట్ యిప్పుడు- 2018 మన క్రికెట్ వీరులదే! దక్షిణాఫ్రికానీ, ఇంగ్లండ్‌నీ వోడించి, యిప్పుడు ఆస్ట్రేలియాని మూడు సముద్రాల నీళ్లు తాగించిమరీ వోడిస్తున్నారు అనిపిస్తోంది. విదేశీ గడ్డమీద, యింకా మూడునెలల పాటు మనవాళ్లు క్రికెట్ ఆడవలసి వుంది. ఈ ''ఊపూ', ఈ ''దూకుడూ'' ఇలాగే కొనసాగాలి. ప్రపంచకప్‌ను మనం ఈ 'వేడి'తో సాధించాలి.

లెట్ పీపుల్ సే.. ఇండియా దటీజ్ క్రికెట్!

దండకారణ్యంలో ప్రశాంతత ఎండమావేనా?

'పిడికిలి బిగించాక కరచాలనం చేయలేం..' అని అలనాడు ప్రధాని ఇందిరా గాంధీ అన్న మాటలు నేడు పాలకులకు, మావోయిస్టులకు మధ్య నెలకొన్న సంఘర్షణకు అతికినట్లు సరిపోతాయి. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మావోయిస్టులతో చర్చల ప్రక్రియ త్వరలో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఈ చర్చలు జరిగితే- ప్రభుత్వం, మావోయిస్టులు 'పిడికిలి' బిగించి కరచాలనం చేసేందుకు ప్రయత్నిస్తే ప్రయోజనం ఏమీ ఉండదు. తుపాకీ మోతలు, మందుపాతరల పేలుళ్లతో దద్దరిల్లుతున్న దండకారణ్యంలో శాంతి కుసుమం వికసించాలంటే అటు ప్రభుత్వం, ఇటు మావోలు చిత్తశుద్ధితో చర్చల ప్రక్రియను జరపాలి. తమ పార్టీ గెలిస్తే మావోలతో చర్చలు జరుపుతామని కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీనికి తగ్గట్టుగా ముఖ్యమంత్రి భూపేష్ బాగేల్ సంకేతాలు పంపడం ఆహ్వానించదగిన పరిణామం. దండకారణ్యంలో 'బుల్లెట్‌కు బుల్లెట్'అనే విధానం విఫలమైందని, కొత్త ఆలోచనలతో చర్చలు జరిపే తరుణం ఆసన్నమైందని బాగేల్ అన్నారు.

దండకారణ్యంలో పారా మిలటరీ బలగాల క్యాంపులు ఎక్కువగా ఉన్నాయి. ఇలా బలగాలను మోహరించడం వల్ల ఉపయోగం లేదని బాగేల్ పేర్కొన్నా, ఆచరణలో ఆయన మాటలను అధికార యంత్రాంగం వింటుందనే నమ్మకం లేదు. ఎదురుకాల్పుల సంఘటనల్లో ఎంతమంది మరణించారని మృతదేహాలను లెక్కించుకోవడం లాంటి పరిస్థితులు పునరావృతం కానివ్వమని కొత్త సీఎం అంటున్నారు. బస్తర్ అభివృద్ధికి, దండకారణ్యంలో శాంతికి మావోలతో చర్చలే శరణ్యమని బాగేల్ నమ్ముతున్నారు.

కాంగ్రెస్‌కు 15 ఏళ్ల తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో అధికారం వచ్చింది. అధికారం చేపట్టాక- ముఖ్యమంత్రులు జనం సమస్యలపై ఉల్లాసపరిచే ప్రకటనలు చేయడం రివాజు. కాలం గడిచే కొద్దీ తాను సమాజాన్ని శాసించే శక్తులు, బ్యూరోక్రసీ, ఆధిపత్యం చలాయించే వర్గాల మధ్య పావుననే విషయాన్ని ప్రతి ముఖ్యమంత్రి గ్రహించేందుకు ఎక్కువ కాలం పట్టదు. అధికారాన్ని రుచిమరిగిన నేతలు మావోలతో చర్చల ప్రక్రియ అనే సంక్లిష్టమైన పాలనా నిర్ణయాలను అమలు చేసే శక్తిని సహజంగానే కోల్పోతారు. ఛత్తీస్‌గఢ్ లాంటి వెనకబడిన చిన్న రాష్ట్రంలో పరిస్థితి గురించి పెద్దగా మదింపువేయాల్సిన పనిలేదు. చర్చలు జరుగుతాయా? లేదా? అనే విషయం పక్కనపెడితే, ప్రభుత్వం నుంచి సానుకూల సంకేతాలు దండకారణ్యంలోకి వెళ్లాయి. ఈ చర్చలపై పౌర హక్కుల సంఘాలు, మానవ హక్కుల సంస్థలు, జర్నలిస్టులు, ప్రజాస్వామ్య సంఘాలు, అధికారంలోకి ఎప్పటికీ రాని కొన్ని పార్టీల నేతలు ఎక్కువగా ఆశలు పెట్టుకుంటారు. వీరంతా వాస్తవానికి అతీతంగా ఆలోచించి అద్భుతాలు జరుగుతాయనుకుంటారు.

పదిహేనేళ్లుగా దండకారణ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చర్చల వల్ల ఉద్రిక్తతలు సడలితే ప్రజలు ఊపిరి పీల్చుకుంటారు. ప్రశాంత పరిస్థితుల్లో మావోలు కూడా స్థిమితంగా ఆలోచించేందుకు తగిన అవకాశం దొరుకుతుంది. ఇప్పటికే తమ సుదీర్ఘ పోరాటంలో మావోయిస్టులు కోలుకోలేని దెబ్బతిన్నారు. చర్చలు జరిగినంత మాత్రాన మావోలు ఆయుధాలు వదలరు, జన జీవన స్రవంతిలోకి రారు. చర్చల వల్ల- కాలదోషం పట్టిన సిద్ధాంతాలతో పోరాడుతున్న మావోల్లో తప్పనిసరిగా పరివర్తన వచ్చే అవకాశం ఉంది. ప్రపంచ చరిత్రను తిరగేస్తే రాజకీయంగా ఏ వాదం కూడా తుడిచిపెట్టుకుపోదు. క్లిష్ట పరిస్థితుల్లో మావోలు రెండడుగులు వెనక్కి వేసినా అదను చూసి మరో అడుగు ముందుకేస్తారు.

దండకారణ్యం 2005 వరకు ప్రశాంతంగా ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మావోలతో చర్చల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. తీవ్రవాద సిద్ధాంతాలను అమలు చేసే నక్సలైట్లతో పెద్ద ఎత్తున చర్చలు జరపడం ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతుంది. ఈ చర్చల వల్ల కొంతకాలం శాంతి నెలకొంది. ఈ చర్చలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు హోం మంత్రి కుందూరు జానారెడ్డి దక్షతతో నిర్వహించారు. అప్పటి పోలీసు ఉన్నతాధికారులు కూడా చర్చలు జయప్రదం కావాలని కోరుకున్నారు. నక్సలైట్ నేతలను హైదరాబాద్‌కు ఆహ్వానించి వారికి అన్ని సదుపాయాలు కల్పించారు. ఆ తర్వాత అనేక కారణాలతో చర్చలు విఫలమయ్యాయి. అనేక ఎదురుకాల్పుల ఘటనల్లో పెద్ద సంఖ్యలో నక్సలైట్లు మృతి చెందారు. సామాజిక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో మార్పులు, సంక్షేమ పథకాల అమలు, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం వంటి పరిస్థితుల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో మావోల కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన చర్చలు, విధి విధానాలను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇప్పుడు పరిశీలించాలి. ఇక్కడ తలెత్తిన లోపాలేమైనా ఉంటే సరిచేసుకోవాలి.



2005 నుంచి 2018 వరకు 14 ఏళ్ల పాటు దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని విశ్లేషిస్తే- 3165 మంది పౌరులు, 1999 మంది పోలీసులు, భద్రతా సిబ్బంది, 2897 మంది నక్సలైట్లు కలిపి 8066 మంది మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లో 832 మంది పౌరులు, 1022 మంది పోలీసులు, 1093 మంది నక్సలైట్లు కలిపి 2947 మంది, ఆంధ్రాలో 276 మంది పౌరులు, 37 మంది పోలీసులు, 429 మంది నక్సలైట్లు కలిపి 747 మంది, 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత గత ఐదేళ్లలో 8 మంది పౌరులు, 16 మంది నక్సలైట్లు కలిపి 24 మంది, ఒడిశాలో 345 మంది పౌరులు, 196 మంది పోలీసులు, 248 మంది నక్సలైట్లతో సహా 789 మంది మరణించారు.

2005లో చర్చల తర్వాత తలెత్తిన పరిణామాలను విశ్లేషిస్తే కొంత కాలం తుపాకుల మోత తగ్గినా, ఆ తర్వాత ప్రభుత్వం ఆదేశం మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేయడం, మావోలు కూడా హింసాత్మక ఘటనలకు పాల్పడడంతో ఎన్‌కౌంటర్లకు దారితీసింది. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందే నక్సలైట్లు దండకారణ్య ప్రాంతానికి తరలివెళ్లారు. ఆ తర్వాత గిరిజనుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాటానికి దిగారు. వామపక్ష తీవ్రవాదం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశాకు మకాం మార్చినట్లు స్పష్టమవుతుంది. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు పెద్దఎత్తున నిధులు ఖర్చుపెడుతున్నాయి. ఈ పథకాలు నిర్దేశించిన ఫలితాలు అందిస్తున్నాయా? లేదా? అనే విషయం పక్కన పెడితే- పేదలు ఆకలితో అలమటించే పరిస్థితులు లేకుండా చేశారు. టెక్నాలజీని వినియోగించుకుని సంక్షేమ ఫలాలను అన్ని వర్గాలకు ప్రభుత్వాలు అలవాటు చేశాయి. ప్రజలు కూడా భోగలాలసకు అలవాటుపడడంతో ఆశ్చర్యకరంగా వామపక్ష తీవ్రవాదానికి నిలువనీడ లేకుండాపోయింది.

ఆంధ్ర, తెలంగాణల్లోని వెనుకబడిన ప్రాంతాల్లో రైతులు, రైతుకూలీలు, శ్రామిక, కార్మికవర్గాల్లో చోటు చేసుకున్న మార్పులు తాత్కాలికమే. భూసంస్కరణలు పూర్తిగా అమలు కాలేదు. పేదవర్గాల్లో బయటకు కనపడే మార్పు శాశ్వతంగా ఉండకపోవచ్చు. ఇప్పుడున్న ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలి నిధుల కొరత తలెత్తితే ముందుగా వేటుపడేది సంక్షేమ రంగంపైనే. కంటికి కనపడేదంతా నిజం కాదు. బయటకు అంతా పచ్చగా కనపడుతున్నా సంపద పంపిణీ లేదు. 'పేదవాడికి భోజనం చేసేందుకు చేపను ఇవ్వకు.. చేపలను ఏ విధంగా పట్టాలో నేర్పించాలి..' అనే సిద్ధాంతానికి తిలోదకాలిచ్చేశారు. ఓటుబ్యాంకు కోణంలో అర్హత లేని వారికి కూడా సంక్షేమాన్ని వర్తింప చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ విధానం బెడిసికొట్టక తప్పదు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలితే మళ్లీ భూమి సమస్య తెరపైకి వస్తుంది.

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నంబాళ్ల కేశవ రావు ఎన్నిక కావడంతో రానున్న రోజుల్లో ఆ పార్టీ- సరికొత్త విస్తరణ, అర్బన్ నక్సలిజం ఎత్తుగడలతో ముందుకు వస్తుంది. ప్రస్తుతం నక్సలైట్లపై పోలీసు బలగాలు టెక్నాలజీ సహాయంతో పైచేయి సాధించాయి. నక్సలైట్లు తమ రాజకీయ అజెండా కోసం ప్రభుత్వంపై యుద్ధం చేస్తున్నారు. వీరికి పోలీసులు శత్రువులు కారు. సంపదను అన్ని వర్గాలకు సమానంగా పంపిణీ చేయాలనే సిద్ధాంతాన్ని వ్యతిరేకించే పార్టీలు అధికారంలో ఉంటాయి. ఈ ప్రభుత్వాలు తమ ఉనికిని కాపాడుకునేందుకు పోలీసుల భుజం మీద తుపాకీ పెట్టి నక్సలైట్లను నిర్వీర్యం చేయాలని చూస్తాయి. ఈ హింసాక్రీడలో బలయ్యేది పోలీసులు, నక్సలైట్లు, సాధారణ పౌరులే. పోలీసు సంస్కరణలకు మూల పురుషుడు, రిటైర్డు పోలీసు డైరెక్టర్ జనరల్ ప్రకాశ్ సింగ్ - 'నేను నక్సలైట్ల గురించి నిస్సంకోచంగా చెప్పేందుకు వెనకాడను. నక్సలైట్లలో చాలా మంది రాజకీయ సిద్ధాంతాలకు ప్రేరేపితులై వచ్చారు. ఒక ఉదాత్తమైన లక్ష్యం కోసం పోరాడుతున్నామనే భావనతో ఉన్నారు. ప్రస్తుతం మన చట్టసభల్లో చొరబడిన నేరగాళ్ల కంటే నక్సలైట్లే మేలు. క్రిమినల్స్ సైతం మంత్రులు అవుతున్నారు' అని చెప్పారు. ఇంటెలిజెన్స్ బ్యూరో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్డయిన ఎం.కృష్ణధర్ ఓ సందర్భంలో మాట్లాడుతూ,'భారత్‌లో మావోయిస్టు పార్టీ ఉద్యమం గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మధ్య ఉన్న వ్యత్యాసానికి నిదర్శనం. పోలీసు చర్యల ద్వారా నక్సలైట్ సమస్యను పరిష్కరించలేం' అన్నారు.

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రానున్న రోజుల్లో నక్సలైట్లతో చర్చల ప్రక్రియను ఎలా ప్రారంభించబోతుందనే విషయమై దేశ వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. 15 ఏళ్లుగా దండకారణ్యంలో రక్తం ఏరులై పారుతోంది. ఈ రాష్ట్రంలో ఇంద్రావతి, ప్రాణహిత, శబరి, గోదావరి నదుల మధ్య విస్తరించి ఉన్న దండకారణ్యంలో శాంతి నెలకొనేందుకు ప్రభుత్వం పెద్ద అడుగు వేయాలి. రాజ్యాంగ విధులు కాపాడేందుకు పోలీసు బలగాలను నక్సలైట్లపైనే వినియోగించడమా ? నక్సలైట్లు కూడా కాలదోషం పట్టిన సిద్ధాంతాలను వదిలి జనజీవన స్రవంతిలోకి రావాలి. తెలుగురాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాదం ఉద్యమ వ్యాప్తిలో కీలకపాత్ర వహించిన ప్రజా గాయకుడు గద్దర్ కూడా చివరకు బుల్లెట్ కంటే బ్యాలెట్ పదునైన ఆయుధం అని ప్రకటించాడు. భార్యతో కలిసి వచ్చి ఓటు వేశారు. భారతీయ సాంస్కృతిక, సామాజిక వ్యవస్థలకు వ్యతిరేకమైన వామపక్ష తీవ్రవాదం ద్వారా నక్సలైట్లు సాధించేదేమీ లేదు. జన జీవన స్రవంతిలోకి వారు అడుగుపెట్టి, భ్రష్టుపట్టిన రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పేలా ప్రజాస్వామ్య పంథాలో నడవాలి.

-కె.విజయ శైలేంద్ర 98499 98097


'దండన' పేరిట శిక్షలు దారుణం

ఉపాధ్యాయులు క్రమశిక్షణ పేరుతో విద్యార్థులు చేసే చిన్న తప్పులకు సైతం పెద్దశిక్షలు వేయడం తరచుగా మనం గమనిస్తున్నాం. విద్యార్థులు సరిగ్గా చదవడం లేదని, హోం వర్క్ చేయలేదని, పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని, ఫీజులు సకాలంలో చెల్లించలేదని, టై బెల్టు, షూ, యూనిఫాం లాంటివి ధరించలేదనే చిన్న చిన్న విషయాలకు కూడా ఉపాధ్యాయులు అనవసరంగా ఆవేశపడి విద్యార్థులను అమానవీయంగా శిక్షిస్తున్నారు. ఎండలో నిలబెట్టడం, బెత్తంతో కొట్టడం, బట్టలు ఊడదీసి నిలబెట్టడం, గోడ కుర్చీ వేయించడం, మోకాళ్ళపై కూర్చోబెట్టడం లాంటి 'శిక్ష'లు విధిస్తున్నారు. ఇలా ఉపాధ్యాయులు విద్యార్థులకు 'దండన' పేరిట శిక్షలు వేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పిల్లలను దండించాల్సిన సందర్భాలలో ఉపాధ్యాయులు తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా విద్యార్థులు చేసిన తప్పులకు కారణాలను వెతకాలి. వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించాలి. విద్యార్థి తన తప్పులను సరిదిద్దుకునే అవకాశం కల్పించాలి. అప్పటికీ విద్యార్థులు తమ తప్పులను సరిదిద్దుకోలేకపోతే ఉపాధ్యాయులు ముందుగా వారిని హెచ్చరించాలి. తర్వాత విద్యార్థుల తల్లిదండ్రులను, సంరక్షకులను సంప్రదించి తగు జాగ్రత్తలను తీసుకోమని చెప్పాలి. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ప్రధానోపాధ్యాయులకో, విద్యాశాఖ అధికారులకో ఫిర్యాదుచేయాలి కానీ విద్యార్థులను కఠిన దండనలకు, శిక్షలకు గురిచేయకూడదు.

ఉపాధ్యాయులు తొందరపడి విద్యార్థులను శారీరకంగా హింసించడం దుర్మార్గమైనది, చట్టవిరుద్ధమైనది. ఉపాధ్యాయులు తాము విద్యార్థులను అదుపులో ఉంచడం కోసమే దండించామని చెబుతుంటారు. అందులో నిజమెంత? క్రమశిక్షణలో ఏకైక ఉద్దేశం ఏమిటంటే మనకు కావలసిన ప్రవర్తనను విద్యార్థులకు నేర్పడం. వారు తమ అనుచిత ప్రవర్తనను గుర్తించుకొనేలా, సరైన మార్గంలో పయనించేలా చేయాలి. ఇది దండనల ద్వారా సాధ్యమవుతుందా? అన్న విషయాన్ని టీచర్లు, పాఠశాల నిర్వాహకులు బేరీజు వేసుకోవాలి.

ఉపాధ్యాయులు ఏమీ చేయకూడదని ఎవరూ చెప్పరు. అయితే, పిల్లల్ని కొట్టడం, గుంజీళ్లు తీయించడం, గోడ కుర్చీ వేయించడం, చెంప దెబ్బలు వేయించడం, పరిగెత్తించడం, ఎండలో నిలబెట్టడం, జుట్టుపట్టి లాగడం, కర్రతో లేదా ఇతర వస్తువులతో కొట్టడం వంటి పనులన్నీ శారీరక దండన కిందకు వస్తాయి. విద్యార్థులను శారీరక దండనలకు గురిచేయకూడదు. అదే విధంగా పిల్లలను మానసికంగా హింసించడం అంటే వారిని అందరి ఎదుట తిట్టడం, కించపరచడం, ఆటలలో, పాటలలో పాల్గొనడానికి అవకాశం ఇవ్వకపోవడం, తరగతి గది నుంచి ఇంటికి పంపించి వేయడం, తల్లిదండ్రులను రప్పించి వారి ముందు తిట్టడం, ఇతరులతో పోల్చడం, అవమానించడం, తరగతి గదిలోకి అనుమతించకపోవడం, చీదరించుకోవటం, పేర్లుపెట్టడం, తల్లిదండ్రులు చేసే పనిని, కులాన్ని అపహాస్యం చేయడం, ఆరోగ్య స్థితిని, శారీరక స్థితిని చూసి వెక్కిరించడం, గేటుముందు నిలబెట్టడం, అంగ వైకల్యాన్ని వెక్కిరించడం ఇలాంటివన్నీ మానసిక దండన కిందకు వస్తాయి. ఇలాంటి పనులకు ఉపాధ్యాయులు ఎన్నడూ చేయకూడదు. కుల, మత, భాష, రంగు, జాతి, లింగ, ప్రాంతం మొదలైన వాటిలో తేడా చూపడాన్ని వివక్షగా చెప్పవచ్చు.



ప్రస్తుత పరిస్థితులలో పాఠశాలల్లో విద్యార్థినులు లైంగిక వేధింపులకు సైతం గురవుతున్నారు. బాలురపైనా పలురకాల వేధింపులు చూస్తున్నాము. విద్యార్థులను ఎటువంటి వివక్షకు, లైంగిక వేధింపులకు గురిచేయకూడదు. ఉపాధ్యాయులు విద్యార్థులను దండనలకు గురిచేయడంలో కారణాలు విశ్లేషిస్తే పని ఒత్తిడి, పాఠశాల యాజమాన్యం లక్ష్యాలను నిర్దేశించడం, వాటిని చేరుకోవడంలో ఆందోళన, విద్యార్థులపై తల్లిదండ్రులు ఆకాంక్షలు పెరిగిపోవడం తదనుగుణంగా విద్యార్థి స్థాయిని గమనించకుండా విద్యార్థిని ఒత్తిడికి గురిచేయడం నేడు సర్వసాధారణమైంది. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థలు నేడు అనుసరిస్తున్న వ్యాపార ధోరణులు, ఉపాధ్యాయులలో తగిన శిక్షణ లేకపోవడం, విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోకపోవడం, టీచర్లకు ఉద్యోగ భద్రత లేకపోవడం, సరైన అధ్యయనం చేయకుండా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయలేక దండించడం, ఉపాధ్యాయులలో ఉన్న అసహనం ఇవన్నీ కారణమవుతున్నాయి.

చట్టాలు ఏం చెబుతున్నాయి...?

ఉచిత నిర్బంధ విద్య బాలల హక్కు చట్టం-2009 సెక్షన్ 17 ప్రకారం శారీరకంగా శిక్షించడం, మానసికంగా వేధించడం నేరం. ఏ బాలుడు, బాలిక కూడా శారీరక శిక్షలకు, మానసిక వేధింపులకు గురికాకూడదు. దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉద్యోగ నియమాల ప్రకారం ఉపాధ్యాయులు క్రమశిక్షణ చర్యలకు గురవుతారు. దండిస్తేనే చదువు వస్తుందని నమ్మడం, తమకు అలాగే చదువు వచ్చింది కాబట్టి తాము బోధించే వారికి కూడా అలాగే బోధించడం సరైనదని భావించడం అనేది ఒక అపోహ. భయపెట్టినప్పుడు మాత్రమే పిల్లలు క్రమశిక్షణతో ఉంటారని భావించడం లాంటి విశ్వాసాలను ఉపాధ్యాయులు విడనాడాలి.

పిల్లలు బాగా చదవాలని కోరికతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ఒత్తిడికి గురిచేయడం వల్ల ప్రతికూల స్వభావం ఏర్పడుతుందే తప్ప ఆశించిన ఫలితాలు నెరవేరవు. దండన అనేది మనం ఏమి ఆశించి విధిస్తున్నాం? దండనకు, అభ్యసనానికి మధ్య సంబంధం ఏమిటి? అనే విషయాలు తెలుసుకోవాలి. పిల్లల్లో అభ్యసనం అనేది వారికి కల్పించిన బోధనాభ్యసన ప్రక్రియలు, కల్పించిన అవకాశాలు, నైపుణ్యాలు, ఆసక్తులు, వైఖరులు మొదలైన వాటినిబట్టి ఆధారపడి ఉంటుంది. పిల్లలను నియంత్రించడం ద్వారా, దండనల ద్వారా అభ్యసనం సాధ్యం కాదు. భయపూరిత వాతావరణంలో అభ్యసనం జరగదు. పిల్లల్లో ఆశించిన అభ్యసనం, సామర్థ్యాలు రాకపోతే అందుకు కారణాలను అన్వేషించి, పరిష్కార మార్గాలను అన్వేషించి అమలు చేయాలి. అందుకు విరుద్ధంగా విద్యార్థుల స్వేచ్ఛను హరించడం, వారిని దండనలకు గురిచేయడం ఎంతమాత్రం తగదు. పిల్లల స్వభావానికి వ్యతిరేకమైన విధానాలను అవలంబించకుండా ఇంట్లోనూ, పాఠశాలలోను పిల్లల స్వభావాన్ని అర్థం చేసుకొని బాల్యాన్ని ఒక నిర్మాణాత్మక దశగా గుర్తించాలి. భయ రహిత వాతావరణాన్ని కల్పించాలి. అటువంటి సందర్భాలలో మాత్రమే ఆశించిన ఫలితాలను సాధించవచ్చు. ఎలాంటి దండనలు,వివక్షలు లేకుండా ఉండటం, విద్యార్థుల భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశాలు కల్పించడం, అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, ఒత్తిడి లేకుండా లక్ష్యాలను సాధించడం వంటివి భయరహిత వాతావరణంలో సాధ్యమవుతాయి. అటువంటి భయరహిత వాతావరణం కల్పించాలి, విద్యార్థుల స్వేచ్ఛా వ్యక్తీకరణకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు పాటుపడాలి.

-వాసిలి సురేష్ 94946 15360

'వందేమాతరం' ఆలపించి తీరుతాం

❒ మధ్యప్రదేశ్ సీఎం ఆంక్షలపై చౌహాన్ మండిపాటు

భోపాల్, జనవరి 2: మధ్యప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున వందేమాతరాన్ని ఆలపించే సంప్రదాయంపై నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఆంక్షలపై మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బుధవారం మండిపడ్డారు. ఎన్ని ఆంక్షలు విధింన తమ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవ దినాన ఆ గీతాన్ని ఆలపించి తీరుతారని స్పష్టం చేశారు.

ప్రతినెలా మొదటి పనిదినం రోజున సచివాలయంలో వందేమాతర గీతాన్ని ఆలపించే సంప్రదాయానికి తిలోదకాలిస్తూ జనవరి ఒకటిన ఆ గీతాన్ని పాడకపోవడంపై ముఖ్యమంత్రి కమలనాథ్‌ను తప్పుబట్టారు. ఇది ఆయన ఆజ్ఞల మేరకే జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. కాగా, దీనిపై సీఎం కమలనాథ్ స్పందిస్తూ వందేమాతరం ఆలాపన నిలిపివేయడం తాత్కాలికమేనని, కొత్తవిధానంలో దీనిని నిర్వహించడానికే తాము అలా చేశామని స్పష్టం చేశారు. అసెంబ్లీ, సచివాలయాలలో ప్రతినెలా మొదటి రోజున వందేమాతర గీతాన్ని ఆలపించడం 13 సంవత్సరాలుగా సంప్రదాయంగా వస్తోంది. శివరాజ్ సంగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని కొత్తగా వచ్చిన ప్రభుత్వం నిలిపివేయడంపై ఆయన ట్వీట్ చేస్తూ అసెంబ్లీ సమావేశాల మొదటిరోజైన జనవరి ఏడున తాను, తన పార్టీ ఎమ్మెల్యేలు వల్లభ భవన్ (సచివాలయం)లో వందేమాతరాన్ని ఆలపించి తీరుతామని చౌహాన్ స్పష్టం చేశారు. ప్రజలు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తాను ఆహ్వానిస్తున్నానని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వారికి వందేమాతరం పాట పాడటం రాదో, లేక వారు దానిని పాడటాన్ని అవమానంగా భావిస్తున్నారో తాను తెలుసుకోవాలనుకుంటున్నానని ఆయన ట్వీట్ చేశారు. ప్రజలతో కలిసి ప్రతినెలా మొదటి రోజు తాను వందేమాతరాన్ని పాడుతానని ఆయన స్పష్టం చేశారు. దేశభక్తిని పెంపొందించే ఇంత మంచి సంప్రదాయాన్ని కమలనాథ్ ప్రభుత్వం ఎందుకు వద్దనుకుంటుంటో స్పష్టం చేయాలని బజీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయ్‌వర్గీయ డిమాండ్ చేశారు. ఈ గీతంతో తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని ఒక వర్గం వారు ఎన్నాళ్లుగానో చేస్తున్న వాదనకు లొంగి ఆయన ఈ నిర్ణయానికి వచ్చి ఉంటారని తాము భావిస్తున్నామని ఆయన ఆరోపించారు.

కొత్త విధానం కోసమే: కమలనాథ్

ప్రతినెలా మొదటి పనిదినం రోజున సచివాలయంలో వందేమాతర గీతాన్ని ఆలపించే సంప్రదాయాన్ని రద్దు చేసే ఆలోచన తమకేమాత్రం లేదని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమలనాథ్ తెలిపారు. దీనిని నూతన విధానంలో రూపకల్పన చేయడానికే దానిని తాత్కాలికంగా రద్దు చేసినట్టు ఆయన చెప్పారు. అంతేగాని దీనిని రద్దు చేయాలన్న అజెండాగాని, ఆలోచన గాని, వత్తిడి గాని లేదని ఆయన తెలిపారు. వందేమాతర గీతం మన హృదయాల్లో పటిష్టంగా నాటుకుపోయి ఉందని, దానిని కొత్త విధానంలో త్వరలోనే పునరుద్ధరిస్తామని ఆయన స్పష్టం చేశారు. దీనిని కొన్ని పార్టీల వారు రాజకీయం చేయడాన్ని ఆయన ఖండించారు. మందిర నిర్మాణం, ఆలయాలు, వందేమాతరం పేరిట తమ పార్టీ రాజకీయాలు చేయదని కమలనాథ్ విమర్శించారు.



ఢిల్లీలో కాలుష్యంతో కూడిన దట్టమైన పొగమంచులోనూ యమునా నది ఒడ్డును ఆటాడుతున్న ఓ బాలుడు

కేరళ ప్రభుత్వానికి నూకలు చెల్లాయి

❒ శబరిమల వివాదంపై ధ్వజమెత్తిన కాంగ్రెస్
❒ ఆలయ సంప్రోక్షణ సరైన చర్య: ప్రతిపక్ష నేత రమేష్ చెన్నితల
❒ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉద్ధృతం చేస్తాం: బీజేపీ

తిరువనంతపురం, జనవరి 2: శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళలకు భద్రత కల్పించి ప్రవేశించేందుకు ఏర్పాట్లు చేసిన కేరళ సీఎం విజయన్ వైఖరిపై కాంగ్రెస్, బీజేపీలు భగ్గుమన్నాయి. ప్రతిపక్షనేత, సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితల మాట్లాడుతూ హిందువుల సెంటిమెంట్లను సీపీఎం ప్రభుత్వం గాయపరిచిందన్నారు. ముఖ్యమంత్రి విజయన్ దుర్మార్గంగా వ్యవహరించారని, తలబిరుసు వైఖరిని ప్రదర్శించారన్నారు. పోలీసుల భద్రత కల్పించి ఆలయ ప్రవేశానికి సీఎం ఎందుకు చొరవ తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు. ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణం చేయడం మంచి నిర్ణయమని, ఈ నిర్ణయాన్ని తాను సమర్థిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ప్రభుత్వ వైఖరికి నిరసనగా తాము రాష్ట్రంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ శ్రీధరన్ మాట్లాడుతూ స్వామి అయ్యప్ప ఆగ్రహానికి సీపీఎం ప్రభుత్వం గురి కాక తప్పదన్నారు. త్వరలోనే దీనికి తగిన మూల్యం చెల్లించకతప్పదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. సీపీఎం అజెండా స్పష్టమైందన్నారు. సీఎం మొండిగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. కేరళ ప్రజలను మోసం చేశారన్నారు.

సచివాలయానికి గోవా సీఎం పారికర్

❒ మంత్రులతో కీలక భేటీ

పనాజీ, జనవరి 2: చాలాకాలం నుంచి అస్వస్థుడిగా ఉన్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ బుధవారం పలువురు మంత్రులతో సమావేశమయ్యాయి. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సీఎం పలు అంశాలపై చర్చించారు. 63ఏళ్ల పారికర్ పాంక్రియాట్రిక్‌తో బాధపడుతున్నారు. ముంబయిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన పారికర్ మెరుగైన వైద్యం కోసం అమెరికా వెళ్లి వచ్చారు. నాలుగు నెలల నుంచి అధికార కార్యక్రమాలకు దూరంగా ఉన్న ఆయన మంగళవారం సచివాలయానికి వచ్చారు. బుధవారం ఉదయం 10.30కి సచివాలయానికి చేరుకున్నట్టు అధికార ప్రకటనలో వెల్లడించారు.'మంత్రులు, సీనియర్ అధికారులతో మధ్యాహ్నం 1 గంట వరకూ సీఎం సమావేశమయ్యాయి'అని ఆ ప్రకటనలో తెలిపారు. పట్టణాభివృద్ధి మంత్రి మిలింద్ నాయక్, పంచాయతీ రాజ్ మంత్రి మౌవిన్ గొడిన్‌హో, మత్స్యశాఖ మంత్రి వినోద్ పాలేకర్ సమావేశానికి హాజరైనట్టు సీఎంవో స్పష్టం చేసింది. డీజీపీ ముక్తేష్ చందర్‌మో సీఎం మాట్లాడారు. ఎన్‌సీపీ ఎమ్మెల్యే చర్చిల్ అలెమో ముఖ్యమంత్రి పారికర్‌తో భేటీ అయినట్టు సీఎంవో తెలిపింది.

ఈ ఏడాది ఎండలే ఎండలు!

❒ వాతావరణ శాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 2: గత ఏడాదికి చలితో వీడ్కోలు పలికినా 2019లో అధిక ఉష్ణోగ్రతలు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఎల్ నినో తదితర కారణాల వల్ల ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేసింది. అధికంగా టెంపరేచర్లు నమోదవుతాయని వరల్డ్ మెట్రోలాజికల్ ఆర్గనైజేషన్(డబ్ల్యూఎంవో) పేర్కొంది. 2018 డిసెంబర్- 2019 ఫిబ్రవరి వరకూ 'ఎల్ నినో' ప్రభావం అధికంగా ఉండి, 75-80 శాతం నమోదవుతుందని సంస్థ తెలిపింది. ఎల్ నినో పసిఫిక్ జలాలతో సమ్మిళితమై ఉపఖండం వాతావరణంపై విపరీతమైన ప్రభావం చూపుతుందని వెల్లడించారు. 2018లో శీతలగాలులు దేశమంతా విస్తరించి విపరీతమైన చలి సంభవించినట్టు భూశాస్త్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం రాజీవన్ స్పష్టం చేశారు. ఉష్ణోగ్రతలు పడిపోయాయని ఆయన అన్నారు. అయితే కొత్త సంవత్సరంలో పరిస్థితులు దీనికి భిన్నంగా ఉంటాయని ఆయన విశ్లేషించారు.'ఎల్‌నినో, ప్రపంచ వాతావరణ మార్పులు ప్రభావం వల్ల వేసవి, శీతాకాలంలోనూ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువ స్థాయిలోనే నమోదవుతాయి'అని భారత వాతావరణ శాఖ అదనపుడైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర స్పష్టం చేశారు. ఎల్‌నినో ముందే ప్రవేశించడం వల్ల రుతుపవనాలు, వర్షాలపైనా తీవ్రంగా ఉంటుందని రాజీవన్ వెల్లడించారు. ఏప్రిల్-మే మాసానికి ఎల్‌నినోవెళ్లిపోయినా దాని ప్రభావం రుతుపవనాలపై తీవ్రంగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అననుకూల వాతావరణ పరిస్థితులు తీవ్రమైన ప్రభావం చూపుతాయని మహాపాత్ర చెప్పారు. వేడిగాడ్పులకు అల్లకల్లోలం రేపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా 2018లో అరేబియా మహాసముద్రం, బంగాళాఖాతంలో ఏడు తుపానులు ఏర్పడ్డాయి. నాలుగింటి ప్రభావం దేశంలోని ప్రధాన భూభాగంపై అధికంగా ఉంది. డాయే(సెప్టెంబర్ 19-12), తిత్లీ(అక్టోబర్ 8-13), గజా(నవంబర్ 10-19) పెథాయ్(డిసెంబర్ 13-18) తుపాన్లు సంభవించాయి. అంతకు ముందు సంవత్సరంతో పోల్చుకుంటే 2018లో ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదయ్యాయి. అయితే పిడుగుపాటు మాత్రం 300 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇవి ఉత్తరభారతంలోనే ఎక్కువగా సంభవించాయి. అలాగే నైరుతీ,ఈశాన్య రుతుపవనాలు సాధారణ స్థాయికంటే తక్కువగానే నమోదయ్యాయి. వాతావరణ ప్రతికూలతలు వ్యవసాయం రంగాన్ని బాగా దెబ్బతీశాయి.

ఎన్నికల సమయంలో 33.5 లక్షల మందికి శిక్షణ!

న్యూఢిగల్లీ, జనవరి 2: దేశంలో 2014-15 నుంచి 2017-18 సీజన్ వరకూ ఐటీ, దాని అనుబంధ రంగాల్లో సుమారు 33.5 లక్షల మందికి శిక్షణ ఇచ్చినట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఈఐటీ) నివేదిక స్పష్టం చేసింది. ఎన్నికల సమయంలో ఈ శిక్షణను ఇప్పించడం జరిగిందని కేంద్ర ఎలాక్ట్రానిక్స్, ఐటీ రంగ శాఖ మంత్రి ఎస్ఎస్ అహ్లూవాలియా లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నైపుణ్య శిక్షణ ఇప్పించడం ద్వారా వారి సేవలను వినియోగించుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు. నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకత (ఎంఎస్‌డీఈ) సంస్థ ద్వారా 5.41 లక్షల మందికి 2014-15 ఎన్నికల సమయంలో శిక్షణ ఇచ్చినట్టు మంత్రి తెలిపారు. అదే విధంగా 2017-18 ఎన్నికల సమయంలో 10.48 లక్షల మంది శిక్షణ పొందినట్టు వివరించారు.

ఆరోపణలు నిరూపించాలి

❒ బీజేపీకి సవాలు విసిరిన సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 2: తమ పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన ఆరోపణలు, ప్రకటనల్లోని అంశాలను నిరూపించాలని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత సిద్దరామయ్య బీజేపీ నాయకులకు సవాలు విసిరారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, తమ పార్టీ నుంచి కొంత మంది ఎమ్మెల్యేలు బీజేపీలోకి వెళుతున్నట్టు వచ్చిన వార్తలన ఖండించారు. అలాంటి పరిణామం ఏదీ జరగడం లేదని, కర్నాటకలోని సంకీర్ణ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారీగా డబ్బు ఇస్తామని నమ్మబలికి, ఎమ్మెల్యేలను ఆకర్షించాలనే ప్రయత్నాలకు బీజేపీ స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. తమ పార్టీకి చెందిన బీసీ పాటిల్‌కు డబ్బు ఎర చూపించలేదా అని నిలదీశారు. కర్నాకలో ప్రభుత్వం ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి కాలం పదవిలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

కాక్‌పిట్‌లో పొగలు

❒ ముందే ల్యాండ్ అయిన ఇండిగో విమానం

అహ్మదాబాద్, జనవరి 2: విమానం కాక్‌పీట్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా ఇండిగో విమానం అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రాధాన్యత ల్యాండింగ్ వల్ల అరగంట ముందే ఇక్కడకు చేరుకుంది. న్యూఢిల్లీ నుంచి అహ్మదాబాద్ వెళ్లే 6ఇ6373 ఇండిగో విమానం మంగళవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 7.42 గంటలకు బయలుదేరింది. అయితే కొద్దిసేపటి తర్వాత కాక్‌పిట్, కేబిన్‌లోంచి పొగ రావడాన్ని గమనించిన పైలట్ అహ్మదాబాద్ ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్ అత్యవసర కాల్ చేసి తమ విమానం ప్రయారిటీ ల్యాండింగ్‌కు అనుమతించాలని కోరాడు. దానికి ఏటీసీ వారు అనుమతించడంతో నిర్దేశిత సమయానికన్నా అరగంట ముందుగా 8.57 గంటలకు అహ్మదాబాద్ విమానాశ్రయంలో ల్యాండయ్యింది. కాగా, సాంకేతిక కారణాల వల్ల ఇండిగో విమానం ముందుగా ల్యాండవ్వడం ఇది రెండోసారి. మంగళవారం బయలుదేరిన తమ విమానంలో పొగ, వాసన రావడాన్ని గమనించిన సిబ్బంది ముందు జాగ్రత్తగా ప్రయారిటీ ల్యాండింగ్‌ను కోరారని, స్వల్ప సాంకేతికపరమైన సమస్య వల్ల ఇది ఏర్పడిందని, దానిని తమ ఇంజనీర్లు సరిచేసి తదుపరి సర్వీసుకు సిద్ధం చేశారని ఇండిగో అధికార వర్గాలు తెలియజేశాయి.

పాక్ సరిహద్దుల్లో మానసిక వైకల్యం ఉన్న వ్యక్తి అరెస్టు

❒ విచారిస్తున్న ఐబీ అధికారులు

జైపూర్, జనవరి 2: రాజస్థాన్ సరిహద్దుల్లో పాక్‌వైపు వెళ్లడానికి ప్రయత్నించిన ఒక వ్యక్తిని బీఎస్ఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. 40 ఏళ్ల ఈ వ్యక్తి పేరు బిల్లూ. మునాబో సరిహద్దు వద్ద బిల్లూను అదుపులోకి తీసుకున్నామని బీఎస్ఎఫ్ జవాన్లు చెప్పారు. ఈ వివరాలను డీఐజీ గురుపాల్ సింగ్ నిర్ధారించారు. మానసిక వైకల్యంతో బిల్లూ బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇంటెలిజెన్స్ పోలీసులకు బిల్లూను అప్పగించామన్నారు. ఈ ఘటనతో సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

అటకెక్కిన ఆర్మీ యుద్ధ ట్యాంకుల ఆధునీకరణ ప్రాజెక్టు

❒ ఎఫ్ఐసీవీ ప్రాజెక్టుల కొనుగోలుపై కుదరని ఏకాభిప్రాయం
❒ ప్రాజెక్టు అంచనా రూ.60వేల కోట్లు
❒ త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం
❒ రక్షణ రంగం ఆధునీకరణ దిశగా చైనా, పాకిస్తాన్

న్యూఢిల్లీ, జనవరి 2: దేశ రక్షణ వ్యవస్థను పటిష్టం చేయడంలో భాగంగా రూ.60వేల కోట్ల వ్యయంతో ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన శతఘ్నులు, ఫిరంగుల యుద్ధ వాహనాల ప్రాజెక్టు (ఎఫ్ఐసీవీ) అటకెక్కింది. ఈ ప్రాజెక్టును అమలు చేయాలని పదేళ్ల క్రితం కేంద్ర రక్షణ శాఖ నిర్ణయించింది. మొత్తం 2600 ఫ్యూచర్ ఇన్‌ఫాంట్రీ కంబాట్ వెహికల్స్ (ఎఫ్ఐసీవీ)ని కొనుగోలు చేయాలనుకున్నారు. కాని వీటి పనితీరుపై రక్షణ రంగ నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీనికి తోడు దేశీయ పరిజ్ఞానంతో ఆధునిక యుద్ధ ట్యాంకులను తయారు చేయాలన్న ప్రతిపాదనకు కూడా మోక్షం లభించలేదు. ఎఫ్ఐసీవీ యుద్ధ ట్యాంకులను కొనుగోలు చేసే విషయమై తాజాగా రక్షణ రంగ నిపుణులు త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. గత నెల సమావేశమై నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. కాని అనివార్య కారణాల వల్ల ఈ సమావేశం వాయిదా పడింది. 2009లో ఎఫ్ఐసీవీ ట్యాంకుల ప్రతిపాదనను ఆర్మీ నిపుణులు తెరపైకి తెచ్చారు. దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచి ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనుకున్నారు. కాని కొన్ని ప్రైవేట్ కంపెనీలు ముందుకు వచ్చాయి. వీటి ఎంపికపై ఏకాభిప్రాయానికి నిపుణులు రాలేకపోయారు. సరిహద్దుల్లో దూసుకువచ్చే క్షిపణులను మోసుకొచ్చే ట్యాంకులపై దాడులు చేసే ఎఫ్ఐసీవీ వాహనాలు, పరికరాలను వినియోగిస్తారు. ప్రస్తుతం మన ఆర్మీ వద్ద రష్యాలో తయారైన బీఎంపీ-2 ఇన్‌ఫాంట్రీ వాహనాలు ఉన్నాయి. 2025లో ఎఫ్ఐసీవీని ఆర్మీకి సమకూర్చాలని తొలుత భావించారు. చైనా, పాకిస్తాన్‌లో రక్షణ రంగ వ్యవస్థను ఆధునీకరించుకుంటున్నారు. మన దేశం ఈ విషయంలో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. భారత్ సరిహద్దును ఆనుకుని ఉన్న టిబెట్ ఆటానమస్ రీజియన్‌లో చైనా తన సైనిక పాటవాన్ని ఎనిమిది రెట్లు అభివృద్ధి చేసుకుంది. ట్యాంకుల విషయంలో కూడా పాకిస్తాన్ ఆధునీకరణలో ముందంజలో ఉంది. తాజాగా మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ డిఫెన్స్, ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్, భారత్ ఫోర్జ్ సంస్థలు ఎఫ్ఐసీవీ ఉత్పత్తులను తయారు చేసేందుకు ముందుకు వస్తున్నాయి. చైనాతో మనకు 4వేల కి.మీ సరిహద్దు ఉంది. చైనా సరిహద్దు వెంట సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో తేలిక రకం ట్యాంకులను పెద్ద ఎత్తున మోహరిస్తోంది. గత ఏడాది మన ఆర్మీ ఫ్యూచర్ రెడీ కంబాట్ వెహికల్స్ (ఎఫ్ఆర్‌సీవీ)లను కొనుగోలు చేసే విషయమై ప్రతిపాదనలను ఆహ్వానించింది.

కాశ్మీర్‌ను కప్పేసిన మంచు

❒ జమ్మూ-శ్రీనగర్ హైవే మూసివేత

శ్రీనగర్, జనవరి 2: నూతన సంవత్సరం ప్రారంభంలోనే జమ్మూకాశ్మీర్ మంచు పరదా కప్పుకుంది. కాశ్మీర్ లోయలో డిసెంబర్ మాసమంతా పొడిగా ఉన్న వాతావరణం బుధవారం ఒక్కసారిగా మారిపోయింది. మంచు ప్రభావానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. హైవే పొడవు 300 కిలోమీటర్లు. పూంచ్, రాజౌరీ, సోపియన్ జిల్లాలను హైవే కలుపుతుంది. మంచు వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకునే ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. కాశ్మీర్ ప్రాంతంలో అత్యధిక ప్రాంతం గజగజలాడింది. గుల్‌మార్గ్, పహల్‌గావ్ పర్యాటక రిసార్ట్‌లు మంచుతో నిండిపోయాయి. శ్రీనగర్‌లో తెల్లవారుజామున దారి కనిపించలేదు. జవహార్ టన్నెల్ సహా పలుప్రాంతాలను మంచు కప్పేసింది. కాశ్మీర్ వైపువెళ్లే వాహనాలు నాగ్రోటా, ఉద్ధంపూర్ వద్ద నిలిపివేశారు. వివిధ ప్రాంతాల్లో 300 వాహనాలు నిలిపివేసినట్టు అధికారులు వెల్లడించారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠస్థాయికి పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం రాత్రి శ్రీనగర్‌లో '0' డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గుల్‌మార్గ్‌లో 8.8 మి.మి మంచు కురిసింది.

సీబీఐ వలలో ఐదుగురు సైనికాధికారులు

❒ రూ.18 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం ❒ కేసు నమోదు చేసిన సీబీఐ

న్యూఢిల్లీ, జనవరి 2: అస్సో, అరుణాచల్ ప్రదేశ్‌లో సైనికులకు రేషన్‌ను సరఫరా చేసే వ్యక్తుల నుంచి రూ.18 లక్షల లంచం తీసుకుంటున్న ఐదుగురు సైనికాధికారులను సీబీఐ వల పన్ని పట్టుకుంది. లంచం తీసుకుంటున్న వారిలో కల్నల్ స్థాయి అధికారి కూడా ఉన్నారు. ఈ ఐదుగురు సైనికాధికారులపై సీబీఐ పోలీసులు కేసు నమోదు చేశారు. అవినీతికి పాల్పడినందుకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీబీఐ అధికారులు చెప్పారు. కల్నల్ రమణ్ దహడా, లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర కుమార్, సుబేదార్ దేవందర్ కుమార్, హవాల్దార్ అభయ్ సింగ్, సుబేదార్ సుహురన్ సాహు, సప్లయర్ కేకే యాంగ్ఫో ఉన్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో విధి నిర్వహణలో ఉన్న సైనికులకు రేషన్ సరఫరా చేసేందుకు సివిల్ కాంట్రాక్టులు ఉంటారు. వీరి వద్ద నుంచి సైనికాధికారులు రేషన్ కొనుగోలు చేస్తారు. వీరి వద్ద నుంచి రూ.18 లక్షల లంచం తీసుకుంటుండగా సమాచారం మేరకు దాడి చేసి సైనికాధికారులను పట్టుకున్నట్లు సీబీఐ పేర్కొంది. కాంట్రాక్టర్ నుంచి కల్నల్ రమణ్ దహడా రూ.4.5 లక్షల సొమ్ము తీసుకున్నారు. నిత్యావసర వస్తువుల నాణ్యతను నిర్ధారించాల్సిన లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర కల్నల్ కూడా అవినీతిలో పాలుపంచుకున్నారని సీబీఐ అధికారులు తెలిపారు. అధికారాన్ని దుర్వినియోగం చేసి రూ.1 లక్ష లంచం తీసుకున్నారన్నారు. యాంగ్ఫో అనే కాంట్రాక్టర్ 2015 నుంచి సైనికులకు రేషన్ సరఫరా చేస్తున్నాడు. సైనికాధికారులు రేషన్ నాణ్యత విషయంలో రాజీపడ్డారని విచారణలో తేలింది. 2012 నుంచి 2016 మధ్య ఈ తరహా స్కాం ఇక్కడ జరిగింది. అప్పట్లో రూ.82 లక్షల లంచం తీసుకున్న లెఫ్టినెంట్ కల్నల్‌లు సుతీక్షన్ రాణా, అమిత్ శర్మలపై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

మీకు దేశ భద్రత పట్టదా?

❒ డెమోక్రాట్లపై మండిపడ్డ వైట్‌హౌస్

వాషింగ్టన్, జనవరి 2: ప్రభుత్వం మూతపడిపోతుందంటూ ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ చేస్తున్న ప్రకటనలను వైట్‌హౌస్ కొట్టిపారేసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి ముందు చూపుకొరడవడడం వల్ల ఆర్థిక సంక్షోభం తలెత్తుతోందని విపక్షం సంచలన ప్రకటన చేసింది. వైట్‌హౌస్ వర్గాలు బుధవారం ఈ ప్రకటనలను పసలేనివిగా కొట్టిపారేసింది. డిసెంబర్ 22న పాలనా వ్యవస్థ పాక్షికంగా మూతపడడం మొదలైంది. ఎనిమిది లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడింది. దీని వల్ల అనేక మంది పనిలేకుండా పోవడమో లేదా వేతనాలు కోల్పోవడమో జరుగుతుంది. ప్రభుత్వ వ్యవస్థ మూతపడుతుందేమోనన్న అనుమాలకు బలం చేకూరేలా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిస్మస్, న్యూఇయర్ పర్యటన రద్దయింది. కుటుంబ సభ్యులతో కలిసి ట్రంప్ ఫ్లోరిడాలోని మారా లాగో రిసార్ట్‌కు టూర్ ఖరారు అయింది. అయితే కొన్ని కారణాల వల్ల అధ్యక్షుడు పర్యటన రద్దుచేసుకోవల్సి వచ్చింది. గడ ఏడాది సెప్టెంబర్ 30న తలెత్తిన సంక్షోభం పునరావృతమవుతోందని ప్రతిపక్ష డెమోక్రాట్లు స్పష్టం చేస్తున్నారు. గురువారం ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో ఇదే అంశంపై విపక్షం గొంతెత్తనుంది. దీనికి తోడు సరిహద్దు గోడ, భద్రతపై ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటోంది. పరిస్థితి తీవ్రతను గమనించిన అధ్యక్షుడు ట్రంప్ బుధవారం డెమోక్రాట్లు, రిపబ్లికన్‌లను అఖిలపక్ష సమావేశానికి పిలిచారు. దేశ భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి అలక్ష్యం ప్రదర్శించబోదని వైట్‌హౌస్ వర్గాలు స్పష్టం చేశాయి. అమెరికన్ల భద్రతకు, దేశ సరిహద్దులను పరిరక్షించేందుకు ట్రంప్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి శారా సాండర్స్ ఓ ప్రకటనలో వెల్లడించారు. అలాగే ప్రతిపక్ష డెమోక్రాట్లపై ఆమె విరుచుకుపడ్డారు.

జస్ట్ 20 మినిట్స్!

ముఖాముఖి చర్చకు సిద్ధమా అని ప్రధాని మోదీకి రాహుల్ సవాల్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: ఫ్రాన్స్ నుండి 36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంపై తనతో ఇరవై నిమిషాల పాటు ముఖాముఖి చర్చ జరపడానికి సిద్ధమా అని ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ. పార్లమెంటులో బుధవారం రాఫెల్ యుద్ధ విమానాలపై చర్చ జరిగిన అనంతరం రాహుల్ ఏఐసీసీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ఈ సవాల్ చేయటం గమనార్హం. మోదీ తనతో ఇరవై నిమిషాల పాటు ముఖాముఖి చర్చలు జరిపితే వాస్తవాలను వెలుగులోకి తెస్తానని రాహుల్ ప్రకటించారు. అయితే, తనతో చర్చించే ధైర్యం ప్రధానికి లేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో బుధవారం రాఫెల్‌పై చర్చ జరిగినప్పుడు ప్రధాన మంత్రి ఎందుకు సభకు రాలేదని ప్రశ్నించారు. సభను ఎదుర్కొనలేరా అని నిలదీశారు? ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీతో ఎందుకు సమాధానం ఇప్పించాల్సి వచ్చిందని మోదీని అడిగారు. సభలో జరిగిన చర్చకు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం చెప్పలేరా? అంటూ రాహుల్ ప్రశ్నలు కురిపించారు. రాఫెల్ గురించి దేశమంతా అడుగుతుంటే మోదీ మాత్రం తనను ఎవరూ అడగటం లేదని మొన్న ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకోవడం విచిత్రంగా ఉన్నదని ఆయన ఎద్దేవా చేశారు. రాఫెల్ విషయంలో మోదీ తన మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాఫెల్‌కు సంబంధించిన కొత్త ఒప్పందానికి విమానదళానికి చెందిన సీనియర్ అధికారులు అభ్యంతరం చెప్పారా? ప్రతి యుద్ధ విమానం ధరను 526 కోట్ల నుండి 1,600 కోట్లకు ఎలా పెంచారు? యుద్ధ విమానాలను తయారు చేసే కాంట్రాక్టును అనీల్ అంబానీకి ఇవ్వాలనే నిర్ణయం విమానదళం అధికారులు తీసుకున్నారా? లేక ప్రధాని సొంతంగా తీసుకున్నారా? అని రాహుల్ అడిగారు. ఒప్పందానికి సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందనీ, అందుకే ప్రధాన మంత్రి తనను గోవా ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించలేరని రక్షణ శాఖ మాజీ మంత్రి, గోవా ముఖ్యమంత్రి మనోహర్ పరిక్కర్ తన మంత్రివర్గం సమావేశంలో చెప్పారని, ఇందుకు సంబంధించిన టేప్ తన వద్ద ఉన్నదని రాహుల్ విలేఖరులతో అన్నా. 36 యుద్ధ విమానాల కొనుగోలుకు 58 వేల కోట్లతో ఒప్పందం చేసుకున్నామని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం లోక్‌సభలో చెప్పిన విషయాన్ని రాహుల్ గుర్తుచేశారు. దీని ప్రకారం ఒక్కొక్క విమానం ఖరీదు 1,600 కోట్లు అవుతుందని చెప్పారు. యూపీఏ హయాంలో ఫ్రాన్స్‌తో కుదిరిన ఒప్పందం మేరకు ప్రతి యుద్ధ విమానం ధర 526 కోట్లనే సమాచారం కూడా నేడు అరుణ్ జైట్లీ లోక్‌సభలో తెలిపారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంత కాలం రాఫెల్ యుద్ధ విమానాలకు సంబంధించిన నిజాలను దాచివేస్తే, అదే స్థాయిలో కొత్త నిజాలు వెలుగులోకి వస్తూనే ఉంటాయని రాహుల్ అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులు, విద్యార్థులకు చెందిన మూడున్నరల లక్షల కోట్లు అపహరించి, బడా పారిశ్రామికవేత్తలకు మోదీ ఇచ్చారని ఆయన ఆరోపించారు. తన స్నేహితుడైన అనీల్ అంబానీకి 30 వేల కోట్లు ఇచ్చారని మోదీపై నిప్పులు చెరిగారు. ఆయుధాలు లేని రాఫెల్ యుద్ధ విమానం, ఆయుధలతో కూడిన రఫేల్ యుద్ధ విమానానికి మధ్య తనకు తేడా తెలియదంటూ అరుణ్ జైట్లీ చేసిన ఆరోపణలో ఎలాంటి నిజం లేదన్నారు. మోదీ అవినీతికి పాల్పడ్డారని, జెపీసీని నియమిస్తే నిజానిజాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. జెపీసీ దర్యాప్తు జరిగితే మోదీ, అనీల్ అంబానీ పేర్లు వెలుగులోకి వస్తాయని రాహుల్ స్పష్టం చేశారు. 'చౌకీదార్ చోర్ హై' (కాపలాదారుడే దొంగ) అంటూ రాహుల్ విలేఖరుల సమావేశం ముగించారు.



హైకోర్టు భవన నిర్మాణంలో బాబు ఘోర విఫలం

★ వైసీపీ నేత విజయసాయి రెడ్డి ఆరోపణ

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: ఆంధ్రప్రదేశ్ నూతన హైకోర్టు భవనాల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘోరంగా విఫలమయ్యారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన పార్లమెంట్ అవరణలో ప్లకార్డు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను తానే నిర్మించానంటూ చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సరైన సమయంలో హైకోర్టు భవనాన్ని నిర్మించలేదని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విభజన చేసి అమరావతికి తరలించడం చంద్రబాబుకు ఇష్టం లేదని విమర్శించారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ ఇచ్చిన 600 హామీల అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఎన్నికల కోసం శంకుస్థాపనల పేరుతో తెలుగుదేశం పార్టీ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని దుయ్యబట్టారు. ఈ సారి రాష్ట్ర ప్రజలు తగిన విధంగా తెలుగుదేశం పార్టీకి బుద్ధి చేప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన విమర్శించారు.

పార్లమెంట్‌లో కొనసాగుతున్న తెలుగుదేశం నిరసన

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: ప్రధాని నరేంద్ర మోదీ తన మొండి వైఖరితో దేశంలోని వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారని తెలుగుదేశం పార్లమెంట్ సభ్యులు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కూడా ఆ పార్టీకి చెందిన ఎంపీలు పార్లమెంట్‌లో అవరణలోని గాంధీ విగ్రహం, ప్రధాన ద్వారం వద్ద తమ నిరసనను కోనసాగించారు. ఎన్‌డీఏ సర్కారుకు వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యుడు సుజనా చౌదరి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ప్రభుత్వం సభ నడవడం లేదని మండిపడ్డారు. బలవంతంగా తమ పనులను చక్కబెట్టుకోవాలని ఎన్‌డీఏ ప్రభుత్వం చూస్తోందని సుజనాచౌదరి ఆరోపించారు.

హోదా కోసం నేడు ఢిల్లీలో ఆందోళన

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: ఆంధ్రప్రదేశ్ విషయంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏపీ హోదా సాధన సమితి నేతృత్వంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ దగ్గర ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్యాయం చేశారని ఆరోపించారు. ఏపీకి న్యాయం చేయాలని గురువారం, శుక్రవారం ఢిల్లీలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నాట్టు చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో వామపక్షా పార్టీలతో పాటు, తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ తదితర పార్టీలు పాల్గొనున్నట్టు రామకృష్ణ వెల్లడించారు.

రాఫెల్‌పై జేపీసీ వేయాల్సిందే

● లోక్‌సభలో టీడీపీ ఎంపీ గల్లా డిమాండ్ ● సుప్రీం కోర్టును తప్పదోవ పట్టించారు

● హెచ్‌సీఎల్‌ను కాదని అనుభవనం లేని రిలయన్స్‌కు కాంట్రాక్టు ఎలా ఇస్తారంటూ విమర్శలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వెనకున్న ముడుపుల వ్యవహారం బయటపడాలంటే జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ)తో దర్యాప్తు జరిపించవలసిందేనని తెలుగు దేశం సభ్యుడు గల్లా జయదేవ్ డిమాండ్ చేశారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ జయదేవ్ ఈ డిమాండ్ చేశారు. సీబీఐని పెంపుడు కుక్కలా మార్చివేసిన బీజేపీ రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు విషయంలో సుప్రీం కోర్టును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. దేశంలో రాఫెల్ యుద్ధ విమానాల తయారీకి 2014 మార్చి నెలలో దస్సాల్ట్-హెచ్‌ఏఎల్‌కు మధ్య ఒప్పందం కుదిరింది.. దీని ప్రకారం హెచ్‌ఏఎల్ 75 శాతం పనులను చేయవలసి ఉండింది.. అయితే ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దుచేసి విమానాల తయారీ పనిని రిలయెన్స్ సంస్థకు అప్పగించిందని జయదేవ్ ఆరోపించారు. రిలయెన్స్‌కు ఈ కాంట్రాక్టు ఎందుకు ఇచ్చారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రకంగా నవరత్నాల్లో ఒకటైన హెచ్‌ఏఎల్‌ను అవమానించారని జయదేవ్ ఆరోపించారు. దీనికి సంబంధించిన అన్ని ఫైళ్లు తన పడక గదిలో ఉన్నాయని మాజీ రక్షణ శాఖ మంత్రి, గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారిక్కర్ మంత్రివర్గం సమావేశంలో చెప్పినట్లు గోవా ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజిత్ వెల్లడించారని, దేశ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన రహస్యాలు ఆయన పడక గదిలో ఉండడం ఏమిటని నిలదీశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఎక్కువ ధర చెల్లించి రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తోందని, ఈ విషయంలో పార్లమెంటును తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు. యుద్ధ విమానాలను తయారు చేసే దస్సాల్ట్ సంస్థతో యుపీఏ కుదుర్చుకున్న ఒప్పందం ఏమిటి? ఎన్‌డీఏ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ఏమిటి? ఈ రెండింటికి మధ్య వ్యత్యాసం ఏమిటనేది సభకు వెల్లడించాలని ఆయన రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను అడిగారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్‌కు వెళ్లినప్పుడు ఆయన వెంట ఎవరెవరు వెళ్లాలనేది కూడా వెల్లడించాలని డిమాండ్ చేశారు. భారత వైమానిక దళానికి మొత్తం 126 యుద్ధ విమానాలు అవసరం ఉండగా ప్రభుత్వం ఇప్పుడు కేవలం 36 యుద్ధ విమానాలు మాత్రమే కొనుగోలు చేస్తోంది.. మరి మిగతావాటిని ఎక్కడినుండి కొనుగోలు చేస్తారని జయదేవ్ నిలదీశారు. దాదాపు 36వేల కోట్ల అప్పులున్న రిలయెన్స్ సంస్థ రాఫెల్ యుద్ధ విమానాలను ఎలా తయారు చేస్తుంది? అనుభవం లేని రిలయెన్స్ యుద్ధ విమానాలను తయారు చేయగలుగుతుందా? అని ఆయన ప్రశ్నించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పార్లమెంటు పట్ల ఎలాంటి గౌరవం లేదు.. ఉండివుంటే ఆయన ఈ రోజు చర్చకు హాజరై సమాధానం చెప్పాల్సిందని విమర్శించారు.

రాజ్యసభలో తమిళ ఎంపీల గలభా

'తలాక్' బిల్లు చర్చకు రాకుండానే వాయిదా

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రిపుల్ తలాక్ బిల్లు చర్చకు రాకుండానే బుధవారం రాజ్యసభ వాయిదా పడింది. కావేరీ నదిపై కర్నాటక నిర్మిస్తున్న అనకట్టకు వ్యతిరేకంగా తమిళనాడుకు చెందిన అన్నాడీఎంకే, డీఎంకే సభ్యులు పదే పదే రాజ్యసభ చైర్మన్ పోడియం వద్దకు వచ్చి ఆందోళన చేయడంతో సభ పలుమార్లు వాయిదా పండింది. సభాధ్యక్షుడు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సభ్యుల ప్రవర్తన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఐదు రోజుల్లో సమావేశాలు ముగుస్తున్నందున సభ సజావుగా సాగేందుకు సహకరించాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లు, రాఫెల్ ఒప్పందం, రైతుల సమస్యలు వంటి కీలక అంశాలపై చర్చ జరగాల్సి ఉందని, కొన్ని బిల్లులను ఆమోదించేందుకు సహకరించాలని వెంకయ్య నాయుడు సభ్యులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కావేరీ నదీ జలాలకు సంబంధించిన అంశంపై కేంద్రం జల వనరుల శాఖ మంత్రి సమాధానం ఇస్తారని చైర్మన్ ప్రకటించారు. అయినప్పటికీ సభా కార్యక్రమాలకు అన్నాడీఎంకే, డీఎంకే పార్టీలకు చెందిన సభ్యులు అడ్డుపడడంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఈ దశలో ఇరు పార్టీలకు చెందిన 12 మంది సభ్యులను 255 నిబంధన కింద సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు. అప్పటికీ సభ్యులు బయటకు వెళ్లకుండా అందోళన కొనసాగించారు. ఇక చేసేదిలేక సభను గురువారానికి వాయిదా వేశారు.

శ్వేతపత్రాలపై చర్చ పెట్టండి

★ నా ఖర్చులతో చర్చకు సిద్ధం ★ మేలో పోలవరం నీళ్ళిస్తామనడం విడ్డూరమే
★ ఎల్ఈడీ బల్బుల్లో భారీ అవినీతి ★ రూ.600 బల్బుకు రూ.6000 చెల్లిస్తున్నారు
★ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 2: ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలపై చర్చజరపాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శ్వేతపత్రాలపై ప్రభుత్వం ఆశించిన ఫలితాలు రావాలంటే వాటిపై నిశితంగా చర్చ జరగాలన్నారు. ప్రభుత్వ ప్రతినిధులు ఎవరొచ్చినా చర్చించడానికి తాను సిద్ధమని ప్రకటించారు. ప్రభుత్వ విడుదల చేస్తున్న శ్వేతపత్రాలతాలూకు వాస్తవాలు క్షేత్ర స్థాయిలో రుజువు కావాల్సివుందన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఉండవల్లి విలేఖర్లతో మాట్లాడారు. తాను అనేకసార్లు అనేక అంశాలపై శ్వేతప్రతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశానని, ఎట్టకేలకు శ్వేతపత్రాలు విడుదలవుతున్నాయన్నారు.తాజాగా పరిశ్రమలకు సంబంధించి విడుదల చేసిన శ్వేత పత్రంలో అసెంబ్లీలో ఇచ్చిన సమాధానమే ఉందని, రూ.18 లక్షల కోట్లు పెట్టుబడితో రాష్ట్రంలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే సత్యాలు తేటతెల్లమవుతాయన్నారు. తన సొంత ఖర్చులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి సిద్ధమని,ప్రభుత్వ ప్రతినిధులెవరైనా రావచ్చన్నారు. రాష్ట్రానికి రూ.18 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నప్పటికీ కనీసం రూ.1.5 కోట్లు కూడా రాలేదని ధ్వజమెత్తారు. 60సీ నిబంధనను వక్రీకరించి పోలవరంలో పనులు అప్పగిస్తున్నారని ఉండవల్లి ఆరోపించారు. రూ.కోట్ల విలువైన పనులు నామినేషన్లపై ఇవ్వడానికి తాజాగా టన్నెల్ పనుల ప్యాకేజీలో కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సీఎం ఎంతో హడావిడిగా ప్రారంభించిన పోలవరం గేట్ల అమరిక ఇంకా ఉరి కొయ్యకు వేలాడుతున్నట్టుగా ఉన్నట్టుందని, సాంకేతికంగా అది పూర్తి కావాలంటే కనీసం నెల రోజులైనా పడుతుందన్నారు. కడప స్టీల్ ప్లాంట్ కంటే పెద్ద మోసం మరోటి లేదన్నారు. పునర్విభజన చట్టంలోని 108 క్లాజు గడువును పెంచాలని తాను లేఖ రాస్తే పట్టించుకోలేదని, కనీసం చంద్రబాబునాయుడు అప్పట్లో స్పందించివుంటే, ఇపుడు గడువుఉండేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమంత్రి మేలో నీళ్ళిస్తామని చెప్పడం పచ్చి అబద్ధమని, మేలో ఏ విధంగా ఇస్తారో అర్థం కావడం లేదని ఉండవల్లి పేర్కొన్నారు. అదే నిజమైతే నీళ్ళిచ్చేందుకు ఆరు నెలల ముందే సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ వేసి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎల్ఈడీ బల్బుల ధరల్లో కూడా భారీ అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ఒక్కో బల్బుకు రూ.6000 వంతున చెల్లించి, పదేళ్లలో 10వేల గంటలు వెలిగే విధంగా ఒప్పందమని, ఈ కాలంలో ఏదైనా బల్బు పోతే కాంట్రాక్టు సంస్థ రీప్లేస్ చేయాల్సివుందన్నారు. అయితే రూ.600 విలువైన బల్బుకు రూ.6000 చెల్లిస్తున్నారని, ఇంత అవినీతి కళ్ళకు కట్టినట్టు కన్పిస్తుంటే, చంద్రబాబునాయుడు నిప్పులాంటి మనిషి అని పదే పదే ఎలా అంటారని నిలదీశారు. ఒకవైపు బీజేపీ మోసం చేసిదంటున్న ముఖ్యమంత్రి మరో వైపు శ్వేతపత్రాల్లో గణాంకాలను బట్టి చూస్తుంటే దేశంలోనే అన్నింటా ముందున్నామని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. అందుకే ఒక్కో శ్వేతపత్రంపై చర్చించాలని డిమాండ్ చేస్తున్నానని, అమరావతిలోనే చర్చ పెట్టాలని ఉండవల్లి కోరారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సెల్ ఫోన్లలో, అన్నా క్యాంటీన్ల నిర్మాణంలోనూ భారీ అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు.

అన్నాడీఎంకే సభ్యుల సస్పెన్షన్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: లోక్‌సభలో గత నెల ఎనిమిదో తేదీనుండి పోడియం వద్ద గొడవ చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగులుతున్న 24 మంది అన్నాడీఎంకే సభ్యులను లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఐదు రోజుల పాటు సభనుండి సస్పెండ్ చేశారు. బుధవారం ఉదయం నుండీ పోడియం వద్ద నిలబడి కర్నాటక ప్రభుత్వం కావేరీ నదిపై నిర్మిస్తున్న మేకదాటు నీటిపారుదల ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ అన్నాడీఎంకే సభ్యులు పెద్దఎత్తున నినాదాలిచ్చారు. ఇద్దరు సభ్యులు ఏకంగా సీట్లపై నిలబడి హంగామా సృష్టించారు. మరి కొందరు కాగితాలు చింపి గాలిలోకి ఎగురవేయడంతోపాటు పేపర్ విమానాలను విసిరారు. వీరికి కాంగ్రెస్ సభ్యులు సహకరించారు. సభా మర్యాదకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పీకర్ సుమిత్రా మహాజన్ చేసిన హెచ్చరికలను వీరు ఏమాత్రం పట్టించుకోలేదు. దీనితో ఆగ్రహం చెందిన స్పీకర్ అన్నాడీఎంకే పక్షం నాయకుడు వేణుగోపాల్‌తోపాటు మొత్తం 24 మంది సభ్యులను ఐదు రోజుల పాటు సస్పెండ్ చేశారు.

1వ పేజీ తరువాయి

అయ్యప్పకు అపచారం!

3.38 గంటల నిమిషాల సమయంలో ఈ మహిళలు దర్శనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రోజే కేరళ వ్యాప్తంగా హిందూ మహిళలు పెద్ద సంఖ్యలో మానవహారంగా మారి మహిళలను అనుమతించరాదని నిరసనలు తెలియచేయడం గమనార్హం. ఇద్దరు మహిళలు ఆలయ ప్రవేశంతో రాష్ట్ర వ్యాప్తంగా హిందూ సంఘాలు నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. జాతీయ రహదారులను దిగ్బంధం చేశారు. శబరిమల కర్మ సమితి ఆధ్వర్యంలో హిందూ సంఘాలు ఆందోళనకు దిగి గురువారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. కేరళ ముఖ్యమంత్రి విజయన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అమలు చేశామని, మహిళలు కోర్టు ఆదేశాల మేరకు దర్శనం చేసుకోవచ్చని చెప్పారు. ఇద్దరు మహిళలు ఆలయంలోకి వెళ్లి దర్శనం చేసుకున్నారని ఆయన అధికారికంగా ప్రకటించారు. పోలీసులు ఈ మహిళలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించారన్నారు. ఈ ఇద్దరు మహిళలు దర్శనం చేసుకున్న వెంటనే ఆలయం బయటకు వచ్చి పరుగుపెట్టారు. అక్కడి నుంచి వారిని పోలీసులు భద్రత మధ్య పటానాంతిట్ట పట్టణానికి తరలించారు.

దర్శనం చేసుకున్న మహిళల్లో బిందూ కొజికోడ్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆమె సీపీఐఎంఎల్ కార్యకర్త. కనకదుర్గ సివిల్ సప్లయిస్ శాఖలో మల్లపురంలో అంగడిపురంలో ఉద్యోగం చేస్తున్నారు. గత కొన్ని వారాలుగా అనేక మంది మహిళలు సుప్రీం కోర్టు తీర్పుతో ఉత్తేజితులై శబరిమల ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. తాము ఆలయంలోకి వెళ్లేసరికి ప్రశాంతంగా ఉందని, ఆలయం వెలుపల పెద్దగా భక్తులు లేరని కనకదుర్గ, బిందూ ఒక టీవీ చానల్‌కు చెప్పారు. కొంతమంది భక్తులు ఉన్నా తమను అడ్డుకోలేదన్నారు.

ఇద్దరు మహిళలను పోలీసులు ప్రభుత్వ ఆదేశంపై దగ్గరుండి ఆలయ ప్రవేశం చేయించడంపై కేరళ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళనకుదిగారు. తిరువనంతపురం సచివాలయం వరకు బీజేపీ కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్లారు. నల్ల జెండాలు ఎగురవేశారు. దేవాదాయ శాఖ మంత్రికి నిరసన వ్యక్తం చేశారు. గురువాయూర్, కన్నూర్‌లో బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున గుమిగూడి మంత్రులు కేకే శైలజ, కే సురేంద్రన్‌లకు నల్లజెండాలు చూపెట్టారు. సచివాలయం వద్ద ర్యాలీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

చంద్రబాబుది దుష్ప్రచారం

అక్కడ ఎలాంటి సమస్య ఉత్పన్నం కాలేదన్నారు. ఇపుడు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నా ఇవ్వడం లేదని చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రెవెన్యూ లోటు ఉందని, రూ.20 వేల కోట్లు నిధులు మంజూరు చేసినప్పటికీ, ఏ నిధులు రాలేదంటే ఆ నిధులు ఎక్కడ ఉన్నాయని ప్రధాని మోదీ ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కేంద్రం నిధులతోనే అన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించామన్నారు. ఇప్పటి వరకు రూ.7 వేల కోట్లు నిధులు మంజూరు చేశామని వివరించారు. అలాగే వెనుకబడిన ప్రాంతాలకు రూ.1000 కోట్లు మంజూరు చేయగా వాటికి యూసీలు ఇవ్వలేదన్నారు. అందువల్లనే మిగిలిన నిధులు నిలిపివేశామన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన 10 కేంద్ర విద్యా సంస్థలను కేటాయించామన్నారు. విజయనగరం జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు మంజూరు చేశామన్నారు. మిగిలిన హామీలను కూడా నెరవేర్చడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నామన్నారు. మన విదేశాంగ విధానం పటిష్టంగా ఉందన్నారు. నల్లధనం, అవినీతిని అంతమొందించేందుకు జి-7 దేశాలకు పిలుపునిచ్చామని వారి నుంచి గట్టి మద్దతు లభించిందన్నారు. అలాగే ఉగ్రవాదులను తరిమికొట్టేందుకు సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించామని, వాటికి అన్ని దేశాల నుంచి మద్దతు లభించిందని వివరించారు. ఇక రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ కారణమని గ్రామగ్రామానికి తెలుసునని, ఇపుడు ఏ మొహం పెట్టుకొని కాంగ్రెస్, టీడీపీ ఓట్లు అడగడానికి వెళ్తాయని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ సునీల్ దియోధర్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి పాకలపాటి సన్యాసిరాజు, జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహన్‌రావు, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా ఇన్‌ఛార్జి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.శివప్రసాద్‌రెడ్డి, శంబర లక్ష్మినరసింహం, జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వండి

మహాకూటమి ఓటమి వలన ఆక్రోశంగా ఉన్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. మోదీ విధానాల వల్ల తనకు కేంద్ర ప్రభుత్వంపై కోపం, ఆక్రోశం ఉందన్నారు. కెసిఆర్ తనను ఎన్ని మాట్లలు అన్నా ప్రజల కోసం ఓపిగ్గా ఉన్నానని సభ్యత సమస్కారం తనకు ఉందని అన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణకు కూడా ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన విధంగా అభివృద్ధి జరగలేదన్నారు. అందుకోసం తనపై విద్వేషంతో కెసి ఆర్ తరచూ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మోదీ తలుచుకుంటే జగన్‌ను మళ్లీ జైలులో పెడుతారన్న భయం జగన్‌కు ఉందని అందుకే జగన్ మోదీకి సరెండర్ అయ్యారన్నారు. నేడు రైతుల కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టి రైతులను ఆదాయాన్ని రెట్టింపు చేశారని, రైతుల శ్రేయస్సు కోసం ఏమి చేయడానికైనా సిద్ధమేనని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం లోటుబడ్జెట్‌లో ఉన్నా దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్‌పై కక్షసాధింపు చర్యలకు మోదీ, కెసి ఆర్ పాల్పడుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకొని ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తున్నామన్నారు. కేంద్రం నమ్మించి ద్రోహం చేసినందుకు ఇప్పటికే 11 సార్లు ధర్మ పోరాటం చేసానని, ఈ పోరాటం అంతా భావితరాల భవిష్యత్తు కోసమే అన్నారు. కేంద్రంపై రాజీలేని పోరాటం చేయడానికి తాను సిద్ధమే అన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఒక స్మార్ట్ ఫోన్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కనీసం కెసిఆర్ మన రాష్ట్రానికి ఇవ్వాల్సిన వాటాలను కూడా ఇవ్వకుండా రాజకీయం చేస్తున్నట్లు ఆరోపించారు. పేదల సమస్యలు పరిష్కారం కోసమే ఈ జన్మభూమి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం విధి విధానాల వల్ల అనేక వ్యవస్థలు చిన్నాభిన్నమైనట్లు ధ్వజమెత్తారు. రాష్ట్రానికి అన్ని విధాలా నమ్మకద్రోహం చేసిన బీజేపీని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

ప్రచారం కోసం.. పథకం!

ఫ్యూజియన్ ఫుడ్స్‌లో నిందితుడు శ్రీనివాస్ కుక్‌గా పనిచేస్తున్నాడన్నారు. వైసీపీ అధినేత జగన్ హైదరాబాద్ వెళ్లేందుకు విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో పార్టీ నాయకుడు ధర్మశ్రీతో మాట్లాడుతున్న సందర్భంలో పథకం ప్రకారమే కోడికత్తితో దాడికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ దాడిలో జగన్‌కు భుజంపై గాయమైందన్నారు. కేవలం ప్రచారం కోసమే ఇదంతా చేసినట్టు తెలిపారు. విపక్ష నేతపై దాడికి సంబంధించి గతేడాది అక్టోబర్ 18 పథకం రూపొందించాడని, అయితే దసరా సందర్భంగా జగన్ 17నే హైదరాబాద్ వెళ్లిపోవడంతో సాధ్యపడలేదన్నారు. జగన్‌పై దాడికి యత్నించిన శ్రీనివాస్, హత్యాయత్నానికి ఉపయోగించిన ఆయుధం కోడికత్తికి రెండు సార్లు పదును పెట్టించాడని తెలిపారు. త్వరలోనే తాను టీవీల్లో కనిపిస్తానంటూ సహచరుల వద్ద పేర్కొన్నాడన్నారు. ఇదే విషయాన్ని హేమలత, షేక్ అమ్మాజీలకు చెప్పినట్టు తెలిపారు. దాడి చేసినప్పుడు శ్రీనివాస్ వద్ద లభించిన లేఖను విజయదుర్గతో పాటు మరో ఇద్దరితో రాయించి, రాయించి జెరాక్స్ తీయించి తన వద్ద ఉంచుకున్నాడన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పాపులర్ కావాలనుకునే ఈ ఘటనకు పాల్పడినట్టు సీపీ తెలిపారు. దీనిలో భాగంగానే జగన్‌తో సెల్ఫీ తీయించుకుంటానని నమ్మబలికి వైసీపీకి చెందిన ఒక నాయకుని ప్రయేయంతో జగన్ బస చేసిన వీఐపీ లాంజ్‌కు చేరుకున్నట్టు విచారణలో వెల్లడైందన్నారు. ఇదిలా ఉండగా తనపై దాడి జరిగిన అనంతరం జగన్ హైదరాబాద్‌కు వెళ్లిపోయారని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఘటనలో ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న వైసీపీ నేతలు సైతం విచారణకు సహకరించలేదని, అయినప్పటికీ జరిగిన ఘటనపై తాము నిందితుడితో పాటు మరో 92 మంది సాక్షులను విచారించామన్నారు. నిందితుడు శ్రీనివాసరావును జ్యుడీషియల్ కస్టడీకి తీసుకుని వివరాలు రాబట్టినట్టు తెలిపారు. ఇదే రెస్టారెంట్‌లో పనిచేస్తున్న హేమలత, రేవతిపతి తదితరులతో పాటు రెస్టారెంట్ అధినేతను కూడా విచారించామన్నారు. అలాగే నిందితుడి కాల్‌డేటా ఆధారంగా కూడా విచారణ జరిపామన్నారు. విమానాశ్రయం వీఐపీ లాంజ్‌లోకి సాధారణ వ్యక్తులు సులభంగా ప్రవేశించడంలో భద్రత వైఫల్యమేనని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నెత్తురోడిన రహదారులు

నుజ్జునుజ్జుకాగా, లారీ వెనుక ప్రాంతం ధ్వంసమైంది. చిత్తూరు జిల్లా మదనపల్లి మండలం ములకలచెరువు గ్రామానికి చెందిన ఏడుగురు తూర్పు గోదావరి జిల్లా యర్రవరంలో ఒక వివాహ వేడుకలకు హాజరై తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదానికి గురయ్యారు. కారులో ప్రయాణిస్తున్న సుందరరామరాజు (33), భారతి (54), కశ్విని (2)లతో పాటు పేరు తెలియని మరో మహిళ కూడా మృతిచెందారు. క్షతగాత్రులు కాటూరి మెడికల్ కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ శోభన్‌బాబు, యడ్లపాడు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయపురిసౌత్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న మరో ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. నాగార్జునసాగర్ నుండి మాచర్ల వైపు వస్తున్న ద్విచక్ర వాహనం, మాచర్ల నుండి నల్గొండకు వెళుతున్న మరో ద్విచక్ర వాహనం ఎన్టీపీసీ-తాళ్లపల్లి మధ్య ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ద్విచక్రవాహనంపై శ్రీరామదాసు నాగబ్రహ్మాచారి, వెంకటసాయి (11), నాగలక్ష్మి, ఝాన్సీ, మణిదీప్తి (8)లు ఐదుగురు ప్రయాణిస్తుండటం గమనార్హం. ఈ ప్రమాదంలో సురేష్ (35), వెంకటసాయి తలలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడ్డ బాలిక మణిదీప్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది.

రాఫెల్‌పై దద్దరిల్లిన లోక్‌సభ

అలవాటుపడినవారే మచ్చలేని ప్రధాని మోదీపై బురదజల్లుతున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సవాలు చేసే శక్తి ఎవరికీ లేదన్నారు. అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ కేసులో నిందితుడు మిచెల్ గాంధీ కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించిన విషయాన్ని జైట్లీ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ సభలో చూపించిన టేపులు, క్లిప్పింగ్‌లు కల్పితమని తోసిపుచ్చారు. ఈ క్లిప్పింగ్‌లు దురుద్దేశంగా తయారుచేసినవని, ఇదిరుజువైతే సభా హక్కుల ఉల్లంఘన కిందవస్తుందని, పైగా సభ నుంచి బహిష్కరణ వేటును ఎదుర్కొనాల్సి వస్తుందని జైట్లీ హెచ్చరించారు. అంతకుముందు రాహుల్ గాంధీ మాట్లాడుతూ గోవా సీఎం పారికర్ రాఫెల్ అంశంపై చేసిన వ్యాఖ్యల క్లిప్‌ను ప్రదర్శించేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా, స్పీకర్ నిరాకరించారు. మోదీ ఈ అంశంపై మాట్లాడకుండా ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పార్లమెంటును ఎదుర్కొనే సత్తా లేదన్నారు. మోదీ రాఫెల్ స్కాంపై భయపడుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఏఎల్‌కు కాంట్రాక్టును ఇవ్వకుండా అనిల్ అంబానీ కుటుంబానికి ప్రజాధనాన్ని దోచి పెట్టారన్నారు. తన బెడ్ రూంలో రాఫెల్ ఫైళ్లు ఉన్నాయని పారికర్ అన్నారంటే మోదీ నిజంగా దోషి అని రాహుల్ అన్నారు.

ఉచిత విద్యుత్‌పై నిర్ణయం తీసుకోండి

★ ప్రభుత్వ కమిటీకి హైకోర్టు ఆదేశం

చండీగఢ్, జనవరి 2: గోశాలలకు ఉచితంగా సరఫరా చేస్తున్న విద్యుత్ పథకాన్ని పరిశీలించి దానిని కొనసాగించాలో రద్దు చేసుకోవాలో నిర్ణయించాలని పంజాబ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని కమిటీకి పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రిజిస్టరయిన గోశాలలకు ఉచితంగా విద్యుత్‌ను అందించాలని, గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం 2017లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రిజిస్టరయిన గోశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని అమలు చేయడం లేదని, అంతేకాకుండా పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించమని నోటీసులు సైతం జారీ చేసిందని జైమాతా వైష్ణో గృహశాల సొసైటీ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై చీఫ్ సెక్రటరీ, పంజాబ్ స్టేట్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ నేతృత్వంలోని కమిటీని నిర్ణీత కాలవ్యవధిలో ఈ అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని జస్టిస్ రంజన్ గుప్తా నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. సొసైటీ తరపున వాదిస్తున్న న్యాయవాది ఆదర్శ్ జైన్ బుధవారం తన వాదన వినిపిస్తూ ఒక పక్క ప్రభుత్వం ప్రజల నుంచి కౌ సెస్‌ను వసూలు చేస్తోందని, అయినా రిజిస్టరయిన గోశాలలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడం లేదని, పైగా పాతబకాయిలు చెల్లించమంటూ నోటీసులు జారీ చేస్తోందని తెలిపారు. దీనిపై స్టేట్ కౌన్సిల్ సమాధానమిస్తూ పాతబకాయిలు వసూలు చేయమంటూ ఈ రోజు వరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, అలాగే గోశాలల విద్యుత్‌కనెక్షన్లను కట్ చేయలేదని తెలిపారు. దీంతో ఈ విషయాన్ని చీఫ్ సెక్రటరీ నేతృత్వంలోని కమిటీ పరిశీలించాలని, గోశాలలకు ఉచితంగా సరఫరా చేయాలా వద్ద అనే విషయంపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

క్రీడాభూమి

దేశవాళీ క్రికెట్‌తో ఎంతో మేలు

అందుకే భారత ఆటగాళ్లు రాణిస్తున్నారు ❑ పాకిస్తాన్ మాజీ కెప్టెన్ సల్మాన్ భట్



కరాచీ, జనవరి 2: దేశవాళీ క్రికెట్‌తో ఆటగాళ్లకు ఎంతో మేలు జరుగుతుందని పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సల్మాన్ భట్ అభిప్రాయపడ్డాడు. ఇందుకు ఉదాహరణగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సహా లెక్కకుమించిన రంజీ మ్యాచ్‌లలో భారత క్రికెటర్లు ప్రాతినిధ్యం వహిస్తుండడం వల్లే అద్భుతంగా రాణిస్తున్నారని అన్నాడు. గత నెలలో న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టు సిరీస్‌లలో ఓటమి చెందిన పాక్ ఆ తర్వాత గత వారం సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయిన విషయాన్ని గుర్తు చేశాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా ఆతిథ్య జట్టుతో జరుగుతున్న టెస్టుల్లో ఇప్పటికే 2-1తో ఆధిక్యంతో ఉన్న విషయాన్ని ప్రస్తావించాడు. దేశవాళీ క్రికెట్‌లో అపార అనుభవం కలిగిన భారత ఆటగాళ్లు అన్ని ఫార్మాట్లలోనూ అద్భుతంగా రాణిస్తున్నారని పేర్కొన్నాడు. అయితే, పాక్ క్రికెటర్లు కనీసం 50 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు కూడా ఆడడం లేదని, నాలుగు రోజుల దేశవాళీ క్రికెట్‌లో సైతం ఆడేందుకు ముందుకు రావడం లేదని విచారం వ్యక్తం చేశాడు.

స్మిత్, వార్నర్, కేమరాన్‌కు మరో ఛాన్స్ ఇవ్వండి

ఆస్ట్రేలియా ప్రజలను కోరిన కెప్టెన్ టిమ్ పైన్

సిడ్నీ, జనవరి 2: గత ఏడాది దక్షిణాఫ్రికాతో జరిగిన ఒక టెస్టు మ్యాచ్ సందర్భంగా బాల్‌ట్యాంపరింగ్ వివాదంలో కూరుకుపోయి ఏడాదిపాటు నిషేధం ఎదుర్కొంటున్న సీనియర్ క్రికెటర్లు స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కేమరాన్ బాంక్రాఫ్ట్‌కు మరొక అవకాశం ఇచ్చి చూడాలని ఆస్ట్రేలియా టీమ్ కెప్టెన్ టిమ్ పైన్ ఆ దేశ పౌరులకు విజ్ఞప్తి చేశాడు. తమ జట్టులో ఈ దిగ్గజ ఆటగాళ్లు లేని లోటు ఎవరూ భర్తీ చేయలేరని అంటూ వారికి మరొకమారు జాతీయ జట్టులో ఆడేందుకు అవకాశం ఇస్తే తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తామని అన్నాడు. అయితే, బాల్‌ట్యాంపరింగ్ ద్వారా దేశ క్రికెట్‌కు తీరని మచ్చను తీసుకువచ్చిన ఆ ముగ్గురు ఆటగాళ్ల విషయంలో క్రికెట్ అభిమానులు ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో టిమ్ పైన్ తాజాగా చేసిన విజ్ఞప్తిపై వారి స్పందన ఎలా ఉంటుందో తెలియాలి. ప్రతిఒక్కరూ తమ అభిప్రాయాన్ని వెల్లడించే హక్కు ఉందని అంటూ దేశ ప్రజలు సైతం ఆ ముగ్గురు క్రికెటర్ల విషయంలో సరైన విధంగా స్పందిస్తారనే నమ్మకం తనకు ఉందని పేర్కొన్నాడు.

ఆసియా కప్‌లో గెలుపు సులువు కాదు

భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి



అబూదాబి, జనవరి 2: ఈనెల 5నుంచి జరిగే ఆసియా కప్ టోర్నమెంట్‌లో గెలుపు అంత సులువు కాదని భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి అన్నాడు. ఇటీవల చైనా, ఒమన్ జట్లతో జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిసిన నేపథ్యంలో కెప్టెన్ మీడియాతో మాట్లాడుతూ ఆసియా కప్‌లో పాల్గొనే అగ్రశ్రేణి జట్లతో పోరు కష్టమేనని అభిప్రాయపడ్డాడు. ఈనెల 5 నుంచి ఫిబ్రవరి 1వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఆసియా కప్ టోర్నమెంట్ జరుగనుంది. గ్రూప్-ఏలో భారత్, థాయిలాండ్, బెహ్రెయిన్‌తో పాటు ఆతిథ్య యూఏఈతో తలపడుతుంది. ఈ గ్రూపుల మధ్య తొలి మ్యాచ్‌లో భారత్ జట్టు థాయిలాండ్‌తో ఈనెల 6న తలపడుతుంది. ఆ తర్వాత జనవరి 10న అబూదాబీలో యూఏఈతో, 14న షార్జాలో బెహ్రెయిన్ టీమ్‌తో తలపడుతుంది. తమ ప్రణాళిక ప్రకారం మెరుగైన ప్రదర్శన కోసం పోటీపడతామని సునీల్ ఛెత్రి అన్నాడు.



విరాట్ కోహ్లీ



అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇస్తున్న టీమిండియా క్రికెటర్ చటేశ్వర్ పుజారా

సరికొత్త చరిత్ర దిశగా టీమిండియా!

❑ సిడ్నీలో గెలుపు ముఖ్యం: కోహ్లీ ❑ అత్యుత్తమ ప్రదర్శనపైనే దృష్టి: పైన్ ❑ నేడు ఆసిస్‌తో ఆఖరి టెస్టు

సిడ్నీ, జనవరి 2: ఆతిథ్య ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టు సిరీస్‌లలో భాగంగా ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉన్న విరాట్ కోహ్లీ సారథ్యంలోని టీమిండియా టెస్టుల్లో ఆఖరిది, నాలుగోది గురువారం సిడ్నీలో జరిగే టెస్టులో పైచేయి సాధించడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించాలని ఉవ్విళ్లూరుతోంది. ఉరకలెత్తే ఆత్మవిశ్వాసంతో నాలుగో టెస్టుకు కోహ్లీ సేన సిద్ధమతుండగా, సిరీస్‌ను డ్రాగా ముగించాలని టిమ్ సేన్ యోచిస్తోంది. సిడ్నీలో జరిగే ఆఖరి టెస్టులో గెలిస్తే గొప్ప ఘనత సాధించినవారం అవుతామని టీమిండియా కెప్టెన్ కోహ్లీ వ్యాఖ్యానించగా, ప్రత్యర్థిపై రికార్డు కాదు..అత్యుత్తమ ప్రదర్శనపైనే తాము దృష్టి సారిస్తామని ఆసిస్ కెప్టెన్ టిమ్ పైన్ చెబుతున్నాడు. ఆరు జట్ల మధ్య అడెలైడ్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ 31 పరుగులతో విజయం సాధించగా, పెర్త్ మైదానంలో జరిగిన రెండో టెస్టులో ఆతిథ్య జట్టు 148 భారీ ఆధిక్యంతో గెలిచింది. మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్టులో టీమిండియా 137 భారీ పరుగులతో విజయం సాధించి టెస్టు సిరీస్‌లలో 2-1తో పైచేయిలో ఉంది. గురువారం జరిగే ఆఖరి టెస్టులో మరో విజయం సాధించడం ద్వారా సిరీస్‌ను కైవశం చేసుకోవాలని కోహ్లీ సేన ఉబలాటపడుతుండగా, అత్యుత్తమ ఆటతీరును కనబరచడం ద్వారా సిరీస్‌ను డ్రాగా ముగించాలని ఆతిథ్య ఆసిస్ కెప్టెన్ టిమ్ పైన్ సేన యోచిస్తోంది. ఆసిస్ గడ్డపై భారత్ ఇప్పటివరకు ఆడిన టెస్టు సిరీస్‌లలో మూడు డ్రాగా (1980-81, 1985-86, 2003-04) ముగియగా, ఏడు టెస్టుల్లో పరాజయం (1967-68, 1977-78, 1991-92, 1999-2000, 2007-08, 2011-12, 2014-15) చవిచూసింది. ఆస్ట్రేలియా మైదానంలో ఇంతవరకు టీమిండియాకు నాయకత్వం వహించిన ఏ ఒక్క కెప్టెన్ కూడా టెస్టు సిరీస్‌లో విజయంతో స్వదేశానికి రాలేకపోయారు. అయితే, ఇపుడు విరాట్ కోహ్లీ నాయత్వంలోని టీమిండియా ఇదే మైదానంపై సరికొత్త చరిత్రను లిఖించాలని తహతహలాడుతోంది. ఈ గడ్డపై భారత్ టెస్టు సిరీస్‌ను గెలిస్తే కోహ్లీ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇదిలావుండగా టీమిండియా యాజమాన్యం బుధవారం 13 మంది గల జట్టు సభ్యుల పేర్లను ప్రకటించింది. అడెలైడ్‌లో జరిగిన తొలి టెస్టు సందర్భంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మెల్‌బోర్న్, పెర్త్‌లో జరిగిన రెండు టెస్టుల్లో ఆడలేకపోయాడు. ఇపుడు కూడా ఫిట్నెస్ పరంగా ఇంకా పూర్తిగా కోలుకోలేని పరిస్థితుల నేపథ్యంలో సిడ్నీ టెస్టులో ఆడేందుకు అవకాశం లేదు. అదేవిధంగా సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ సైతం గాయాల బారిన పడడంతో ఆఖరి టెస్టులో ఆడే అవకాశం లేదని తెలుస్తోంది. అశ్విన్ రెండు టెస్టుల్లో ఆడలేకపోయిన విషయాన్ని కోహ్లీ ప్రస్తావిస్తూ టెస్టు క్రికెట్‌లో అశ్విన్ అవసరం ఎంతో ఉందని, కానీ దురదృష్టవశాత్తూ అనారోగ్యం వెంటాడడం విచారకరమని అన్నాడు. నాలుగో టెస్టులో ఆఫ్‌స్పిన్నర్ అశ్విన్ లేని లోటును భర్తీ చేసేందుకు ఎడమచేతివాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఇషాంత్ శర్మ స్థానంలో ఉమేష్ యాదవ్‌ను తీసుకున్నారు. పేసర్లు మహమ్మద్ షమీ, జస్ప్రీత్ బుమ్రాతోపాటు ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నట్టు కోహ్లీ వెల్లడించాడు. ఇటీవలే పాపకు తండ్రి అయిన సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ నాలుగో టెస్టులో అందుబాటులో ఉండడంలేదు. మూడో టెస్టులో ఓపెనర్‌గా దిగిన హనుమ విహారి ఈసారి ఆరో నెంబర్ ఆటగాడిగా బరిలోకి దిగే అవకాశం ఉంది. మరోపక్క ఆతిథ్య ఆసిస్‌లో తుది జట్టును గురువారం జరిగే టాస్‌కు ముందు ప్రకటిస్తామని కెప్టెన్ టిమ్ పైన్ వెల్లడించాడు. టెస్టు సిరీస్‌ను గెలిచేందుకు ఎలాగూ అవకాశం లేకపోయినా కనీసం సిరీస్‌ను డ్రాగా ముగించాలని టిమ్ పైన్ సేన యోచిస్తోంది.

రికార్డుపై కాదు..ఆటపైనే దృష్టి

❑ ఆసిస్ కెప్టెన్ టిమ్ పైన్

స్వదేశంలో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి ప్రారంభం కానున్న నాలుగో టెస్టులో ఉత్తమ ప్రదర్శన కనబరిచేందుకు తమ జట్టు ప్రయత్నిస్తుంది తప్ప ప్రత్యర్థిపై రికార్డు కోసం కాదని ఆసిస్ కెప్టెన్ టిమ్ పైన్ అన్నాడు. నాలుగు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికే 1-2తో వెనుకబడిన ఆతిథ్య జట్టు ఇపుడు సిరీస్‌ను డ్రాగా ముగించేందుకు యోచిస్తోంది. 'ఇపుడు మా దృష్టి అంతా ఆఖరి టెస్టులో అద్భుతంగా రాణించడంపైనే ఉంది. ఇప్పటివరకు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ గెలుపే ధ్యేయంగా పోరాడాం. కానీ సిరీస్ గెలుచుకునేందుకు మాకు కాలం కలసిరాలేదు. అయినా ఉత్తమ టెస్టు టీమ్‌గా నిలదొక్కుకునేందుకు అందివచ్చిన క్షణాలను ఆస్వాదిస్తాం' అని కెప్టెన్ అన్నాడు.

సిడ్నీలో గెలిస్తే అద్భుతమే

❑ టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ

ఆస్ట్రేలియాతో గురువారం సిడ్నీ క్రికెట్ మైదానంలో జరిగే ఆఖరి టెస్టులో భారత్ గెలిస్తే అద్భుతమేనని, సరికొత్త మలుపు అవుతుందని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. ఇదే మైదానంపై నాలుగేళ్ల క్రితం అప్పటి భారత కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి సంచలనం సృష్టించాడు. అప్పుడు భారత్ టెస్టు ర్యాంకింగ్స్‌లో 7వ స్థానంలో ఉంది. ఇపుడు కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా ప్రపంచంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇపుడు ఇదే మైదానంలో ఆతిథ్య ఆసిస్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో ఆఖరి టెస్టును ఆడబోతున్న కోహ్లీ సేనకు ఇది ఎంతో విలువైనదిగా నిలువనుంది. 'టీమిండియాకు గత నాలుగేళ్లుగా కెప్టెన్‌గా ఉంటున్నాను. ఆసిస్ గడ్డపై ఇప్పటికే నేను మూడుసార్లు టెస్టు మ్యాచ్‌లు ఆడాను. ఇక్కడ గెలుపు ఎంత కష్టమో నాకు తెలియంది కాదు. అయినా ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో చాలెంజ్‌గా తీసుకుని విజయం సాధిస్తాం' అని కోహ్లీ దీమా వ్యక్తం చేశాడు.

జట్టు పరంగా ఇప్పుడే పరివర్తన మొదలైంది. నిజాయితీగా గెలిచి అతి పెద్ద సిరీస్‌ను గెలుచుకోవడం వల్ల కేవలం తనకే కాకుండా జట్టు మొత్తానికి గొప్ప మలుపు అవుతుందని అని కోహ్లీ అభిప్రాయపడ్డాడు. ఇదిలావుండగా, అడెలైడ్ టెస్టుకు తప్ప మిగిలిన పెర్త్, మెల్‌బోర్న్ టెస్టుల్లో సీనియర్ ఆటగాడు, ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ లేని లోటు విచారకరమని, ఇపుడు కూడా ఆఖరి టెస్టుకు మిస్సవుతుండడం వల్ల అందుకు ప్రత్యామ్నాయ చర్యలకు జట్టు మేనేజిమెంట్ ఉపక్రమించిందని కోహ్లీ అన్నాడు.

బులియన్

ముంబయిలో

బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము :	రూ. 3,066.00
8 గ్రాములు :	రూ. 24,528.00
10 గ్రాములు :	రూ. 30,660.00
100 గ్రాములు :	రూ. 3,06,600.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము :	రూ. 3,279.144
8 గ్రాములు :	రూ. 26,233.152
10 గ్రాములు :	రూ. 32,791.44
100 గ్రాములు :	రూ. 3,27,914.4
వెండి	
8 గ్రాములు :	రూ. 331.20
10 గ్రాములు :	రూ. 414.00
100 గ్రాములు :	రూ. 4.140.00
ఒక కిలో :	రూ. 41,400.00

హైదరాబాద్‌లో

బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము :	రూ. 3,039.00
8 గ్రాములు :	రూ. 24,312.00
10 గ్రాములు :	రూ. 30.390.00
100 గ్రాములు :	రూ. 3,03,900.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము :	రూ. 3,250.267
8 గ్రాములు :	రూ. 26,002.136
10 గ్రాములు :	రూ. 32,502.67
100 గ్రాములు :	రూ. 3,25,026.7
వెండి	
8 గ్రాములు :	రూ. 331.20
10 గ్రాములు :	రూ. 414.00
100 గ్రాములు :	రూ. 4.140.00
ఒక కిలో :	రూ. 41,400.00

పీఎన్‌బీకి ఈసీబీ ద్వారా 265 మిలియన్ డాలర్లు

ముంబయి, జనవరి 2: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) హౌసింగ్ ఫైనాన్స్ విభాగం తాజాగా ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీ) ద్వారా 265 మిలియన్ డాలర్ల నిధులను సమకూర్చుకుంది. డిసెంబర్ నెల చివరి వారంలో ఈ నిధులను సమకూర్చుకున్నామని, దీనిని గృహ రుణాల కోసం వినియోగిస్తామని పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'జాయ్‌విల్లే-హించావాడీ' ప్రాజెక్టును గత ఏడాది ప్రారంభించామని, ఇది 2022 సంవత్సరానికి పూర్తవుతుందని వివరించింది. దీని కోసం 200 మిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నట్టు పేర్కొంది. ముంబయి, పుణేతోపాటు పశ్చిమ బంగాల్‌లోని కొన్ని నగరాల్లోనూ గృహ నిర్మాణాలను చేపడతామని వివరించింది.



వాణిజ్యభూమి

షేర్ మార్కెట్ పతనం

363 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబయి, జనవరి 2: కొత్త సంవత్సరం ప్రారంభ ఉత్సాహం బుధవారం బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బీఎస్‌ఈ)లో ఏమాత్రం కనిపించలేదు. ఉదయం లావాదేవీలు ప్రారంభమైన మరుక్షణం నుంచే అమ్మకాల ఒత్తిళ్లు పెరిగాయి. అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్ నీరసపడడంతో, దాని ప్రభావం బీఎస్‌ఈపైనా కనిపించింది. పెరుగుతున్న అమ్మకాలకు అడ్డుకట్ట పడే అవకాశం కనిపిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 500 పాయింట్లకుపైగా నష్టపోయింది. అయితే, చివరి క్షణాల్లో దేశీయ మదుపరులు వాటాల కొనుగోళ్ల పట్ల కొంత ఆసక్తిని ప్రదర్శించడంతో కోలుకున్న సెన్సెక్స్ 363.05 పాయింట్ల నష్టంతో బయటపడి, 35,891.52 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఒక శాతం నష్టాన్ని ఎదుర్కోగా జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) 1.08 శాతం నష్టాన్ని చవిచూసింది. 117.60 పాయింట్ల పతనమైన నేపథ్యంలో నిఫ్టీ 10,792.50 పాయింట్ల వద్ద నిఫ్టీ ముగిసింది.

లావాదేవీలతోపాటు పెట్టుబడిదారుల అమ్మకాల ఒత్తడి కూడా ప్రారంభమైంది. అంతర్జాతీయ సూచీలు సానుకూలంగా లేకపోవడంతో, భారత మార్కెట్ సైతం ఆ ప్రభావానికి లోనుగాక తప్పలేదు. అమ్మకాల ఒత్తిళ్లు కొనసాగి, సెన్సెక్స్ పతనం కొనసాగింది. వేదాంత, టాటా స్టీల్, మహీంద్ర అండ్ మహీంద్ర, టాటా మోటార్స్, మారుతీ, హీరో మోటోకార్ప్, పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, కోల్ ఇండియా తదితర కంపెనీలు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. వీటి సగటు పతనం 4.48 శాతంగా నమోదైంది. అయితే, అదృష్టం కొద్దీ కొన్ని కంపెనీల వాటాలు లాభాలను సంపాదించిపెటాటయి. అలాంటి కంపెనీల్లో సన్ ఫార్మా, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, ఎస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్నాయి. వీటి వాటాలకు సుమారు మూడు శాతం లాభం వచ్చింది. ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు మందగించడంతో, దేశీయ ఆటో స్టాక్స్ నష్టాలపాలయ్యాయి. డిసెంబర్‌లో ఆశాజనకంగా లేని ఆటో స్టాక్స్‌కు నెలాఖరులో డిమాండ్ పెరుతుందని అంతా ఆశించారు. కానీ, కొత్త సంవత్సరం డిమాండ్ కూడా ప్యాసింజర్ వాహనాలపై పడలేదు. మాక్రో ఆర్థిక రంగంలో అనిశ్చితి కొనసాగిన కారణంగా, ఆటో రంగం నష్టాలను ఎదుర్కొంది. ఇలావుంటే, రూపాయి మారకం విలువ తగ్గడం కూడా సెన్సెక్స్ పతనానికి మరో కారణమైంది.

డాలర్ విలువ 70.60 రూపాయలుగా నమోదైంది. 63 పైసల పతనం సహజంగానే మార్కెట్‌ను ప్రభావితం చేసింది. మరోవైపు, ముడి చమురు ధర కూడా తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 1.25 శాతం తగ్గి, బ్యారెల్‌కు 53.12 డాలర్ల వద్ద ముగిసింది. మొత్తం మీద అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుకులు ప్రభావం చూపిన కారణంగా భారత స్టాక్ మార్కెట్‌కు కూడా నష్టాలు తప్పలేదు.

రుణ విధానంపై దృష్టి

❑ పరిశ్రమలు, ఫైనాన్స్ కంపెనీలతో వచ్చే వారం ఆర్బీఐ గవర్నర్ భేటీ

ముంబయి, జనవరి 2: రిజర్వు బ్యాంకు కొత్త గవర్నర్ శక్తికాంత దాస్ వచ్చే వారం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సంస్థలు (ఎంఎస్‌ఎంఈ), నాన్ బ్యాంకింగ్ రంగంలోని ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. ఎంఎస్‌ఎంఈలకు ఏక దఫా రుణ పునర్వ్యవస్థీకరణ (వన్ టైం లోన్ రీస్ట్రక్చరింగ్) పథకాన్ని రిజర్వు బ్యాంకు మంగళవారం ప్రకటించిన నేపథ్యంలో బుధవారం ఆ బ్యాంకు గవర్నర్ దాస్ ఇలా తనభేటీ విషయాన్ని ట్వీట్ చేశారు. ఎంఎస్‌ఎంఈ అసోసియేషన్లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో వచ్చేవారం తాను భేటీ కానున్నట్టు గవర్నర్ దాస్ వెల్లడించారు. గత నవంబర్ 19న ఆర్బీఐ బోర్డు కీలక సమావేశం నిర్వహించి అనేక క్లిష్టతర విషయాలపై కూలంకషంగా చర్చించింది. మొండి బకాయిలున్న ఎంఎస్‌ఎంఈ లబ్ధిదారుల ఆస్తులు, అప్పుల పునర్వ్యవస్థీకరణపై నిర్ణయం తీసుకోవాలని, ఒకవేళ సంబంధింత సంస్థలు మళ్లీ ఆర్థికంగా పుంజుకునే పరిస్థితులుంటే రూ.25 కోట్ల వరకు రుణాలను ఇవ్వవచ్చని కేంద్ర ప్రభుత్వానికి ఆర్బీఐ బోర్డు సూచించిన సంగతి తెలిసిందే. అలాగే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఏర్పడిన ద్రవ్యలోటు సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని సైతం సూచించడం జరిగింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగంలోని ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ అప్పుల ఊబిలో కూరుకుపోయిన క్రమంలో రిజర్వు బ్యాంకు ప్రభుత్వానికి ఈ కొత్త ప్రతిపానలు చేసింది. అయితే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీలోని వివిధను ఆస్తుల మానిటరైజ్ చేయడం ద్వారా రుణాల చెల్లింపునకు చర్యలు చేపట్టిన క్రమంలో కేంద్ర ప్రభుత్వం చేసిన రుణాల పునర్వ్యవస్థీకరణ ప్రకటన ఆ సంస్థను ఆశ్చర్యానికి గురిచేసింది.

లాభపడనున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు

❑ కేంద్ర నిర్ణయంతో రూ.25 కోట్ల మొండి రుణాల పునర్వ్యవస్థీకరణ

ముంబయి, జనవరి 2: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ)కు సంబంధించిన మొండి బకాయిల విషయంలో రిజర్వుబ్యాంకు తీసుకున్న నిర్ణయం పట్ల బ్యాంకర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ విషయంలో బ్యాంకులకు పెద్దయెత్తున ఉన్న వత్తిడి దీనివల్ల తగుతుందని స్థానిక బ్రోకరేజ్ కంపెనీ అధ్యయన నివేదిక వెల్లడించింది.

ఎంఎస్‌ఎంఈల్లో బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించలేక డీఫాల్టర్లుగా మారిన పరిశ్రమలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 25 కోట్ల రూపాయల వరకు రుణాన్ని పునర్వ్యవస్థీకరణ (రీస్ట్రక్చర్) చేయాలని కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ వత్తిడిమేరకే ఇలాంటి నిర్ణయం ఆర్బీఐ తీసుకుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. 'మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) రుణ వసూళ్ల విషయంలో పెద్ద స్థాయిలో వత్తిడిని ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల మేలు జరుగుతుందని బుధవారం విడుదల చేసిన కోటక్ సెక్యూరిటీస్ నివేదిక వెల్లడించింది. ప్రత్యేకించి నష్టాల్లో సాగుతూ రుణాలివ్వడంపై ఆంక్షలున్న 'ప్రాంప్ట్ కరెక్టివ్ ఆక్షన్ ఫ్రేమ్ వర్క్' (పీసీఏఎఫ్‌డబ్ల్యు) పథకం కింద ఉన్న 11 ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల మేలు కలుగుతుందని ఆ నివేదిక వివరించింది. 'సెంట్రల్ బ్యాంకు నోటిఫికేషన్ మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. రుణాల వసూళ్లు ఆలస్యం అవుతాయని సంకేతాలుండటం వల్ల బ్యాంకర్లు తదుపరి రుణాలివ్వడానికి వెనుకంజ వేశారు. ఈక్రమంలో కేంద్ర నిర్ణయం బ్యాంకర్లు ఆరోగ్యకరమైన అభివృద్ధిని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయం దోహదపడుతుంద'ని ఆ నివేదిక పేర్కొంది. గత యేడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉన్న గణాంకాలే ఇందుకు ఉదాహరణ అని పేర్కొంది.

రుణాలను పునర్వ్యవస్థీకరించిన బ్యాంకులకు ఆ అప్పులు సైతం స్థిరాస్తుల జాబితాలోకి చేరుతాయి. ప్రత్యేకించి డీమానిటరైజేషన్, జీఎస్టీ వల్ల దెబ్బతిన్న బ్యాంకులకు ఈ నిర్ణయం ఎంతో ఉపయుక్తం కాగలదని నివేదిక వివరించింది.

పెరుగుతున్న ఆర్డర్లు

❑ ఆశాజనకంగా నిర్మాణ రంగం

ముంబయి, జనవరి 2: గత రెండు సంవత్సరాలుగా పైపులైన్ల ఏర్పాటుకు సంబంధించి పెద్దయెత్తున ఆర్డర్లు వస్తుండటంతో నిర్మాణరంగం స్థిరంగా, ఆశాజనకంగా ఉందని ప్రముఖ రేటింగ్ ఏజన్సీ ఇక్రా వెల్లడించింది. ఈ ఏజెన్సీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ రంగానికి ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెద్దయెత్తున ఆర్డర్లు వస్తుండటంతో ఈ రంగం స్థిరంగా కొనసాగుతోంది. ప్రభుత్వం నిర్మాణరంగంలో పెద్దయెత్తున ప్రాజెక్టులను చేపడుతోంది. ముఖ్యంగా పైపులైన్ ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్డర్లు నిర్మాణ రంగ సంస్థలకు ఊతం ఇస్తున్నాయి. దీనిద్వారా వాటి ఆదాయం కూడా ఆశాజనకంగానే ఉంది. ముఖ్యంగా రైల్వేస్, పోర్టు, పట్టణ అభివృద్ధి సంస్థలు, ఎయిర్‌పోర్టులకు సంబంధించిన ఆర్డర్లు వస్తున్నాయి. వీటి నిర్మాణం, పునర్నిర్మాణానికి సంబంధించిన పనుల వల్ల ఆయా కంపెనీలో చేతిలో ఆర్డర్లు బాగానే ఉంటున్నాయని ఇక్రా బుధవారం వెల్లడించింది. ఇదేవిధంగా రోడ్ల నిర్మాణం, పైపులైన్ ప్రాజెక్టులు, జాతీయ రహదారుల ఏర్పాటు కూడా పెద్దయెత్తున జరుగుతున్నాయి. భరతమాల పరియోజన ప్రాజెక్టు కింద పెద్దయెత్తున చేపడుతున్న పనుల వల్ల నిర్మాణరంగానికి పెద్దయెత్తున ఆర్డర్లు వస్తున్నాయి. ఈ పథకం కింద 5.36 ట్రిలియన్ల రూపాయలను ప్రభుత్వం పెట్టుబడిగా పెడుతోంది. దానికి తోడు పలుచోట్ల పైపులైన్ ప్రాజెక్టులు సైతం పెద్దయెత్తున జరుగుతుండటంతో నిర్మాణ సంస్థలకు, వాటి సబ్సిడరీ కంపెనీలకు చేతినిండా పని తగులుతోంది. అయితే ఏప్రిల్, మే నెలల్లో జరిగే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ అభివృద్ధి పనుల వేగం కొంత తగ్గుముఖం పట్టవచ్చునని అంచనా వేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో కొంత అస్థిర, అనిశ్చితి పరిస్థితులు ఏర్పడతాయని, ఎన్నికల ప్రక్రియ జరిగి నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు అభివృద్ధి పనులు పుంజుకోవని భావిస్తున్నారు. అయితే ఇప్పుడు తాము చేపడుతున్న పనులు కొనసాగుతూ ఉంటాయని, అయితే ఎన్నికలు జరిగే ఒకటి రెండు నెలలు బిల్లుల చెల్లింపు, ఇతర సాంకేతిక అంశాల కారణంగా పనులు మందగిస్తాయని నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి.







దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పరిశీలిస్తున్న విశ్రాంత ఇంజనీర్లు, దోమలపెంటలో ల్యాండైన విశ్రాంత ఇంజనీర్లు వచ్చిన హెలికాప్టర్

పరుగో..పరుగు

- శరవేగంగా సొరంగం పనులు
- ఎస్ఎల్‌బీసీని పరిశీలించిన నిపుణులు

శ్రీశైలం ప్రాజెక్టు, జనవరి 2: రాష్ట్రంలో సాగు, తాగునీరు కోసం ప్రారంభించిన శ్రీశైలం ఎడమగట్టు సొరంగ పనులను బుధవారం తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సలహామేర ప్రత్యేక హెలికాప్టర్‌లో రాష్ట్రంలో జరుగుతున్న వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పురోగతిని తెలుసుకొని నివేదిక ఇవ్వాలని సీఎం కోరినందుకు తాము సొరంగ పనుల పరిశీలనకోసం వచ్చినట్లు విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ప్రతినిధి బృందం సభ్యులు సొరంగం పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. దోమలపెంట నుంచి 13.7 కి.మీ. మన్నెవారిపల్లి నుంచి 19 కి.మీ పొడవున సొరంగం పనులు జరిగిందని, ఇంకా 10 కి.మీ సొరంగం పనులు జరగాల్సి ఉందని ఇంజనీరింగ్ అధికారులు వారి దృష్టికి తీసుకొచ్చారు. సొరంగంలోని 13.7 కి.మీ వద్ద లీకేజీ వాటర్ నిమిషానికి 9600 లీటర్లు వస్తుండటంతో పనులకు ఇబ్బందులు జరగడంతో నీటి తోడివేత కార్యక్రమాన్ని చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నిర్మాణ పనులకు సుమారు 1500 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. సొరంగంలో జరుగుతున్న జాప్యానికి సాంకేతిక, ఆర్థిక సమస్యలపై ముఖ్యమంత్రికి నివేదించనున్నట్లు శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. 2019 చివరినాటికి ఈ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. ఈ పనులను పరిశీలించేందుకు విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు చంద్రమౌళి, జెఎస్ నరేందర్‌రెడ్డి, వెంకటేశంలతోపాటు ఎస్ఎల్‌బీసీ ఈఈ ఉమాపతి, నిర్మాణ పనుల ఏజెన్సీ జనరల్ మేనేజర్ లోకనాథ్ తదితరులు ఉన్నారు.

‘జెన్నీ’ రికార్డు అబద్ధం!

రష్యా గణిత శాస్త్రవేత్త జాక్ అనుమానం

మాస్కో, జనవరి 2: ప్రపంచ చరిత్రలో ఇప్పటి వరకూ అత్యంత సుదీర్ఘ కాలం జీవించిన వ్యక్తి ఎవరని ప్రశ్నిస్తే, ఫ్రాన్స్‌కు చెందిన జెన్నీ కాల్మెట్ పేరును అందరూ పేర్కొంటారు. 1997లో జెన్నీ మృతి చెందినప్పుడు ఆమె వయసును 122 సంవత్సరాల 164 రోజులుగా అధికారులు నిర్ధారించారు. అంత ఎక్కువ కాలం అప్పటి వరకూ ఎవరూ జీవించలేదని ధ్రువీకరిస్తూ, రికార్డు పుస్తకాల్లో ఆమె పేరును నమోదు చేయించారు. కానీ, రష్యా గణితశాస్త్రవేత్త నికొలయ్ జాక్ మాత్రం ఈ రికార్డు తప్పని వాదిస్తున్నారు. అసలు జెన్నీ ఎప్పుడో మృతి చెందిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జెన్నీ కుమార్తె ఆమెలా పేరు మార్చుకుందని అతను జీవశాస్త్రవేత్త వాలెరీ నొవొసెలోవ్‌తో కలిసి సాగించిన పరిశోధనలో తేల్చిచెప్పారు.

జెన్నీవిగా చెప్పబడుతున్న ఫొటోలు, ధ్రువ పత్రాలు, సాక్ష్యాలను క్షుణంగా పరిశీలించిన మీదట, జెన్నీ కమార్తె వోన్నే జాక్ తన తల్లి పేరుమీద చెలామణి అయిందని జాక్ తన నివేదికలో స్పష్టం చేశారు. దీర్ఘాయుష్షుపై విస్తృత పరిశోధన చేసిన జాక్ పలు అంశాలను పరిశీలించినట్టు చెప్పారు. 1943లో జెన్నీ కుమార్తె వోన్నే మృతి చెందినట్టు నమోదైన పత్రాలను కూడా పరిశోధించినట్టు పేర్కొన్నారు. అన్ని సాక్ష్యాధారాలను పోల్చిచూస్తే, నిజానికి అప్పట్లో చనిపోయిందని జెన్నీ కుమార్తె వోన్నే కానేకాదని తేలిందని ఒక ప్రకటనలో జాక్ తెలిపారు. నిజానికి అప్పుడు జెన్నీ మృతి చెందిందని, అయితే, పన్నుల చెల్లింపు నుంచి తప్పించుకోవడానికి వోన్నీ తన తల్లి పేరును తానే తీసేసుకుందనడానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయన్నారు. జెన్నీ మృతి చెందితే, ఆ సమాచారాన్ని దాచేసిన వోన్నే తానే ఆమె గుర్తింపు పత్రాలను తీసేసుకుందని తెలిపారు. ఆతర్వాత వోన్నేనే జెన్నీగా చెలామణి అయిందన్నారు. ఆమె 1997లో తన 99వ ఏట మృతి చెందినట్టు పేర్కొన్నారు. జెన్నీ రికార్డు తప్పని, ఆమె అంతకు ముందే మృతి చెందిందని, ఆమె పేరుతో బతికిన వోన్నే వంద సంవత్సరాలు కూడా బతలేకదని రుజువైనట్టు చెప్పాడు. కాబట్టి జెన్నీ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును తొలగించాలని కోరాడు.



ఎక్కువ కాలం జీవించిన వ్యక్తిగా ప్రపంచ రికార్డు నెలకొల్పిన జెన్నీ ఫైల్ ఫొటో. అయితే, ఇది జెన్నీ ఫొటో కాదని, ఆమె కుమార్తె వోన్నేది అనీ రష్యా గణితశాస్త్రవేత్త ఆరోపిస్తున్నారు

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90


న్యాయమూర్తుల సంఖ్య పెంచండి


- కేంద్రానికి టీఆర్ఎస్ ఎంపీ వినోద్ విజ్ఞప్తి
- పరిశీలిస్తామన్న న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే విషయం పరిశీలిస్తామని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు బి.వినోద్‌కుమార్ బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో అడిగిన ఒక అనుబంధ ప్రశ్నకు బదులిస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రెండు హైకోర్టులు పని చేయటం ప్రారంభించటం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాలకు అభినందనలు తెలిపారు. సమర్థంగా పని చేయటం ద్వారా రెండు హైకోర్టులు దేశ న్యాయ వ్యవస్థ చరిత్రపుటల్లో సర్వదా నిలిచిపోవాలని ఆయన అభిలషించారు. తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంచటం గురించి మాట్లాడుతూ హైకోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్య పెంచేందుకు ఒక యంత్రాంగం ఉన్నది.. దాని ప్రకారం న్యాయమూర్తుల సంఖ్య పెంచుతామని రవిశంకర్ ప్రసాద్ హామీ ఇచ్చారు. అంతకు ముందు వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో హైకోర్టును ఏర్పాటు చేసినందుకు రవిశంకర్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ హైకోర్టుకు కేటాయించిన న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉండటం వలన పెండింగ్‌లో ఉన్న లక్షలాది కేసులు పరిష్కారం కావటం లేదని, బాధితులకు న్యాయం లభించటం లేదని అన్నారు. తెలంగాణ హైకోర్టులో పేరుకుపోయిన కేసులు త్వరగా పరిష్కారం కావాలంటే న్యాయమూర్తుల సంఖ్య పెంచాలని వినోద్‌కుమార్ న్యాయ శాఖ మంత్రిని కోరారు. అంతకు ముందు హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రధాన ప్రశ్న అడుగుతూ కింది కోర్టులో పేరుకుపోతున్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఖాళీల భర్తీకి పరీక్షలు నిర్వహించే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉన్నదా? ఉంటే దాని వివరాలు ఏమిటి? అని ప్రశ్నించారు. దీనికి రవిశంకర్ ప్రసాద్ బదులిస్తూ కింది కోర్టులో దాదాపు ఐదు వేల ఖాళీలున్నాయి.. వీటిని భర్తీ చేయవలసిన బాధ్యత రాష్ట్ర హైకోర్టులపై ఉన్నదని తెలిపారు. ఈ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని సూచిస్తూ ఆయా హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు పలుమార్లు లేఖలు రాసినట్లు ఆయన వెల్లడించారు. కింది కోర్టుల్లోని ఖాళీలను భర్తీచేసేందుకు సుప్రీం కోర్టుతో కలిసి పని చేస్తున్నామన్నారు. ఈ ఖాళీల భర్తీకి కేంద్రీకృత యంత్రాంగాన్ని రూపొందిస్తున్నారా? అని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. దీనికి రవిశంకర్ ప్రసాద్ సమాధానం ఇస్తూ అదనపు జిల్లా న్యాయమూర్తుల ఎంపికకోసం కేంద్ర స్థాయిలో ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జాతీయ న్యాయ కళాశాలల నుండి సమర్థులైన విద్యార్థులను జిల్లా అదనపు న్యాయమూర్తులుగా నియమించేందుకు ఈ ప్రక్రియ తోడ్పడుతుందని ఆయన తెలిపారు. అఖిల భారత జాతీయ న్యాయ సేవలను ప్రారంభించవలసిన సమయం ఆసన్నమైందని రవిశంకర్ ప్రసాద్ చెప్పారు.











మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

గురువారం, 3 జనవరి 2019





ఈమె వార్షిక జీతం కోటిరూపాయల పైనే..

ఈమె వయస్సు పాతిక సంవత్సరాలు..
జీతం నెలకు తొమ్మిది లక్షలు..
అంటే.. ఏడాదికి కోటి పైమాటే..
నమ్మట్లేదా.. కానీ ఇది నిజం..

ఆమే బీహార్‌కు చెందిన మధుమిత కుమార్ రూ. కోటికి పైగా వేతన ప్యాకేజీతో ఇంటర్నెట్ సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్లో ఉద్యోగం దక్కించుకుంది. మునుపు మధుమిత బెంగళూరులోని ఏపీజీ కంపెనీలో పనిచేసింది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెర్సిడెస్ కంపెనీలు కూడా మధుమితకు ఉద్యోగావకాశాన్ని ఇవ్వాలనుకున్నాయి. ఈలోగా గూగుల్ ఉద్యోగం మధుమితను వరించింది.

మధుమిత ప్లస్ టూ వరకు పట్నాలో వాల్మీలోని డీఏవీ స్కూల్లో చదివింది. తరువాత జైపూర్‌లోని ఆర్యా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి 2014లో మధుమిత కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసింది మధుమిత. ఆమె వంశంలోనే విదేశాలకు వెళ్లిన మొదటి వ్యక్తి మధుమితే.. తను 2018 ఫిబ్రవరిలో మొదటిసారి అమెరికాకు వెళ్లింది. మధుమితకు భారత మాజీ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అంటే మధుమితకు చాలా ఇష్టం. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మధుమిత ఇంజనీరింగ్ వైపు వెళ్లిందట. అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకున్న మధుమిత కలాం పుస్తకాలు, ఆయన జీవితచరిత్రను చాలా ఇష్టంగా చదువుతుందట. హైస్కూలు చదివేటప్పుడు మధుమితకు లెక్కలు, భౌతిక శాస్త్రం అంటే ఇష్టమట. స్కూల్ రోజుల్లో మధుమిత చాలా ధైర్యంగా డిబేట్ కాంపిటీషన్లలోనూ పాల్గొనేదట. చిన్నప్పుడు ఐ ఏ ఎస్ ఆఫీసర్ కావాలనుకుందట మధుమిత. అయితే ప్లస్ టూ పూర్తిచేశాక ఇంజనీరింగ్‌లో చేరింది మధుమిత.






మధుమిత తండ్రి అయిన సురేంద్ర శర్మ తన కూతురిని ఇంజనీరింగ్ చేయించాలనుకోలేదట. కారణం ఇంజనీరింగ్ అనేది అమ్మాయిలకు పెద్దగా నప్పదని అతని అభిప్రాయం. అయితే.. అమ్మాయిలు ఇంజనీరింగ్ రంగంలో రాణించడం చూసి అతను తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. కూతురి ఇష్టం మేరకు ఆమెను ఇంజనీరింగ్‌లో చేర్పించారు. సురేంద్ర శర్మ సోన్‌పూర్‌లోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో అసిస్టెంట్ సెక్యూరిటీ కమీషనర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుటుంబం మాత్రం పట్నాకు సమీపంలోని కహుగల్‌లో ఉంటోంది. మధుమిత పన్నెండో తరగతిలో 86 శాతం మార్కులను తెచ్చుకుందట. దేశంలోని మంచి కాలేజీల్లో చేర్పించడానికి ఇన్ని మార్కులను యావరేజిగానే భావిస్తారు. అయితే బోర్డు పరీక్షల్లో మంచి మార్కులు రాకపోయినా జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లవచ్చని ఆమె విజయం మరోసారి నిరూపించింది.

★

విద్యాప్రదాయిని సావిత్రిబాయి పూలే



నేడు సావిత్రిబాయి పూలే జయంతి

శ్రమించి పనిచేయండి. శ్రద్ధగా అధ్యయనం చేయండి. మంచి మార్గంలో నడవండి- సావిత్రిబాయి పూలే

వెయ్యి మైళ్ళ ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది. నేడు భారతదేశంలో ఏ మూలకు వెళ్లినా పుస్తకాలతో కళకళలాడుతూ ఆడబిడ్డలు బడికిపోతూ కన్పిస్తారు. కొన్ని వేల సంవత్సరాల నుండి వైదిక బ్రాహ్మణీయ సమాజం స్ర్తిలకు, శూద్రులకు చదువును నిరాకరించింది. జ్ఞానానికి వారిని దూరంగా ఉంచింది. కానీ నేడు ఇంతమంది స్ర్తిలు, శూద్రులు చదువుకుంటున్నారంటే, ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా, పరిపాలకులుగా అన్ని రంగాలలో సమాన అవకాశాలు పొందుతున్నారంటే దానికి మూల బీజం వేసింది పూలే దంపతులు. వారి త్యాగం, ధైర్యం, పట్టుదలవల్ల స్ర్తిలకు, శూద్రులకు చదువు సాధ్యమయింది. ఆధునిక భారతదేశంలో శూద్రులకు, అతి శూద్రులకు, స్ర్తిలకు విద్యను అందించేందుకు తన జీవితాన్ని త్యాగం చేసి కోట్లమందికి విద్యాప్రదాయిని అయింది మన చదువుల తల్లి క్రాంతి జ్యోతి సావిత్రి బాయి పూలే.

జనవరి 1831వ సంవత్సరం జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాలా ప్రాంతంలో శిఖాల గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలోగల నాయిగావ్ అనే గ్రామంలో జన్మించింది. తల్లి లక్ష్మిబాయి, తండ్రి ఖండోజీ. చిన్నప్పటినుంచే ఆకట్టుకునే మాట తీరు, ధైర్యసాహసాలు, చలాకీతనం, తెలివితేటలు, చురుకుదనం ఆమె సొంతం.

వివాహం

తొమ్మిదేళ్ల వయసులో పన్నెండేళ్ల జ్యోతిరావుకిచ్చి ఆమె తండ్రి వివాహం జరిపించాడు. ఆడదిక్కులేని ఆ కుటుంబ బాధ్యత చిన్న వయసులోనే సావిత్రిబాయి అందుకుంది. తన భార్య సావిత్రిబాయి ఎందుకు చదువుకోకూడదు అని ఆలోచించిన జ్యోతిరావు పూలే తానే స్వయంగా సావిత్రికి చదువు నేర్పాడు. ఈ విధంగా సావిత్రి మరాఠీ, ఆంగ్లంలో రాయడం నేర్చుకుంది. సావిత్రిబాయి చదువు నేర్చుకోవడం ఆమె జీవితానికి గొప్ప మలుపు. అంతేకాక భావి భారతానికి సరైన మార్గం చూపిస్తూ చరిత్రకెక్కింది. అది ఆమె వేసిన తొలి అడుగు అని చెప్పవచ్చు. 20 ఏళ్ల వయసులో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులైన పూలే తన మిత్రుల సహాయంతో 1848 జనవరి 1న పూనాలోని, బుధవారపేట నివాసి భిడే గృహంలో బాలికా పాఠశాలను ప్రారంభించారు. బాలికా విద్య కోసం భారతదేశంలోనే తొలిసారిగా స్థాపించిన ఈ పాఠశాల నందు ముఖ్య ఉపాధ్యాయినిగా సావిత్రిబాయి నియమింపబడింది. ఈ విధంగా సావిత్రిబాయి భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయినిగా చరిత్రకెక్కింది.

ఆడపిల్లలు చదువుకోవడం చెడిపోవడానికి తొలిమెట్టుగా భావించి, తమ ఆడబిడ్డలను పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు నిరాకరించేవారు. బ్రాహ్మణవాదుల, సంప్రదాయవాదుల అవహేళనలు ప్రతికూల పరిస్థితుల మధ్య సావిత్రిబాయి ముందుకు సాగింది. వారిని ఒప్పిస్తూ, బాలికల అభిమానాన్ని, ప్రేమను సంపాదించి, వారిని పైకి తీసుకురావాలని దృఢ సంకల్పంతో బాలికల మానసిక వికాసానికి తన శక్తియుక్తులను వెచ్చించింది.

ఇదేవిధంగా బాలికల పాఠశాలలను ఒకవైపు విస్తృతపరుస్తూనే, మరోవైపు 1852 మార్చి 3వ తేదీన అస్పృశ్యుల కోసం (దళితులకోసం) బేతాళపేటలో ఒక పాఠశాలను ప్రారంభించారు. ఇది భారతదేశంలో అస్పృశ్యుల కోసం ప్రారంభించిన తొలి పాఠశాల. అలా ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా సావిత్రిబాయి నియమింపబడ్డారు. అస్పృశ్యత అనే దుర్మార్గ విధానాన్ని ఎదిరించి సమానత్వం కోసం కృషిచేయాలన్న సద్బుద్ధితో మహాత్మా జ్యోతిరావు పూలే ఈ పాఠశాలను స్థాపించాడు.

సావిత్రిబాయి పూలే 1852 జనవరి 14న తిలగుండ్ సమారోహ్ అనే సంస్థను ఏర్పాటుచేశారు. ఇది భారతదేశంలోనే స్థాపించిన తొలి మహిళా సంస్థ. పూలే స్థాపించిన పాఠశాలలన్నింటినీ తీర్చిదిద్ది, వాటిని విజయపథంలో నడిపించడంలో సావిత్రి కృషి అనన్య సామాన్యమైంది.

భర్త చేసే సామాజిక కార్యక్రమాలలో అత్యధిక భారం సావిత్రిబాయి మోసింది. సమాజ సంస్కరణ, సామాజికసేవలను ఎంచుకున్న పూలే దంపతులు ఎదుర్కొన్న కష్టాలు, వారికి ఎదురైన దుర్భర పరిస్థితులు ఎంతో భయంకరమైనవి. స్ర్తివిద్య, సమాజ సేవ ఉన్నత లక్ష్యాలను తలకెత్తుకున్న సావిత్రిబాయి తను ఎటువంటి కష్టనష్టాలు ఎదురైనా తన లక్ష్యాన్ని వదులుకోలేదు. తన బుద్ధి, తన జ్ఞానం బహుజనులకు, ప్రజలకు ఉపయోగపడాలనే లక్ష్యంతో తన జీవిత ప్రయాణం కొనసాగింది.

1876-77 సంవత్సరకాలంలో మహారాష్ట్రలో భయంకరమైన కరవు వచ్చింది. మహాత్మా పూలే ఇటువంటి పరిస్థితుల్లో ఎక్కడికక్కడ భోజన కేంద్రాలు ప్రారంభించి అన్నదానం కొనసాగించారు. వారి పాఠశాలల్లో చదివే రెండువేల విద్యార్థులకు ఆహారం ఉచితంగా అందించే బాధ్యత సావిత్రి బాయి తీసుకుంది. కరవు కాలంలో సావిత్రిబాయి కొన్ని వందల మందికి ప్రాణదానం చేసిందంటే అతిశయోక్తి కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆనాటి మహారాష్ట్ర సమాజానికి సావిత్రిబాయి తల్లిలా మాతృత్వం పంచింది.

1953 జనవరి 28 బాల హత్య ప్రతిబంధక్ గృహాన్ని స్థాపించింది. ఒక్క సంవత్సరంలోనే 32 మంది గర్భవతులకు పురుడుపోసింది. 56 మంది వితంతువులు తమ బిడ్డలను తమ ఇంటి ఆవరణలోని ఊయల తొట్టిలో వేసి వెళ్లారు. ఆనాటి సామాజిక కట్టుబాట్లకు విరుద్ధంగా గర్భయతియై భయంతో ఆత్మహత్య చేసుకోబోతున్న బ్రాహ్మణ వితంతువును రక్షించి తమ ఇంట్లో ఆశ్రయం కల్పించారు. ఆ బ్రాహ్మణ వితంతువు ఖాసీబాయి కన్నబిడ్డ యశ్వంతరావును దత్తత తీసుకొని చదివించి డాక్టర్ను చేసి, జ్యోతిబా మరణానంతరం సత్యశోధక్ సమాజ్‌ను నడిపిన ధీశాలి సావిత్రిబాయి పూలే. మహాత్ముడు జ్యోతిబా పూలే అంత్యక్రియలను తానే నిర్వహించిన సంఘ సంస్కర్త.

1896లో వచ్చిన కరువులోనూ తాను ముందుండి సహాయ కార్యక్రమాలను నిర్వహించిన మానవతామూర్తి. కరువు తరువాత 1879లో పూణే ప్రాంతాన్ని ప్లేగు మహమ్మారి చుట్టుముట్టింది. ప్రాణాంతక వ్యాధి అది తెలిసినా సాటి మనుషులకు సహాయం చేయకుండా ఉండలేనితనం వల్లనే ప్లేగు సోకిన బాలుడిని భుజాన వేసుకుని ఆసుపత్రిలో చేర్చింది. ఆ బాలుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మాతృమూర్తి సావిత్రిబాయి ప్లేగు బారినపడి మరునాడు ఉదయం తుదిశ్వాస విడిచింది. ఒక ఊపిరి ఆగిపోయింది. భౌతికంగా విశ్వంలో కలిసిపోయింది. ప్రజల ఉన్నతిని కాంక్షించిన పూలే దంపతులు కృషి కోట్లమంది విద్యావంతులను ప్రజ్వలింపజేస్తూనే ఉంది.

శూద్రులైన మగవాళ్ళు చదువుకోవడమే తప్పైన కాలంలో స్ర్తిగా సావిత్రిబాయి చదువుకుంది. బ్రాహ్మణ వితంతువులకు ఆసరగా ఉండడమే కాకుండా వారికి గుండు గీయించటానికి వ్యతిరేంగా మంగలి పనివారి సమ్మెకు నాయకత్వం వహించింది. భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయిని, ఆపన్నులను అక్కున చేర్చుకున్న కరుణామయి సావిత్రిబాయి. మరాఠా సాహిత్యంలో తొలితరం రచయిత్రి ఆమే కావడం విశేషం. నేడు మనమందరం నిజమైన చదువుల తల్లి సావిత్రిబాయి పూలేని స్మరించుకోవాలి. ఆమెను అవగాహన చేసుకోవాలి. సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలి. ఆమె ఆశయ సాధనకోసం కృషిచేయాలి.

- వాసిలి సురేష్
94946 15360

నీడ'పట్టు'న ఆరేస్తే మేలు..



శుభకార్యాల వేళ పట్టు బట్టలు ధరించడం మన సంప్రదాయం. అయితే.. సాధారణంగా పట్టుబట్టలపై మరకలు పడితే ఓ పట్టాన వదిలిపోవు.. నూలు దుస్తుల్లా ఎడాపెడా ఉతకనూ లేము.. అందుకే ఎంతో డబ్బుపోసి కొన్న పట్టుబట్టలు ఉతికేటప్పుడు, ఆరేసేటప్పుడు, లోపల దాచే విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే అవి పదికాలాల పాటు మన్నికగా ఉంటాయి.

జాగ్రత్తలు

- పట్టుచీరలను ఎప్పుడూ చెరువు, నది నీటితోనే ఉతకాలి.
- బోరు నీటితో ఉతికేవారు ఆ నీటిలో చిటికెడు బొరాక్స్ కలపాలి.
- వీటిని ఉతికేందుకు నాణ్యమైన, తేలికపాటి సబ్బును ద్రవ లేదా పొడి రూపంలోదే వాడాలి.
- బోరునీరైతే తేలికపాటి డిటర్జెంట్ వాడాలి.
- పట్టుబట్టలు ఉతికిన తరువాత చేతితో సున్నితంగా పిండి నీడపట్టున ఆరేయాలి.



మరకలు పడితే..

- పట్టుబట్టలపై కాఫీ లేదా టీ మరకలు పడితే కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను పూస్తే మరకలు పోతాయి. అప్పటికీ పోకపోతే వేడినీటిలో కొద్దిగా హైడ్రొజన్ పెరాక్సైడ్ వేసి ఆ నీటితో ఉతకాలి.
- పట్టుబట్టలపై చాక్‌లెట్ మరకలు పడితే వేడినీటిలో జాడించి ఉతికితే పోతాయి. అదే.. పెరుగు, వెన్న వంటి మరకలు పడితే ఆ భాగంలో ఒక చుక్క కార్బన్ టెట్రా క్లోరైడ్‌ని ఉపయోగించాలి.
- పట్టుబట్టలపై ఇంక్ లేదా లిప్‌స్టిక్ మరకలు పడితే ఆ భాగంలో పేపర్ టవల్‌ను ఉంచి వెనుకనుంచి డ్రైక్లీనింగ్ ద్రావణం లేదా ఆల్కహాల్ పూయాలి. మరక పూర్తిగా పోయేవరకు నీటిని వాడరాదు. అదే నెయిల్ పాలిష్ పడితే ఆ భాగం వరకు అసిటోన్‌లో ముంచితే సరిపోతుంది.
- బురద, మట్టి మరకలు పడితే పట్టు వస్త్రాన్ని ఆరనిచ్చి కార్బన్ టెట్రాక్లోరైడ్‌తో తుడిచి ఉతికితే సరిపోతుంది.
- షూ పాలిష్ మరకలు పడితే కొద్దిగా లిక్విడ్ డిటర్జెంట్ వేసి రుద్ది ఆ తర్వాత ఆల్కహాల్ పూయాలి.

జాగ్రత్త చేయండిలా..

- పట్టుబట్టలను ప్లాస్టిక్ సంచుల్లో కాక పేపర్ లేదా కాటన్ సంచుల్లోనే ఉంచాలి.
- పట్టుబట్టలున్న చోట ఎక్కువ గాలి, కాంతి లేకుండా చూడాలి.
- పట్టుబట్టలనను చెక్క లేదా కలపతో చేసిన పెట్టె లేదా బీరువాలో నేరుగా తాకేలా కాక కవరులో పెట్టి పెట్టాలి.
- పట్టుబట్టలను అప్పుడప్పుడూ బయటకు తీసి గాలి సోకనీయాలి. లేకుంటే మడతలు పడిన చోట చిరుగులు పడే అవకాశం ఉంది.

★

యాత్రికులం అంతే..!

సంవత్సరం పేజీలు తిప్పకుంటున్న తీరులో మన ప్రయాణాలు అని
అనుకుంటుంటాము..
పేజీలు తిప్పడంలో సాయపడుతూ
మనతోనే అందరూ ఉన్నారని భావిస్తుంటాము..

అదేమిటోగానీ
ఎప్పటికప్పుడు ఏది చివరి రోజో తెలియక
ఎవరితోనూ ఒక్కమాటైనా చెప్పకుండా
ఒక్కొక్కరిగా సంవత్సరం మాయమవుతున్నట్లు
మనమూ మాయమైపోతుంటాం..!
రెండూ వేర్వేరే అయినా
ఇద్దరినీ అపహరించడంలో
సమయానిదే ప్రముఖ పాత్ర!

మాకు బతకడమే తెలుసు అనుకుంటూ
సమయపు మెలకువలో మనం నిత్యం ఓడిపోతుంటాం!
ఎప్పుడు ఏ జోలపాట వినిపిస్తుందో
ఎవరిని ఏ నిద్రలోకి తోసేస్తుందో తెలియక
సమయాన్ని చేతికి కట్టుకుని మరీ
మాటిమాటికీ మరొకరు చూసేలా
చూసేస్తుంటాం...


ఏం చేస్తాం..?
మనం యాత్రికులం అంతే
నీవిచ్చిన వేళల్లోనే కదా ఉభయ సంధ్యల్ని చూసేది..
నీవెప్పుడు అలారం మోగిస్తావో
నీవెప్పుడు బ్యాటరీ లేదని కాలాన్ని ఆపేస్తావో..
దేనికీ ఆకారం, వికారం కారణం కాదు
విలయతాండవం చేస్తున్న నీవు తప్ప!

- శైలజామిత్ర
92909 00879

రంగవల్లి



శ్వేత సంబరాజు
అమీర్‌పేట, హైదరాబాద్



17 చుక్కలు,
5 వరుసలు, 5 వరకు..

ముగ్గులకు ఆహ్వానం

నింగిలోని హరివిల్లులను నేలపైన పేర్చి.. కనులకింపైన రంగుల్ని అందంగా అద్దితే అది రంగుల మాలికవుతుంది. ముంగిట్లో రంగవల్లిక అవుతుంది. ధనుర్మాసం సందర్భంగా తెలుగు ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దడం ఆనవాయితీ.. ఆ సందర్భంగా ముగ్గులకు ఆహ్వానం పలుకుతోంది మాతృభూమి. ఆసక్తి కలవారు కింది చిరునామాకు ముగ్గులను పంపగలరు.

సూచనలు

★ ముగ్గులను పంపేవారు ఎ4 సైజు తెల్లకాగితంపై వేయాలి.

★ ముందుగా నల్లని ఇంక్‌తో ఔట్ లైన్ గీసిన తరువాత అందులో రంగుల్ని నింపాలి.

★ ఎన్ని చుక్కలను పెట్టి ముగ్గులు వేశారో.. అంటే సరిచుక్కలా, బేసి చుక్కలా, సందు చుక్కలా.. అనే విషయం స్పష్టంగా రాయాలి.

★ ముగ్గుతో పాటు, మీ పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోని, చిరునామాని జతచేయాలి.

★ డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు కాక, స్వయంగా చేతితో వేసిన ముగ్గులనే పంపాలి. అదీ చుక్కల ముగ్గులకే ఆహ్వానం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్- 500 003.

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటె ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచు బ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి గురువారం, 3 జనవరి 2019

శ్రీనరసింహ శతకము

సీ. తనువులో ప్రాణముల్ -తరలిపోయెడి వేళ
నీ స్వరూపమును ధ్యా నింపవచ్చు
నిమిష మాత్రములోన నిన్నుఁజేరునుగాని
యముని చేతికిఁజిక్కి శ్రమలఁబడడు
పరమ సంతోషాన - భజన చేసెడివారి
పుణ్యమేమనవచ్చు-భోగిశనయ!
మోక్షము నీదాస- ముఖ్యుల కుఁగాని
నరక మెక్కడిదయ్యె - నళినసేత్ర
తే. కమలనాభ!నీ మహిమను గానలేని
తుచ్ఛులకు ముక్తి దొరుకుట దుర్లభంబు
భూషణ వికాస! శ్రీ ధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర

భావం: ఓ నరసింహస్వామి! ప్రాణం విడిచి వెళ్ళేవాడు చిట్టచివర నిన్ను ధ్యానిస్తే, వెంటనే మోక్షాన్ని అందుకుంటాడు. అతనికి నరకబాధ తప్పుతుంది. మహానందంతో నీ భజన చేసేవారు పుణ్యాత్ములు. నీ భక్తులకే మోక్షమబ్బుతుంది. నరక బాధలు వారినంటవు. నీ గొప్పదనం తెలీని అజ్ఞానులకు సంసార బంధ విముక్తి అబ్బదు.

అనంతం

26 -గోపరాజు నాగేశ్వరరావు


అది అనుకుండట్టే మొగపిల్లోడే బుట్టిండుగానీ, పేర్దెచ్చే గొప్పోడు గాదు! యదవనాకొడుకు బుట్టిండు.. ఏం శాత్తావూ!

దేవతసువంటిది నా పెండ్లాం! ఇసువంటి కొడుకునిగని తండాకి సెడ్డ పేరుతెత్తాడంటే యీడ్నదే సావనూకేది. దేవతగాని కొడుకునిట్టా సూళ్ళేక ముందుగాల్నే సచ్చింది. సూత్తా అవమానాలు భరిత్తా నేను మాత్తరవ్ సచ్చి బతుకుండాను.

రాగ్యా శండాలపోడని నేనే సెప్తున్నా నింకా యిసారణలూ, సాచ్చీకాలూ ఏంటికి! ఆడేడుండాడో సూచి యత్తకరండి. సావగొట్టండి అని కాళీచరణ్ వలవలా ఏడ్చాడు.

అందరూ కొద్ది క్షణాలు నిర్విణ్ణులయ్యారు!

సూర్యోదయంతోనే అడవికి వెళ్ళటం,



సంపద సేకరించి సాయంత్రానికి ఇల్లు చేరటం, కొడుక్కింత వండిపెట్టి తాను తినటం, నిద్రపోవటం తప్ప ఏ విషయాలూ పట్టించుకోడు కాశీచరణ్.

మౌనంగా వుంటాడు. నిర్వికారంగా తన పని తాను చేసుకొని పోతుంటాడు. యాంత్రికంగా బ్రతుకుతుంటాడు. మిన్నువిరిగి మీద పడుతుందన్నా చలించడు.

అలాంటివాడు కొడుకుచేసిన పనికి కుమిలిపోతూ అలా గుండె పగిలేలా ఏడవటం అందరికీ బాధనిపించింది.

''ఇందులో నీ తప్పేంటిదుంది.. యాడవగాకు..'' అన్నాడు బాణావతు.

''గాచారవ్ అట్టాగుంది. నువ్వేటి జాస్తావ్వే'' అన్నాడు నగ్గూరాం.

సానుభూతి భరించలేకపోతున్నాడు కాళీచరణ్!

''గాచారవ్ గాదూ, వల్లకాడుకాడు! రాగ్యాగాడ్ని సావగొట్టండి. వాడి గాచారవని అప్పుడనండి'' అన్నాడు కన్నీళ్ళు తుడుచుకుంటూ.

నిశ్శబ్దం ఆవరించిందక్కడ!

రాగ్యా కోసం వెతుకుతూ వెళ్లి కొంత మంది హడావిడిగా తిరిగొచ్చారు.

''రాగ్యా కనిపిచ్చలేదా?'' బాణావతు అడిగాడు.

''కనిపిచ్చిండు''

''పట్టరాలేదేంటిది''

''పారిపోయిండు'' అని చెప్పారు వాళ్ళు.

''యాడ కనిపిచ్చిండు'' బాణావతు మళ్లీ అడిగాడు.

''ఇంట్లోనే వుండాడు. మమ్మల్ని సూసి కంచె దుమికి పారిపోయిండు''

అందరూ అనుమానంగా కాళీచరణ్‌ని చూశారు!

కాళీచరణ్ అబద్ధం చెప్పాడా?

వాళ్ళంతా తన వైపు ఎందుకలా అనుమానంగా చూస్తున్నారో కాళీచరణ్‌కి అర్థమయ్యింది!

మళ్లీ అందరికీ దణ్ణం పెట్టాడు. ఏడుపు దిగమింగుతూ-

''నన్నట్టా సూడగాకండి! సెట్టు తల్లి సాచ్చిగా అడవి తల్లి సాచ్చిగా సెప్తుండాను! సెట్టుకాడికినేనొచ్చేప్పుడు రాగ్యా ఇంటో లేడు. ప్రైవాణకవే జెయ్యవంటే శాత్తాగూడా!

తరువాత వొచ్చుంటాడు. అది నాకు తెలవదుగదా!

అడవి తల్లినీ, ఆశారాల్నీ నమ్మినోడ్ని.. కొడుకుని ఇంటో దాపెట్టి లేడని సెప్తానా?

ఆడుసేసింది తప్పు.. నాకూ తెలుసు.. తప్పు సేసినోడ్ని రచ్చిచ్చటానికి నేనేవీ యదవనుగాను.. కొడుకయితే ఏంటిదంట! తప్పుజేసినాక ఎవుడ్నయినా శిచ్చిచ్చాలంతే!

యాడికిబోయిండో యతకండి. సెట్టుకు కట్టేసి బాగా సావగొట్టండి. వల్లగాకుంటే సింత బరికె నాకియ్యండి. మీకాడికి నేనే బాగా గొడతాను'' అన్నాడు కాళీచరణ్.

''రాగ్యాగాడు దొరికినాకనే పంశాయితీ! ఇందులో కాళీచరణ్ తప్పేటీ లేదని తీరువానమయ్యింది'' అని, తండా వాళ్ళతో బాణావతు అన్నాడు.

ఎవరి పనులకు వాళ్ళు వెళ్లిపోయారు.

వాళ్ళు గమనించలేదు కానీ,

ఇంట్లోనుంచి పారిపోయిన రాగ్యా, గరుడాచలం దగ్గరికి వెంటనే వెళ్ళలేదు. పంచాయితీ చెట్టుకు కొంచెం దూరంగా పొదల్లో నక్కి కూర్చుని, అక్కడ జరిగిందంతా చూసాడు!

రాగ్యా వొళ్ళు మండింది!

కోపంతో రగిలిపోయాడు.

చివరికి కన్న తండ్రి కూడా వాళ్ళవైపలే ఉన్నపుడు తండాతో ఇకనాకేమిటి సంబంధం అనుకున్నాడు.

తనకోసం వెదకుతున్న కుర్రవాళ్ళ కంట పడితే చాలా ప్రమాదం!

రాగ్యా ఇక ఆలస్యం చెయ్యలేదు. పొద్లో నుంచి నిశ్శబ్దంగా పైకి లేచాడు. చుట్టూ చూసాడు.

ఎవ్వరూ గమనించటంలేదు!

అక్కడ్నించి పరుగు లంకించుకున్నాడు.

అసలికే వొళ్ళంతా నెప్పులతో సలుపు తీస్తున్నది తలమీది గాయం బాధిస్తున్నది. జ్వరం వచ్చినట్టుంది.

అలాంటి పరిస్థితిలో విశ్రాంతిగా పడుకుంటే కొంత సేపటికి శక్తి పుంజుకొనేవాడు. అలాంటి అవకాశం లేకుండా పోయింది. పరిగెత్తటం అనివార్యమైంది కానీ, నిజానికి రాగ్యాకిప్పుడు అంత శక్తి లేదు.

అతని శరీరం నుండి చెమట ధారలు కడుతోంది. పరుగెత్తీ, పరుగెత్తీ అలసటగా, ఆయాసంగా వుంది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి.

మరో వైపు ఆలోచనల వడ్రంగి పిట్టలు ముక్కులతో పొడుస్తున్నాయి!

కన్నకొడుకు రక్షణకు రానివాడూ ఒక తండ్రేనా? సాంప్రదాయాలు.. ఆచారాలు, కట్టుబాట్లే ముఖ్యమని తండ్రి భావించినపుడు అలాంటి తండ్రితో ఇక అనుబంధం ఏమిటి?

కన్నతండ్రికన్నా గరుడాచలమే నయమనిపించాడు!

అతని ఆశయంలో వుండి అద్భుతాలు సాధించాలి. జీవితాన్ని సుఖమయం చేసుకొని గొప్పవాడై అప్పుడు కనిపించాలి- అనాగరికులైన తండావాళ్ళకి.

చాందినీ తిరస్కరిస్తున్నది కూడా తను గొప్పవాడుకానందుకే కదా!

ధనం, పలుకుబడి, నాగరికత, పట్నం వాసం, విలాసవంతమైన జీవితం సాధిస్తే -తను వెంటపట్టంకాదు, చాందినీయే తన వెంటపడి వస్తుంది!

(ఇంకా ఉంది)

మరీచిక

-వాసిరెడ్డి సీతాదేవిరంగనాయకమ్మ

చెదపట్టిన నిత్య జీవిత పుస్తకం పుట లక్షణాల నుంచీ కట్టుకొయ్యక్కట్టిన పశువుల్లాటి విసుగెత్తించే రోజుల్నుంచీ, రూపాయిల వాసన వేసే మనుషులనుంచీ, బిగుసుకుపోయిన పొడిబారిన ముఖాలనుంచీ తప్పించుకొని కాసేపు సంతోషంగా గడపాలంటే సాహిత్యమే శరణ్యం.

ఏ దేశ సంస్కృతిని తెలుసుకోవాలన్నా ఆ దేశ సాహిత్యం గురించి తెలుసుకోవడం తప్పనిసరి. నిజమైన సాహిత్యం ఆనాటి సమాజాన్ని ప్రతిబింబిస్తూనే వుంటుంది. ఆనాటి భారతం, రామాయణం ఈనాటికీ నిలిచి వున్నాయంటే సమాజ చిత్రణను అద్దంలా ప్రతిఫలించడమే ముఖ్య కారణం. సమాజంలోనైనా, సాహిత్యంలోనైనా పురుషాధిక్యత అనూచానంగా వస్తూనే వుంది. 18వ శతాబ్దం వరకు పుంఖానుపుంఖాలుగా వున్న రచయితలలో ఏ మొల్లో, ముద్దుపళనో తప్ప మరొక రచయిత్రి లేదు. ఒకప్పుడు స్త్రీకి ''విద్య అవసరమా! అనవసరమా!'' అనే విషయం చర్చనీయాంశం అయిందంటే మనిషికి తప్పనిసరయిన ప్రాథమికావసరాలు కూడా స్త్రీవిషయం వచ్చేసరికి పోరాడితేగాని సాధ్యపడని పరిస్థితి సంఘంలో ఉన్నదని తెలుస్తూనే వుంది. కందుకూరి వీరేశలింగం, రాజారామమోహనరాయ్ మొదలగువారు స్త్రీ విద్య ఆవశ్యకతను గూర్చినొక్కి చెప్పినాక స్త్రీలు విద్యావంతులైనారు. ఉద్యోగస్థులైనారు. స్వేచ్ఛ రెక్కలు తొడుక్కున్నారు.

వినమరుగైన..

-మందరపు హైమావతి

అరవయ్యవ దశకంలో రచయిత్రుల యుగం వచ్చినట్లే అనిపిస్తుంది. యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, వాసిరెడ్డి సీతాదేవి మొదలగువారందరు ఆనాటి వారపత్రికల్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలారు. ఆనాడు కొందరు పురుష రచయితలు కూడా స్త్రీల పేర్లు పెట్టి పత్రికలకు రచనలు పంపించారంటే ఆనాటి రచయిత్రుల వైభవాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

కానీ అప్పటి స్త్రీల సాహిత్యాన్ని వంటింటి సాహిత్యమని ఎద్దేవా చేశారు. ఆడవాళ్ల సాహిత్యమని వంకరగా పలికారు. ఇవన్నీ పట్టించుకోకుండా ఆలోచిస్తే ఆనాటి రచయిత్రులు వాళ్లకు పరిమితమైన ప్రపంచాన్ని గురించే సహజంగా వర్ణించారు. పాఠకులు వాళ్లకు నీరాజనాలిచ్చారు.

అలాటి రచయిత్రుల యుగంలో విభిన్నమైన వస్తువుల్ని తీసుకొని ఆనాటి సమాజాన్ని తన రచనలలో ఆవిష్కరించిన వ్యక్తి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి.

వీరు గుంటూరు జిల్లాలోని చేబ్రోలులో 1932లో జన్మించారు. 39 నవలలు, 9 కథా సంపుటాలు, 3 వ్యాస సంపుటాలు ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం, మద్రాసు తెలుగు అకాడమీ మొదలగు ఇరవై సంస్థల నుండి అవార్డులు అందుకొన్నారు.

ఈమె పరదా పద్ధతి పాటించే అతి సాంప్రదాయ కుటుంబంలో పుట్టి పెళ్లి చేస్తామంటే తిరస్కరించి, బయటకు వచ్చి స్వయంకృషితో ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ రంగంలో ఎన్నో ఉన్నతోద్యోగాలు చేశారు.

సీతాదేవి లెక్కకు మించి ఎన్ని రచనలు చేసిన ఆవిడకు ప్రధానంగా కీర్తి తెచ్చిపెట్టినవి నవలలే. ఈవిడ రచించిన మట్టిమనిషి 14 భాషల్లో అనువాదమైతే, మరీచిక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిషేధానికి గురైంది.

తోటి రచయిత్రులు కుటుంబ వృత్తాంతాన్ని, ప్రేమకథల్ని ఇతివృత్తంగా తీసికొంటే సీతాదేవి గారు మాత్రం సంక్షుభితమైన సమస్యలతో అల్లకల్లోలమైన సంఘాన్ని తన రచనలకు ఇతివృత్తంగా ఎన్నుకొన్నారు.

పితృస్వామ్య వ్యవస్థను, పెట్టుబడిదారీ సమాజంలోని లోపాలను తన కలంకత్తితో చీల్చి చెండాడుతూ, సజీవమైన పాత్రల్ని సృష్టించి, సంఘం వీపుపై చెర్నాకోల దెబ్బలవంటి నవలల్ని రాశారు. అలాటి నవలే మరీచిక.


ఈ నవల 89లో మొదటి ముద్రణ పొందింది. తర్వాత 82, 83, 85, 95, 2000లలో మలి ముద్రణలు పొందింది. పుస్తకంగా రాకముందు ఈ నవల 1978లో ఆంధ్రభూమి వారపత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. ప్రభుత్వానికి అభ్యంతకర విషయాలున్నాయని 82లో దీన్ని నిషేధించారు. ఈ నిషేధానికి వ్యతిరేకంగా అందరూ పోరాడిన తరువాత ఈ నిషేధాన్ని ఎత్తేశారు.రెండు దశాబ్దాల కిందట యువతరాన్ని పట్టి పీడించిన హిప్పీయిజం, నక్సలిజం సమస్యల గురించి, విద్యార్థులపై వాటి దుష్ప్రభావం గురించీ, దీనికంతటికీ కారణమైన అస్తవ్యస్తమైన సంఘం గురించీ ఎక్కుపెట్టిన బాణమే మరీచిక నవల.ఏ సమాజానికైనా యువతరం జీవగఱ్ఱ వంటివారు. దేశాన్నిగానీ, సంఘాన్ని గానీ ఉన్నత పథాలవైపు తీసుకువెళ్లాలన్నా అధోగతిలో పడేయాలన్నా వారే ముఖ్యకారకులు. ఆనాడు భారత దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఎంతోమంది యువకులు చదువులు వదిలేసి ఉద్యోగాలు తృణీకరించి జీవితాలను దేశం కోసం అర్పించారు.

-సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన
శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

మాటాట

నిర్వహణ: సుధామ **1836**



అడ్డం	ఆధారాలు	నిలువు
2.వినే వి లేకుండా పిలకా గణపతిశాస్త్రి నవల		1.ఒజ్జ
5.రోగము		3.లాభము
7.లక్ష్యము		4.పిసినారి
8.సైన్యము, గుంపు		6.దెబ్బలాట!
10.గృహము		9.చెఱబండరాజు కవిత్వ సంపుటి
11.ఇది గలవానికి నా వందనాలు!		10.గుప్పిటలో జారిపోయేది దీని మాఫియా కూడా వుంది!
13.అర్జునుడే!		12.జీవనము
14.చాటింపు		

మాటాట-1835 సమాధానాలు

అడ్డం	అడ్డం	నిలువు	నిలువు
1.సదాశివుడు	9.యావ	2.శిఖరం	7.సవరం
5.సోది	10.నైజం	3.చాసో	10.నైట్
7.సత్తి	12.రంభ	4.తుత్తి	11.గరిక
8.మొగ్గ	14.హరికథలు	6.దిగ్గజం	13.భద్రం

శ్రీ వేంకటేశ్వర సహస్ర నామావళి

పఠనీయం

శ్రీవేంకటేశ సహస్రనామావళి (వరివస్యా వ్యాఖ్యా సమేతము)- వ్యాఖ్యాత: డా. కె.వి.రాఘవాచార్య,
పేజీలు:374, వెల:రూ.432/-
ప్రతులకు:డా. కె.వి.రాఘవాచార్య, 106, శ్రీపాద కేశవ టవర్స్, 11-35, ఎస్.వి.నగరు,
తిరుపతి- 617502. ఫోన్: 9704342668.

నిరంతర సాహిత్య కృషీవలులు, శ్రీ వేంకటేశ్వర సాహిత్య సేవకుడు అయిన శ్రీ కె.వి.రాఘవాచార్యులవారు శ్రీ వేంకటేశ్వర సహస్రనామాలకు చేసిన అద్భుత వరివస్యావ్యాఖ్యాన గ్రంథమే ఇది.

ఈ వేంకటేశ్వర సహస్రనామాలలోని ఒక్కొక్క నామం ఒక మంత్రమని సంప్రదాయజ్ఞుల విశ్వాసం. అందువలన మొత్తం నామాలన్నీ కలిసి మంత్రశాస్త్ర విధానంలో ఇది ఒక మహామాలామంత్రమవుతుంది. ఈ స్తోత్రం బ్రహ్మాండ పురాణంలో 12వ అధ్యాయంలో వసిష్ట నారద సంవాదతాత్మకంగా ఉన్నది.

రచయిత ఈ గ్రంథానికి ముందుగా వ్రాసిన 'ప్రరోచన'లో ఈ నామాల చరిత్ర, ఎవరెవరు ఎలా పూజించారో, వాటికి ఆ రాజులచే కేటాయించబడిన ఖర్చులు- వీటి వివరాలు తిరుమల ఆలయానికి గల వివిధ ప్రాకారాలలోని గోడలపైన చెక్కబడిన శాసనాలలో వివరించబడినది ఇచ్చారు. అలాగే ఈ నామాలు కొన్ని విష్ణుసహస్రనామాలలో సుమారు 130 ఉన్నవని చెప్పారు. ఇంకా వేంకటేశుని చరిత్రను, వేంకటాచలమునకు సంబంధించినవి 56 నామాలు మాత్రమే ఉన్నవని అన్నారు. శ్రీ వరాహస్వామికి సంబంధించిన నామాలు ఏడు, మిగిలిన నామాలు భగవంతుని వివిధ అవతారాలకు, గుణాదులకు సంబంధించినవని చెప్పారు.

శ్రీ ఈ.ఏ.శింగరాచార్యులవారు తమ ముందుమాటలో (వరివస్యావైభవం) వ్రాస్తూ శ్రీ వేంకటేశ్వర సహస్రనామాలను తెలుగులో ఇంత విశదమైన వ్యాఖ్య రాలేదన్నారు. ఇంకా మొదటి 67 నామాలు స్వరూప విశేషాలు, తరువాత సుమారు 400 నామాలు పలు అవతారాల వైభవాన్ని తెలుపుతున్నాయి. మత్స్యావతారం, అమృతమథన, కూర్మ, ధన్వంతరి, మోహినీ అవతారాలు, వరాహావతారం, నృసింహావతారం, పరశురామావతారం, రామావతారం, కృష్ణావతారం, బుద్ధావతారం, కల్కి అవతారం, అంతరాదిత్యరూపం, హయగ్రీవ అవతారం, గజేంద్ర మోక్షం ప్రస్తావించబడ్డాయని చెప్పారు. 'శ్రీవేంకటేశాయనమః' అనే మొట్టమొదటి నామానానికి రచయిత ఇచ్చిన సమగ్రమైన వ్యాఖ్యాన వివరణ వ్యాఖ్యాత యొక్క సమర్థతకు, బహుముఖమైన ప్రతిభకు, విషయ పరిజ్ఞానానికి, విషయ ప్రతిపాదన కౌశలానికి నిదర్శనం. 'వేం' 'కట' అనే రెండు పదాలకు వివరణ పురాణాలను ప్రమాణంగా చెప్పుతూ వివరించారు. అలాగే 'సేతు కృతే నమః' వ్యాఖ్యకు రచయిత ఎన్నో సాక్ష్యాలు తంజావూరు గ్రంథాలయం నుంచి సంపాదించి దీనిలో వేసిన చిత్రపటం, వీరి నవీన పరిశోధనా నైపుణ్యాన్ని వ్యక్తపరుస్తున్నది.

అలాగే 'సర్వభక్త సముత్సుకాయ నమః' నామాన్ని వ్యాఖ్యానించేటప్పుడు, కాకినాడ కోర్టులో 15-10-1888న శ్రీ వేంకటేశ్వరస్వామి సాక్షిగా ప్రత్యక్షమై తన భక్తుని రక్షించటానికై సాక్ష్యమిచ్చాడు (పే.185). తన భక్తుడైన నల్లప్ప శెట్టి రెండు వేల రూపాయలు అతడి మిత్రుడైన ఖాసిం సాహెబు నుంచి అప్పుగా తీసుకుని తరువాత తీర్చేసినా, ఖాసిం తన అప్పు తీర్చలేదని శెట్టిమీద దావా వేస్తే స్వామి సాక్షిగా కోర్టుకు వచ్చి సాక్ష్యమిచ్చాడట. ఆస్తికులు ఇది నమ్మినా అప్పు తీసుకున్న రూపాయలు అనగా రెండువేలు - ఇది కొంత అనౌచిత్యముగా ఉన్నది. ఎందుకంటే అప్పుడు రెండు వేలు అంటే చాలా పెద్ద మొత్తము. ఇంకొక నామం 'బ్రహ్మోత్సవ సముత్సుకాయ నమః' నామానికి వ్యాఖ్యత సుదీర్ఘ వ్యాఖ్యానం చేశారు (పు.330). బ్రహోత్సవ ఆవిర్భావం, దాని వైశిష్ట్యము, ఆంగ్లంలో ఇచ్చిన ఎక్స్‌ట్రాక్ట్- ఇలా అన్నీ ఇవ్వటం వ్యాఖ్యాత యొక్క విషయ పరిజ్ఞానానికి నిదర్శనం. గ్రంథం చివరలో అకారాది క్రమంలో నామాలు, పుట సంఖ్య, అలాగే స్తోత్రం, విడిగా నామాలు ఇవ్వటం పాఠకులకు ఎంతో ఉపయోగిస్తుంది. ఇటువంటి అద్భుతమైన వ్యాఖ్యాన గ్రంథాన్ని సరళంగా తెలుగులో అందించి ఇచ్చిన వ్యాఖ్యాత పాండిత్యాన్ని విషయ కౌశీలతను, విషయ పరిజ్ఞానాన్ని- అంతటికీ మించి శ్రీ వేంకటేశ్వరుని సేవలను మరి యొకసారి అభినందిస్తున్నాను. ప్రతి ఆస్తికుడు పఠించి తెలుసుకొనవలసిన గ్రంథమిది.

-నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. స్థిరాస్తుల విషయంలో మిక్కిలి జాగ్రత్త అవసరం. పక్కదోవ పట్టించేవారి మాటలు వినరాదు. క్రీడాకారులకు, రాజకీయ రంగాల్లోనివారికి మానసికాందోళన తప్పదు. నూతన కార్యాలు వాయిదా వేసుకోవడం మంచిది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
అనవసరమైన భయాందోళనలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
నూతన వస్తు, వస్త్ర ఆభరణాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. విద్యార్థుల ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వినోదాల్లో పాల్గొంటారు. చర్చలు, సదస్సులు మిమ్మల్ని ఆకర్షిస్తాయి. మనోధైర్యాన్ని కలిగియుంటారు. శుభవార్తలు వింటారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృథా ప్రయాణాలు చేస్తారు. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
అనుకోకుండా కుటుంబంలో కలహాలేర్పడే అవకాశముంటుంది. అశుభవార్తలు వినాల్సి వస్తుంది. ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
కుటుంబమంతా సంతోషంగా నుంటారు. గతంలో వాయిదావేసిన పనులన్నీ పూర్తిచేసుకుంటారు. సంపూర్ణ ఆరోగ్యమేర్పడుతుంది. స్థిర నివాసముంటుంది. వ్యవసాయ మూలకంగా లాభాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ ఫలిస్తాయి. సూక్ష్మ విషయాలను గ్రహిస్తారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
సంతోషంగా కాలం గడుపుతారు. శుభవార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుందురు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవకాశం వుంది. ఆర్థికంగా బలపడతారు. స్త్రీలు మనోల్లాసాన్ని పొందెదరు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు. అనవసర వ్యయ ప్రయాసలవల్ల ఆందోళన చెందుతారు. వృథా ప్రయాణాలెక్కువగా ఉంటాయి. స్త్రీల మూలకంగా ధనలాభముంటుంది.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సి వస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. అనవసరంగా డబ్బు ఖర్చగుటచే ఆందోళన చెందుదురు. విదేశీయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించక తప్పదు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం వుంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా నుండుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో సహనం వహించక తప్పదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
నూతన వస్తు, వస్త్ర, వాహన ఆభరణ లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభ కార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తి అవుతుంది.

హితవాక్యం

అనంత శాస్త్రం బహు వేదితవ్యం
అల్పశ్చ కాలో బహవశ్చ విఘ్నాః
యత్సారభూతం తదుపాసితవ్యం
హంసో యథా క్షీ రమివాంబుమిశ్రమ్

అది విష్ణుశర్మ మూటగట్టిన వరహాల మూట...

అనగనగా దక్షిణాదిన ఒక జనపదం ఉండేది. దాని పేరు మహిలారోప్యం. దానికి 'అమరశక్తి' రాజు. ఆయనకు ముగ్గురు కొడుకులు. వారు వెంపలి చెట్టుకు నిచ్చెన వేసేటంతటి పరమ మూర్ఖులు. కాని కాలం ఆగదు కదా! వారికి యుక్త వయస్సు వచ్చింది. ''విద్యాగంధం లేని తన కుమారులు తన తర్వాత వారసులెలా కాగలరు?'' అని రాజుకొక సమస్య అయింది. వివేకహీనులైౖ తన పుత్రులను తలచుకొని తలచుకొని వ్యథాభరిత హృదయంతో అమరశక్తి తనకు ఆప్తుడైన మంత్రి 'సుమతి'ని ఒక ఉపాయం చెప్పమని అడిగాడు. అప్పుడు సుమతి సకల శాస్త్రపారంగతుడైన విష్ణుశర్మ ఒక్కడే రాజకుమారుల్ని వివేకవంతులుగా తీర్చిదిద్దగలడని తెలిపారు. ఆ అభ్యాసానికి సులువైన మార్గాన్ని కూడా యిలా సూచించాడు.''ఏ శాస్త్రమైనా అనంతమైనది. లోకంలో తెలుసుకొనవలసినది చాలా ఉంది. కాని మనకున్న కాలం అంటే వయస్సు చాలా తక్కువ. అందునా అనేక విఘ్నాలు. కాబట్టి నీటితో కూడిన పాలను గ్రహించు హంసలాగా శాస్త్రాల సారాన్ని మాత్రం గ్రహించాలి. వివేకవంతుడు కావాలి''. ఈ మార్గంలోనే విష్ణుశర్మ సకల శాస్త్రాల సారాన్ని కథల రూపంలో రాజకుమారులకు అందించాడు.ఆ 'పంచతంత్ర' కథలే ప్రపంచ సారస్వతాకాశంలో విమలతారకలై వెలుగుల్ని వెలారుస్తున్నాయి.

-వ్యాఖ్యాత: డి.ఎన్.దీక్షిత్

భారతీయమార్గము మాసపత్రిక (1987 జనవరి) నందు ప్రచురితమైన హితవాక్యాలు - వ్యాఖ్యాత - డి.ఎన్.దీక్షిత్ ప్రచురణ - శ్రీ శంకర సేవాసమితి (రిజి), శ్యామలానగర్, గుంటూరు - 522 066.

శ్రీకాళహస్తీశ్వరా!

- **నిను సేవింపగ నాపదల్పొడమనీ, నిత్యోత్సవం బబ్బనీ**
  జనమాత్రుండననీ, మహాత్ముడననీ, సంసార మోహంబుపై
  కొననీ, జ్ఞానము గల్గనీ, గ్రహగతుల్ కుందింపనీ, మేలు వ
  చ్చిన రానీ, యవి నాకు భూషణములే శ్రీకాళహస్తీశ్వరా!

భావం: *ఈశ్వరా!* నేను నిన్ను సేవిస్తుండగా, నాకు కష్టాలు రానీ, సుఖాలు రానీ, నన్ను లోకము సామాన్యుడననీ, గొప్పవాడననీ, సంసార వ్యామోహము కలుగనీ, జ్ఞానమే కలుగనీ, గ్రహచారము నన్ను క్రుంగదీయనీ లేక మంచి చేయనీ, అవి అన్నీ నాకు ఆభరణములు వంటివే అవుతాయి. నీ పాదసేవ చేస్తున్న నాకు నీ అనుగ్రహములుగానే కనిపిస్తాయి.

- **ఏ వేదంబు పఠించె లూత? భుజగం బే శాస్త్రముల్సాచెఁ దా**
  నే విద్యాభ్యసనం బొనర్చెఁగరి; చెం చే మంత్ర మూహించె? బో
  ధా విర్భావ నిదానముల్ చదువులయ్యా? కావు; నీ పాదసం
  సేవాసక్తియె కాక జంతు తతికిన్ శ్రీ కాళహస్తీశ్వరా!

భావం: ప్రాణికోటికి మోక్షము కలుగుటకు నీ పాదాలు సేవించు భక్తి ఒక్కటే కారణంగానీ, చదువులెన్ని చదివినా జ్ఞానమును, మోక్షమును కలిగించునా? ఎంతమంది చదివినవారు లేరు? వారందరికీ జ్ఞానము కలిగిందా? మోక్షము కలిగిందా? నీ దయతో మోక్షము పొందిన సాలెపురుగు ఏ వేదము చదివింది? పాము ఏ శాస్త్రములు పఠించినది? ఏనుగు ఏ విద్యలు నేర్చుకొంది? ఎరుకలవాడు ఏ మంత్రజపము చేశాడు. ముక్తి పొందటానికి చదువులే కారణమైనవా?

- **కాయల్గాచె వధూ నఖాగ్రములచేఁ గాయంబు, వక్షోజముల్**
  రాయన్రాపడె ఱొమ్ము, మన్మథ విహారక్లేశ విభ్రాంతిచే,
  ప్రాయంబాయెను, బట్టగట్టెఁదల, చెప్పన్ రోత సంసారమేఁ
  జేయంజాల విరక్తుఁ జేయఁగదవే శ్రీకాళహస్తీశ్వరా!

భావం: *ఈశ్వరా!* స్త్రీల గోళ్ళగాట్లతో నా శరీరము కాయలు కాచింది. వారి స్తనముల రాపిడితో నా రొమ్మురాయిలా గట్టిపడిపోయింది. మన్మథ క్రీడల మీద వ్యామోహంలో పడి వయసు గడిచిపోయింది. తల బట్టతలై వెంట్రుకలు రాలిపోయినవి. ఇలా చెప్పుకొంటూ పోతే చాలా ఉన్నాయి. ఇపుడు ఈ సంసారం అంటే అసహ్యం కలుగుతుంది. ఇక నాకు పరిపూర్ణ వైరాగ్యము కలిగించి భవబంధ విముక్తున్ని చేయి.

- **నిన్నే రూపముగా భజింతు మదిలో, నీ రూపు మోకాలో? స్త్రీ**
  చన్నో? కుంచమొ? మేక పెంటికయొ? యీ సందేహముల్మాన్పి, నా
  కన్నుల్గవదీయమూర్తి సగుణాకారంబుగాఁ జూపవే
  చిన్నీ రేజ విహారమత్త మధుపా! శ్రీకాళహస్తీశ్వరా!

భావం: *ఈశ్వరా!* మోకాలో, స్త్రీ స్తన్యమో, కుంచమో, మేకపెంటియో నీ రూపము ఏదని నమ్మి భావించి సేవింతును? నా యీ అనుమానాలన్నీ పోగొట్టి నీ సుగుణమూర్తిని నాకు చూపించి ధన్యుడిని చేయుము.

కాలకవృక్షీయోపాఖ్యానము

మహాభారతంలో ఉపాఖ్యానాలు 90



డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

ఆ కాలమహిమ వల్లనే వరదల్లో వస్తువులు నదిలో కొట్టుకొని పోయినట్లుగా కాలప్రవాహంలో అన్నీ కొట్టుకుపోతాయి. నా రాజ్యం కూడా అలాగే పోయింది. ఆ ఫలాన్ని అనుభవిస్తున్నాను. కనుక దొరికిన దానితోనే జీవిస్తాను''.

రాజు చెప్పినది విని ముని ఇలా అన్నాడు ''యదార్థం జ్ఞానం యందు స్థిరత్వం కలిగితే జరిగిపోయిన దాని గురించి కాని, జరుగబోయే దానిగురించి కాని విచారించనక్కరలేదు. కనుక నీవు పొందదగిన వస్తువులను పొందు. పొందలేని వాటి గురించి దుఃఖించకు. దైవకృప వలన దొరికిన రాజ్యాన్ని పొంది ఎలా ఉన్నావో, రాజ్యం పోయినప్పుడు కూడా అలాగే ఉండు. అప్పుడు నిర్భాగ్యం వలన దైవాన్ని నిందించకూడదు. నీ దగ్గర ధనం లేకున్నా ఇతరుల దగ్గర ఉన్న ధనాన్ని చూసి ఈర్ష్యపడకు. ఎందుకంటే సంపద ఏ రూపంలో ఉన్నా ఎప్పుడో ఒకప్పుడు దాన్ని విడిచిపెట్టాలి. ధర్మపరులు యోగధర్మవర్తనులు కూడా పుత్రులు పౌత్రులను, సంపదను విడిచిపెట్టిపోతున్నారు. ఎంతో శ్రమపడితే లభించే ఈ ధనం చాలా చంచలమైనది. నీవు ప్రాజ్ఞుడవు అయినప్పటికీ కోరకూడనివి కోరుతూ అస్థిరమైనవాటి కోసం తపిస్తున్నావు. కాని అర్థాలన్నీ అనర్థాలే కనుక నీవే వాటిని పరిత్యజించు''.

ధనం యొక్క అనిత్యత్వాన్ని తెలుసుకున్న ఎవరూ ధనాన్ని కోరుకోరు. పుణ్యాత్ముల వంశంలో పుట్టిన వారు అందుకే పరలోక సుఖాలను కోరుకొని దానికోసం ఇహలోక వ్యవహారాలలో విరక్తులుగా ఉంటారు. ధనాన్ని పురుషుడు విడిచిపెట్టకపోతే ఆ ధనమే అతన్ని విడిచిపెడ్తుంది. నీలాగే ఇతరులు నీ మిత్రులనూ, ధనాన్నీ పోగొట్టుకుంటారు. వారి కష్టం కూడా నీకష్టం లాంటిదే. కనుక మనస్సును నియంత్రించు. బ్రహ్మచర్యాన్ని పాటించు. సర్వభూతాల యందు దయకలిగి ఉండు.

ఓ రాజా! నీకు ప్రస్తుతం రాజ్యం లేదు. మంత్రులు లేరు. నీకుప్రస్తుతం దైవం అనుకూలంగా లేదు. నీలో ఏమాత్రమైనా పౌరుషముంటే నేను చెప్పే నీతిని గుర్తుంచుకో. నేను చెప్పినట్లు చేస్తే నీవు మరల రాజ్యాన్ని, సంపదను పొందగలవు. నీకు ఇష్టమైతే చెప్తాను''.

ముని చెప్పిన మాటలను ఎంతో భక్తి శ్రద్ధలతో విన్న రాజు ఇలా అన్నాడు. ''మహాత్మా! తమరు ఉపదేశించండి. నేను తప్పక ఆచరిస్తాను''.

అపుడు ముని ఇలా చెప్పాడు ''గర్వాన్ని, హర్ష భయాలను, క్రోధాన్ని విడిచిపెట్టి శత్రువును కూడా సేవించు. విదేహరాజు సత్యప్రతిజ్ఞుడు. మంచి కర్మల ద్వారా అతనికి విశ్వాసం కలిగించు. అతను నీకు ధన సహాయం చేస్తాడు. అప్పుడు నీవు అందరికీ విశ్వాసపాత్రుడివి, రాజుకి కుడిభుజానివి అవుతావు. అప్పుడు నీకు మంచి గుణములున్న ఉత్సాహవంతుల సహాయం లభిస్తుంది. శాస్త్రప్రకారం నడుచుకొనేవాడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు తన్ను తాను ఉద్ధరించుకుంటాడు. ప్రజలను ఉద్ధరిస్తాడు. ధైర్యవంతుడు, సంపన్నుడు అయిన జనకమహారాజు తప్పక నిన్ను ఆదుకుంటాడు. తర్వాత నీవు మిత్రుల సైన్యాన్ని సమకూర్చుకొని, మంచి మిత్రులతో చేరి మంత్రాంగం చేసి, ఆంతరంగికుల ద్వారా శత్రువులలో విభేదాలను సృష్టించి శత్రువుల సహాయంతోనే శత్రువులను నాశనం చేయించు.

ప్రాజ్ఞుల విశ్వాసాన్ని పొంది శత్రువుల రాజ్యం లేకుండా హాయిగా ఉండు. కాని నిరంతరం జాగరూకుడవై విదేహరాజు పట్ల మిత్రధర్మాన్ని నిర్వర్తించు. బలవంతులైనవారితో శత్రువులకు విరోధం కలిగించు. శయనాలు, భోగాలు మొదలైన సుఖాలతో శత్రువు యొక్క కోశాగారం నిండుకొనేలా చేయి. ఉత్తమ వేదపండితుల గురించి విదేహరాజు దగ్గర ప్రశంసించి అతని చేత వారికి యజ్ఞదానాలు ఇప్పించు. వారు నీకు ఉపకారం చేస్తారు. విదేహరాజుని వారు పీక్కుతింటారు. ఆ పుణ్యశీలి పరమగతిని పొందుతాడు. ఏ కార్యం అందైనా మునిగి పోయిన రాజుయొక్క కోశాగారం వట్టిపోతుంది. రాజ్యం శత్రువుల వశమౌతుంది. పంటలు మొదలైనవి నాశనం చేయించాలి. అది దైవ ఘటనగా రాజు వద్ద చెప్పాలి. అతనిచేత విశ్వజిత్ యాగం చేయిస్తే అతను నిర్ధనుడు అవుతాడు. దానితో నీ పని సిద్ధిస్తుంది. యోగధర్మాలు తెలసినవారి గురించి ఆ శతృరాజు దగ్గర ప్రశంసించు. దానితో అతనికి రాజ్యాన్ని త్యజించాలనే కోరిక కలుగుతుంది. అలా కలగక పోతే నీ మనుష్యుల ద్వారా సిద్ధౌషధ ప్రయోగం ద్వారా అతని ఏనుగులను, గుర్రాలను, మనుషులను చంపించు. ఇలాంటి పనుల వల్ల శత్రువు బలహీనుడౌతాడు. రాజ్యం నీ చేతికి వస్తుంది''.



ముని మాటలు విన్న రాజు ఇలా అన్నాడు. ''బ్రహ్మజ్ఞుడా! నేను మోసంతో కాని, దంభంతో కాని జీవించాలని అనుకోవడం లేదు. అలాగే అధర్మ మార్గంలో సంపాదించే సంపాదన కూడా నాకు అక్కరలేదు. నేను ధర్మాన్ని ఆశ్రయించి బ్రతకాలని కోరుకుంటున్నాను. కనుక ఈ పని చేయలేను. ఇలాంటి సలహా ఇవ్వడం మీకూ తగదు''.

అతని మాటలు విన్న మహర్షి ఇలా జవాబు చెప్పాడు. ''రాజా! నీ గుణాలు, నీ మాటలకు అనుగుణంగానే ఉన్నాయి. నీకూ, విదేహరాజుకీ ప్రయోజనం కలిగేలా ప్రయత్నిస్తాను. నీవు ఉత్తమ కులంలో జన్మించావు. సకల శాస్త్రాలు చదివావు. నిన్ను ఎవరు ఆమాత్యునిగా నియమించరు? విదేహరాజు నా ఆశ్రమానికి వస్తాడు. అప్పుడు అతనిని ఆజ్ఞాపిస్తాను. అతను తప్పక చేస్తాడు''.

తర్వాత ముని విదేహ రాజుని పిలిపించి క్షేమదర్శిని చూపించి ఇలా అన్నాడు. ''ఇతను రాజవంశంలో పుట్టినవాడు. ఇతని గురించి నాకు అంతా తెలుసు. నీవు నన్ను ఎలా నమ్ముతావో అదేవిధంగా ఇతన్నీ నమ్మవచ్చు. ఇతన్ని అమాత్యుని చేసికో. ఇతనికి పరాక్రమం, బుద్ధికుశలత రెండూ ఉన్నాయి. రాజ్యప్రయోజనం కోసం ఇవి చాలా ముఖ్యం.

ధర్మాత్ములైన రాజులకు ఇటువంటి అమాత్యులు చాలా అవసరం. తండ్రి తాతల నుండి సంక్రమించిన రాజ్యాన్ని పొందాలన్న కోరికతో అతను నీతో యుద్ధం చేసినా అది క్షత్రియ ధర్మమే అవుతుంది. నీకు కూడా జయించాలనే కోర్కెతో యుద్ధం చేస్తావు. కనుక నా ఆదేశాన్ని పాటించి యుద్ధం చేయకుండానే అతన్ని వశపర్చుకో. లోభాన్ని వదలి ధర్మాన్ని ఆచరించు. అందరికీ ఎప్పుడూ విజయమే లభించదు. ఒక్కోసారి అపజయం కూడా కలుగుతుంది. శత్రువుల సంపదను ఇన్న రోజులు నీవు అనుభవించినట్లుగా నీ సంపదను వారు కూడా అనుభవించాలి. ఇతరుల సంపదలను నిర్మూలిస్తే దాని వలన పాపం కలుగుతుంది''.

మహర్షి మాటలు విన్న విదేహరాజు అతని ఆదేశాన్ని పాటించి ఇలా అన్నాడు. ''మహర్షీ! మీరు ప్రాజ్ఞులు, తాపసులు, మహాపండితులు, మా శ్రేయోభిలాషులు. మీరు చెప్పిన విధంగానే చేస్తాను. అదే నాకు పరమశ్రేయస్సు. ఇక నేను ఏమీ ఆలోచించను''.

ఇంకావుంది...

సుందరకాండ


- కాశీభొట్ల సత్యనారాయణ

బాహ్యదృష్టితో చూస్తే శబ్దాడంబరాది అలంకారాలు కనబడతాయి. ఇది సుందరకాండలో ఎక్కువ. ఈ లక్షణం రావణ ప్రకృతిని లంకా బాహ్య సౌందర్యాన్ని కవి స్థూలంగా చూసెట్టే విధానమని మనం భావించుకోవాలి.

ఆ వెన్నెట్లో స్వామి పిల్లిమొగ్గలు వేస్తూన్నట్లే ఈ వర్ణన బాహ్య స్వరూపం కూడా కనబడుతుంది. ఇక్కడినుండి పురస్థలయిన స్త్రీలను చూస్తూ బయలుదేరేడు.

అయితే వారెలా ఉన్నారు.

భర్తలతో కలిసి మాదకద్రవ్యాల్ని సేవిస్తూన్న వాళ్లు, సంగీత సాధనలు చేస్తూన్నవాళ్లు, అధిక్షేపించుకొంటూన్నవాళ్ళు, మాటా మాటా వచ్చి విరహాన్ని అనుభవిస్తున్నవాళ్ళూ-తిరిగి కలుస్తూన్న వాళ్ళు-ఇటువంటి వారి ముఖాలను చూస్తూ వారి ఆభరణాల్నిచూస్తూ స్వామి ముందుకు వెళుతున్నాడు.



ఆ తల్లి సీతాముఖ లక్షణాల్ని తానెరుగును. ఆ తల్లి ఆభరణాలు తనకు పరిచయమున్నాయి. ఆ రెండూ కాని మూడవ గుర్తు తన వద్ద లేదు. ఈరెండూ కాని మూడవ విషయం స్త్రీ విషయంలో తనకు లేదు.

కనుక స్వామి కనబడిన స్త్రీ ముఖాన్ని చూస్తున్నాడు. ఆభరణాల్ని చూస్తున్నాడు. కాని రామపత్ని తనకు కనబటంలేదు. ఎటువంటి రామపత్నిని తాను చూడాలి.

ఉష్ణార్దితాం సాను స్రుతార్ద్ర కంఠీం
పురావరార్సోత్తమ నిష్కంఠీం
సుజాత పక్ష్మామభిరక్త కంఠీం
వనే ప్రవృత్తామివ నీల కంఠీమ్
అవ్యక్త రేఖామివ చన్ద్ర రేఖాం
పాంశుప్రదిగ్ధామివ హేమరేఖాం
క్షతప్రరూఢా మివ బాణ రేఖాం
వాయుప్రభిన్నామివ మేఖ రేఖామ్

ఇటువంటి రామపత్నిని తాను చూడాలట.

వెచ్చని కన్నీటితో తడుపబడుతూన్న కంఠం కలది.

కంఠం నుండి వక్షస్థలం వరకు ఉత్తమమైన హారం కలది.చక్కని కనుబొమలు స్నిగ్ధమైన కంఠమూ కలది.

అడవిలో నటించే నెమలి వంటిది.

కనబడీ కనబడనట్టి చంద్రరేఖ వంటిది.

బురదలో దిగబడ్డ బంగారు కణికి వంటిది.

గాయాన్ని నరేపిన బాంవు గుర్తుగలది.

గాలిరేపని మేఘరేఖ వంటిది-ఇటువంటి రామపత్నిని తాను చూడాలట-ఇదీ కోరిక- ఇదొక విచిత్రమైన కోరిక.

ఆంజనేయస్వామి సీతా స్వరూపాన్ని సుందరకాండలో మూడు స్థాయిలో ధ్యానిస్తాడు. మొదట సగుణ స్వరూపంగా ఆ తరువాత సగుణ నిర్గుణ స్వరూపంగా ఆపై నిర్గుణ స్వరూపంగా దర్శిస్తాడు. వానిలో మొదటి స్థితి ఇది.

ఇపుడు స్వామి ధ్యాన స్థితి యొక్క ఆంతర్యాన్నిగమనిస్తే, కనిపించీకనిపించని చంద్రరేఖ శుక్ల విదియనాటిది. ఇది చూడాలనిప్రయత్నిస్తే కనబడుతుంది. తనంతట తనా కనబడదు.అలాగే ఆతల్లిని ఉపాసిస్తే కనబడుతుంది.కనుక ఉపాసకులకు మాత్రమే కనబడేదని భావం.

బురద అంటిన హేమరేఖ. హేమమంటే తేజస్సు. పరబ్రహ్మ స్వరూపిణి అయి నిర్గుణ నిరాకార స్థితియందున్న ఆమెకు సృష్టి లక్షణం సంసార స్థితి వస్తుంది.అది బురద. అది బంగారు కణికకు అంటినట్లుంటుంది. అంటదు. అట్టిలక్షణమున్న తల్లిని చూడాలని స్వామి కోరిక.

గాయాన్ని రేపిన బాణపు గుర్తు.ఆమె వీరారాధ్య.


వీరులంటేవేదాంతులు. శోక తాపాలు రాగద్వేషాలు లేనివారు.

అట్టివారికి మాత్రమేఆరాధ్య.

గాలి రేపిన మేఘ పంక్తి అంటే ప్రాణాయామాదుల చేత మాత్రమే చిక్కేది. అనగా యోగ లభ్య. అట్టి తల్లిని చూడాలి.

ఇంకావుంది...

పరమహంస బోధామృతము



36.మూడు బొమ్మలున్నవి- ఒకటి ఉప్పుతో జేసినది, రెండవది గుడ్డతో జేసినది, మూడవది రాతితో జేసినది, ఈ బొమ్మలను నీటిలో ముంచినయెడల మొదటిది కరిగిపోయి రూపనాశనము నొందును;రెండవది చాలనీటిని పీల్చుకొనును, కాని ఆకృతి పోగొట్టుకొనదు;మూడవది నీటడిని తనలో చొరనీయదు. ఆత్మను పరమాత్మలో లయించి ఐక్యమొందిన జీవుడే ఇందు మొదటి బొమ్మ. బ్రహ్మజ్ఞానానందమయుడగుభక్తుడే ఇందలి రెండవ బొమ్మ. తనహృదయమున తత్త్వజ్ఞానమునకు అణుమాత్రమైన అవకాశమీయని శుద్ధ లౌకికుడు ఇందలి మూడవ బొమ్మ.

37.మానవులు తలగడదిండ్ల గలేములవంటివారు.ఒక గలేబు ఎర్రగా నుండవచ్చును. మరియొకటి నీలముగా నుండవచ్చును, వేరొకటి నల్లగా నుండవచ్చును; కాని అన్నింటిలో నుండునది దూదియే కదా! మానవుల విషయము కూడా నిట్టిదే. ఒకడు చక్కనివాడు, మరియొకడునల్లనివాడు, ఇంకొకడు పావనుడు, వేరొకడు పాపాత్ముడు. ఐనను అందరియందును ఒకే పరమాత్ముడు నెలకొని యున్నాడు.

38.మోదకములపై పూత వరిపిండియే, కాని లోపలి పూర్ణము పలు విధములుగా నుండును. మోదకముల బాగోగులు అందలి పూర్ణము ననుసరించి యుండును. అటులనే నరులందరిశరీరము పంచభూతములచేతనే నిర్మాణమై యున్నను చిత్తశుద్ధిని బట్టి వారు వేర్వేరు గుణములు గలవారుగా నుందురు.

39.బ్రాహ్మణ కుమారుడు జన్మముచే బ్రాహ్మణుడే. కాని యిట్లు బ్రాహ్మణులై పుటిటనవారిలో గొందరు పండితులగుచున్నారు. కొందరు పురోహితులగుచున్నారు. మరికొందరు వంట బ్రాహ్మణులగుచున్నారు. ఇంక గొందరు భోగకాంతల యింటి ముంగిట ధూళిలో బడి పొరలాడుచున్నారు.

40.పులిలో సైతము దేవుడు ఉండుట నిజమే, కాని అందుచే మనము ఆ జంతువునకెదురుగా బోయి నిలువవచ్చునా? పరమ దుర్మార్గులందును భగవంతుడుండుట నిజమేయైనను మనము వారి సహవాసము చేయుట పాడిగాదు.

41.నీరు అంతయు నారాయణస్వరూపమే. కాని అన్నిరకముల నీళ్లను త్రాగుటకు నికిరావు. అటులనే భగవంతుడు సర్వాంతర్యామియై యుంట నిజమే. అయినను సర్వప్రదేశములును మనము దర్శింపదగినవి కావు. ఒకరకము నీరు కాళ్ళు కడుగుకొనుటకు మాత్రము ఉపయోగించును. వేరొక రీతి నీరు స్నానమును పనికివచ్చును, మరొక రీతి నీరు త్రాగుటకు వినియోగించును. కొన్ని రకముల నీరు తాకుటకుకూడా పనికిరాకుండును. అట్లే స్థలములను బహువిధములుగానున్నవి. కొన్నిటి సమీపమునకు బోదగును. కొన్నిటిని దర్శింపనగును; కొన్నిటిని దూరమునుండియే 'సలాము చేసి' పోదగినవిగా నున్నవి.

42.ఈ దిగువ చెప్పబడినవారి విషయమున మెలకువ గలిగి వర్తింపుడు. 1.హద్దుపద్దు లేకుండా సదా వాగుచుండువాడు 2.కపట హృదయుడు 3.చెవులకు తులసిదళమును తగిలించుకొని తన భక్తి నెల్లరకును బ్రదర్శించువాడు. 4.పెద్ద మేలిము సుగు వేసికొను స్త్రీ, 5.మిగుల ననారోగ్యకరమగు పాచితో నిండియున్న మఱుగుగుంటలోని చల్లని నీరు.

మరణము :పునర్జన్మము

43.బద్ధజీవులు అవసానకాలమున గూడా సంసారపు గొడవలను గూర్చియే మాటలాడుదురు. నరుడు తీర్థయాత్రలు చేసియుండుగాక, గంగాస్నానము గావించియుండుగాక, తావళము బూని జపించి యుండుగాక, హృదయమున రాగ ద్వేషములున్నంతవరకు మరణకాలమున అవి వెలువడక మానవు. ఆ సమయమున సంధిలో లౌకిక ప్రలాపములనే సాగింతురు (బద్ధజీవులు). (పెంపుడు) చిలుక సాధారణమగు రాధాకృష్ణనామమును గానము చేయవచ్చును; కాని పిల్లి నోట చిక్కినప్పుడు కీచుకీచుమనుచు స్వాభావికవు గూతతోడనే ఏడ్చునుగదా!

44.దైవభక్తి లేకపోవుటయే మానవుని అపరిమిత బాధలన్నింటికిని కారణము. కావున నరుడు అవసాన కాలమున నారాయణ స్మరణకు తోడ్పడునట్టి సాధన చేయవలయును.

ఇంకావుంది...

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ
తెలుగు అనువాదం: డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

185

వ్యాధిస్త్యాన సంశయ ప్రమాదాలస్యావిరతి భ్రాంతి దర్శనాలబ్ధ భూమికత్వా నవస్థితత్వాని చిత్త విక్షేపాస్తే న్తరాయాః. అన్న సూత్రానుసారం వ్యాధి, స్త్యాన= భారకత్వం, సందేహం అజాగ్రత్త, సోమరితనం, అవిరతి= యోగసాధనాల ఆచరణలో అనాసక్తి, భ్రాంతికారక వస్తు దర్శనం, చిత్త చాంచల్యం, యోగ భూమికను పొందకపోవడం, ఇవన్ని యోగసిద్ధికి విఘ్నకారకాలు. వీనిలో ముఖ్యమైన సంశయమనే దానిలో చిక్కుకొని భగవదారాధననే విడిచేందుకు సిద్ధపడిన సంశయగ్రస్తు హృదయంలో ఉన్న పరమాత్మ దయాళువై ఇలా ప్రబోధిస్తున్నాడు. 'అయమస్మి జరితః'=''ఓ భక్తుడా! నేనిక్కడే ఉన్నాను''కాని నీవు నాకోసం వెతుకుతున్నావు. నాకోసం అటుఇటు పరుగుపెట్టకు. పశ్య మేహ=''నువ్విక్కడే చూడు. మరెక్కడకు వెళ్లవలసిన పని లేదు. నీలో అంతర్యామిగా ఉన్న ఆత్మను నేనే''. విశ్వాజాతా న్యభ్యస్మి మహ్నా= ''నా మహత్వ శక్తితో ఈ సమస్త విశ్వాన్ని నా నియంత్రణ (అదుపు)లో ఉంచుకొన్నాను'' సమస్తజగత్తు నా ఆజ్ఞానుసారమే నడుచుకొంటున్నది. ఇష్టపడితే నీవు నా పూజ చేయి. లేకుంటే మాను. ఋతస్య మా ప్రదిశో వర్ధయంతి= ఋతాన్ని అంటే అనుల్లంఘనీయమైన సృష్టినియమాలను- శాసనాలను జ్ఞానులు నన్ను సమున్నతంగా ఆరాధిస్తున్నారు.

మూర్ఖ శిరోమణులు భగవానుని స్మరణ, ధ్యానాలను చేయరు. కాని కార్య కారణవేత్తలైన ఋత ప్రచారకులు కారణం లేకుండా కార్యం పుట్టదు. కారణానికి ఆలంబనుడయిన కర్తలేకపోతే కార్యమెలా సంభవమవుతుంది. చిన్న పదార్థమైనా చైతన్యరహితమై ఉండనప్పుడు ఈ అఖండ విశ్వం చైతన్యరహితంగా ఎలా జనిస్తుంది అని గ్రహించినవారై భగవానుడనైన నన్నారాధిస్తూ 'ప్ర వ ఇంద్రాయ బృహతే మరుతో బ్రహ్మార్చత' నీవు మహేంద్రుణ్ణి వేదోక్తంగా ఆరాధించు''మని ఇతరులకు ప్రబోధిస్తూ ఉంటారు. భగవచ్ఛక్తి అనుమాన ప్రమాణం చేత గ్రహించుకోవాలే గాని ప్రత్యక్షమై ఉండదు. కాని ఆయన వినాశనశక్తిని చూడగానే అందరు ఆయన ఎడల భక్తితత్పరులైపోతారు. అట్టి తన ప్రళయకార శక్తిని వివరిస్తూ 'ఆ దర్దిరో భువనా దర్దరీమి'= ''నేను ప్రళయకారుడనై లోకాలను పలు మారులు వినాశనం చేస్తున్నా''నని ప్రకటించాడు. చిత్రమేమంటే ఆయన సంహారశక్తికి భయపడి దగ్గరకు వచ్చి ఆశ్రితుడైన వానికి రక్షకునిగా దర్శనమిస్తాడు. లౌకికంగా సంహారకుడైన క్రూరుడైనవానికి సంహారక శక్తిసంపన్నుడైన భగవంతునకు ఏమీ పోలిక లేదు. నదులు ఉప్పొంగి గ్రామాలను ముంచి నాశనం చేసినట్లు, కార్చిచ్చు అడవులనేకాక జనులనుకూడ దహింపజేసినట్లుగా పరమేశ్వర సంహారకశక్తి సృష్టినాశనాన్నిగాక పునఃసృష్టికారకమవుతుంది. కాబట్టి జనులకు దైవసంహారక శక్తి కూడ ప్రియాతిప్రియమే అవుతుంది. అందుకే సృష్టి నిర్మాణంలో సంహారకశక్తి కూడ దైవశక్తిగా ఆరిధింపబడింది.

174. దేవాధిదేవ! నీ నామాన్నే జపిస్తాను

భావం:- ఓ దేవా! నీ మాటలనే నెన్నడు తిరస్కరింపను. నిన్ను నమ్మి జీవిస్తూ ఇతరులకు నిరంతరం శీఘ్రంగా మేలుచేసే జీవనాధారుడవైన నిన్ను గురించి చేసే సన్నుతులను కూడ విడువను. అంతేగాక అపూర్వ కీర్తివంతమైన నీ నామాన్ని సదా స్మరిస్తూ ఉంటాను.

వివరణ:- ఓ మహాదేవా! నీ ఎడల నాకు బహు ప్రీతి ఉంది. ఈ మాటను నేను నిజంగానే చెబుతున్నాను. మాతాపితలు. దారాపుత్రులు, మిత్ర-బాంధవులను మాటలను వినీ వినక పెడచెవిని పెడతాను. కాని నీ మాటలను చెవులార వినే సౌభాగ్యాన్ని నేను చేతులార ఎందుకు వదులుకొంటాను? ఓ పరమాత్మా! నీతో నేనేమని చెప్పను? నీకు తెలియనీయక దేనిని దాచిపెట్టగలను? నీకు సర్వమూ తెలుసు. కాని నేనొక్కమాట చెప్పగలను. అదేమంటే- 'న తే గిరో అపి మృష్యే' ''నీ మాటలనెన్నడు తిరస్కరించను అని. నీ మాటలను ప్రేమిస్తాను. సంపూర్ణంగా గౌరవిస్తాను. నీ మాటలనే చింతిస్తూ అనుసరిస్తూ, ఆ ప్రకారంగా ఆచరిస్తూ, ప్రచారం చేస్తాను. ఓ జగన్నాథా! నీవు సృష్టికార్యాలను అతి శీఘ్రంగా చేసేవాడవు. క్షణకాలంలో సృష్టికి ప్రళయాన్ని కల్పించగలవాడవు జగజ్జీవనమంతా నీపై ఆధారపడి ఉంది. నీ గుణగణాలను లెక్కింప సామర్థ్యమెవరికుంది. అది నాకు మాత్రం సాధ్యమా? అయితే నాకు చేతనయినంతగా నిన్ను సన్నుతిని చేస్తాను నీవే పాలకుడవు. నీవే సృష్టికర్తవు. ఓ దేవాధిదేవా! అజ్ఞానకారణంగానో, అజాగ్రత్త కారణంగానో నీ ఆదేశాన్ని వినకపోవచ్చు. విన్నా సరిగా అర్థం చేసికొనలేకపోవచ్చు. ఎప్పుడైనా నీ సంస్తుతిలో పొరపాటు దొర్లవచ్చు! అదంతా నా అల్పజ్ఞత్వమే. దానివల్ల అనేక కష్టాలు సంభవిస్తాయి. ఇదివరకే నేను దానివల్ల ఎదురుదెబ్బలు కూడ తిన్నాను. నాకు బుద్ధివచ్చింది. నీ మాటలనే విని ఆచరించేందుకు తహతహలాడుతున్నాను. 'సదా తే నామ స్వ యశో వివక్మి' ''కీర్తివంతమైన నీ నామాన్నే జపిస్తాను'' కాని నీ మహిమ నెరుంగని మూఢుడను. 'మనీషీ హవతే త్వామిత్' ''మహాబుద్ధిమంతుడైనవాడు కూడ నిన్నే పిలిచి ప్రార్థిస్తాడు'' ఇక నేనెంత వాడను?

ఇంకావుంది...

ఆంధ్రభూమి

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

గురువారం 3, జనవరి 2019



వెంకీతో.. వినాయక్

నందమూరి బాలకృష్ణ హీరోగా వివి వినాయక్ దర్శకత్వంలో సి కళ్యాణ్ ఓ చిత్రం నిర్మించటానికి గట్టిగా ప్రయత్నం చేస్తోన్న విషయం తెలిసిందే. కాగా తాజా సమాచారం ప్రకారం ఆ సినిమా ఇప్పట్లో సాధ్యంకాదని తెలుస్తోంది. బాలయ్య వినాయక్ ప్రాజెక్ట్‌ని పక్కనపెట్టి, తదుపరి సినిమాని బోయపాటితో ఫిక్సయ్యాడు. దాంతో వినాయక్ మరో హీరోని వెతుక్కోక తప్పలేదు. తాజాగా వినాయక్ కథని వెంకటేష్ ఓకే చేసినట్టు సమాచారం. గతంలో వెంకటేష్‌తో కలిసి 'లక్ష్మి' సినిమాను రూపొందించాడు వినాయక్. అది పెద్ద సక్సెస్ అందుకుంది. మళ్లీ ఇంత కాలానికి ఈ కాంబినేషన్‌లో సినిమా రాబోతుంది. ఈసారి వెంకీకి వినాయక్ ఎలాంటి సక్సెస్ ఇస్తాడో చూడాలి!


చిక్కుల్లో.. 'మన్మోహన్'?

చిత్రం ట్రైలర్ యుట్యూబ్‌లో కనిపించకపోవడం పట్ల ప్రధాన పాత్రధారి అనుపమఖేర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్విటర్‌లో స్పందించిన అనుపమ్‌ఖేర్ 'యాక్సిడెంటర్ ప్రైమ్ మినిస్టర్' అని యూట్యూబ్‌లో టైప్ చేస్తుంటే వీడియో కనిపించడం లేదు. దీనిపై అభిమానుల నుంచి మెసెజ్‌లు, కాల్స్ వస్తున్నాయి. 48 గంటల క్రితం వరకూ ట్రెండింగ్‌లోవున్న ట్రైలర్ ఎలా మాయమవుతుంది? 50వ స్థానం కిందికి ఎలా వెళ్లిపోతుంది? మాయమైన ట్రైలర్ కనిపించేలా సాయం చేయండి' అంటూ అభిమానుల కోసం లింక్‌ను మరోసారి పోస్ట్ చేశారు. ఏదేమైనా ఈ చిత్రం విడుదల వరకూ వివాదాలు చల్లారే అవకాశం కనిపించడం లేదు. కొన్ని రాష్ట్రాల్లో చిత్రంపై బ్యాన్ తప్పదన్న సమాచారం బలంగా వినిపిస్తోంది.



మాజీ ప్రధాని మన్మోహన్ జీవితంలోని రాజకీయ ముఖ్య ఘట్టాలతో తెరకెక్కుతున్న బాలీవుడ్ చిత్రం -ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్. ప్రఖ్యాత నటుడు అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం ట్రైలర్ విడుదలైన దగ్గర్నుంచీ వివాదాలు చెలరేగుతున్నాయి. తీవ్రమవుతున్న పరిస్థితిని చూస్తుంటే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో చిత్రంపై బ్యాన్‌పడే పరిస్థితి లేకపోలేదని తెలుస్తోంది. మన్మోహన్ మీడియా అడ్వైజర్ సంజయ్ బారు రాసిన పుస్తకం ఆధారంగా దర్శకుడు విజయ్ రత్నాకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించడం తెలిసిందే. ట్రైలర్ విడుదల తరువాత -మన్మోహన్ ప్రతిష్టకు మచ్చతెచ్చేలా కథనాన్ని వక్రీకరించారన్న వాదనను కాంగ్రెస్ వినిపించింది. సినిమాను ముందు తమకు చూపించాల్సిందిగా డిమాండ్ చేసంది. అయితే, ప్రత్యేక స్క్రీనింగ్‌కు మన్మోహన్ ఒప్పుకుంటేనే వేస్తామని పాత్రధారి అనుపమ్ స్పష్టం చేయడం తెలిసిందే. ఇదిలావుంటే, పంజాబ్‌లో చిత్రం బ్యాన్‌కు రంగం సిద్ధమైనట్టు సమాచారం. ఇప్పటికే కొన్ని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు దీనిపై ఒక నిర్ణయానికి వచ్చినట్టే కనిపిస్తోంది. జనవరి 11న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్న తరుణంలో, మన్మోహన్ కీర్తిపై బురదచల్లే అంశాలను చిత్రంలో చూపించారన్న అంశంపై చర్చించేందుకు పంజాబ్ కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్ భేటీ నిర్వహించనుంది. చిత్రంలోని ప్రతికూల అంశాలను కేబినెట్‌లో చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం మన్మోహన్ బయోపిక్ బ్యాన్‌కు రంగం సిద్ధం చేయడం తెలిసిందే. కాకపోతే, ఈ విషయంలో ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మాత్రం ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మరోపక్క, ట్రైలర్ విడుదల తరువాత సినిమాను తమకు చూపించి అభ్యంతరాలను సరిచేసిన తరువాతే విడుదల చేయాలంటూ మహారాష్ట్ర యూత్ కాంగ్రెస్, పంజాబ్ కల్చరల్ హెరిటేజ్ బోర్డులు నిర్మాతలకు అల్టిమేటమ్ ఇవ్వడం తెలిసిందే. అయితే సినిమా రగడను కాంగ్రెస్ ఎన్నికల అస్త్రం చేసుకోడానికి ప్రయత్నిస్తుందంటూ బీజేపీ వర్గాలు ప్రతివ్యాఖ్యలు చేయడంతో, కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం చేసుకుంది. అధిష్ఠానం ఓ నిర్ణయం తీసుకునే వరకూ పార్టీశ్రేణులు ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది.

4న భగవాన్



నైన్‌స్టార్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో కెవై శేఖర్ బాబు, టి నిరంజన్‌గౌడ్ సమర్పణలో నూతన దర్శకుడు చందు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భగవాన్'. రాజీవ్, శృతి జంటగా నటించిన చిత్రంలో ఆశిష్ విద్యార్థి ప్రధాన పాత్ర పోషించాడు. మాస్ యాక్షన్‌తో కూడిన చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. జనవరి 4న విడుదల సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యఅతిథి నిర్మాత సాయివెంకట్ మాట్లాడుతూ నిర్మాతలు సినిమా తీయటం మాత్రమే కాదు, విడుదల చేయటం కూడా గొప్ప విషయమన్నారు. నిర్మాతలలో ఒకరు అయిన రాజు సందీప్ మాట్లాడుతూ ఇది మాస్ సినిమా అయినా అన్నివర్గాల ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. హీరో రాజీవ్ మాట్లాడుతూ టాలీవుడ్‌లో నటించే అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నైజాం డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ, సంగకుమార్, సయద్ మహమద్ ఆలీ దంపతులు పాల్గొన్నారు.



కాళీ ఆట.. పేట

24ఏళ్ల తరువాత తెలుగు సంక్రాంతికి వస్తున్నాడు సూపర్ స్టార్ రజనీకాంత్. సమయం దగ్గరపడుతుండటంతో బుధవారం పేట ట్రైలర్ విడుదలైంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో వస్తున్న పేటలో రజనీ తన స్టయిల్‌ను మరింత పదునుగా ప్రదర్శించాడు. హీరోగా వరుస హిట్లతో దూసుకుపోతున్న విజయ్ సేతుపతి విలన్ పాత్ర పోషిస్తుంటే, నవాజుద్దీన్ సిద్దిఖీ, శశికుమార్, త్రిష, సిమ్రన్‌లు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. '20మందిని పంపించాను. అందర్నీ చితక్కొట్టి పంపించాడు' అన్న డైలాగ్‌లో రజనీ స్టామినాను చెబుతూ ట్రైలర్ మొదలైంది. మరింత స్టయిల్‌గా 'కాళీ' పాత్ర పరిచయం, 'వీడు మామూలోడు కాదు మహీ' అన్న డైలాగుకు కౌంటర్‌గా 'హాహాహా.. చూస్తావుగా ఈ కాళీ ఆడించే ఆట' అంటూ రజనీ చెప్పే డైలాగ్, యాక్షన్ ఎపిసోడ్, సిమ్రన్, త్రిషల పరిచయంతో ట్రైలర్ సాగింది. 'చూడ్డానికి చిన్న పిల్లాడిలా చాలా స్టయిల్‌గా ఉన్నారు' అన్న లేడీ డైలాగ్‌కు 'స్టయిల్‌గా ఉన్నానంట.. నాచురల్లీ' అన్న రజనీ స్టయిల్ డైలాగ్ ఆకట్టుకుంది. త్రిష, సిమ్రన్‌తో రొమాంటిక్ సీన్లు, అభిమానులను అలరించేలా స్టెప్పులు, గెటప్పులు, భావోద్వేగ దృశ్యాలను ట్రైలర్‌లో చొప్పించారు.

'ఏయ్ నిజం చెబుతున్నాను. కొట్టి అండర్‌వేర్‌తో పరిగెత్తిస్తాను. పరువుపోతే మళ్లీ తిరిగిరాదు కాస్కో', 'ఎవరికైనా పెళ్లాం పిల్లలు అన్న సెంటిమెంట్, గింటిమెంట్ ఉంటే వెనక్కి తిరిగి చూడకుండా పారిపోండి. మండిపోతోందిక్కడ. దొరికారా భస్మమే' అంటూ రజనీ మేనరిజం డైలాగులు ట్రైలర్‌లో ఆకట్టుకున్నాయి. మనమేం చేయబోతున్నాం అన్న అనుయాయుడి ప్రశ్నకు 'స్వీట్ తినబోతున్నాం' అంటూ రజనీ అల్లరి సమాధానంతో ట్రైలర్‌ను ముగించారు. సంక్రాంతి చిత్రంగా 10న పేట థియేటర్లకు వస్తోంది.

గట్స్‌వున్న ఉన్మాది

కొన్ని చిత్రాలకు కథ కథనాలే కాదు దర్శకత్వం వహించాలంటే గట్స్ ఉండాలని, 'ఉన్మాది' చిత్రాన్ని తెరకెక్కించి ఎన్‌ఆర్ రెడ్డి అలాంటి గట్స్ ప్రదర్శించాడని దర్శకుడు శంకర్ అన్నాడు. ప్రవీణ క్రియేషన్స్ పతాకంపై రెండో చిత్రంగా ఉన్మాదిని తెరకెక్కించారు. స్వీయ దర్శకత్వంలో ఎన్‌ఆర్ రెడ్డి కీలక పాత్ర పోషించిన చిత్రానికి ఎన్ రామారావు నిర్మాత. చిత్రం ఆడియోను రాజ్ కందుకూరి, ట్రైలర్‌ను ఎన్ శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో ఎన్‌ఆర్ రెడ్డి ఎన్‌ఆర్ రెడ్డి మంచి పెర్ఫార్మెన్స్ చూపించారని, హీరోయిజం, విలనిజం పండించగల సామర్థ్యం ఆయనలో కనిపించిందని అంటూ, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ చిన్న సినిమాలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కాన్సెప్ట్‌కు తగిన టైటిల్ ఉన్మాది అంటూ, ఎన్‌ఆర్ రెడ్డి డైరెక్షన్ క్రియేటివిటీ, డేవిడ్ సంగీతం సినిమాకు ప్లస్ అవుతాయన్నారు. నటుడు కృష్ణుడు మాట్లాడుతూ ఆకట్టుకున్న ట్రైలర్‌ను చూసి ఫంక్షన్‌కు వచ్చానని, చిన్న చిత్రాలను ఆదరించాలని కోరారు. సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్న తనను ఆశీర్వదించాలని డేవిడ్, దర్శకుడు ఎన్‌ఆర్ రెడ్డి సహకారంతో మంచి పాత్ర పోషించే అవకాశం లభించిందని, సినిమాను అందరూ సపోర్ట్ చేయాలని హీరోయిన్ శిరీష్ కోరింది. నిర్మాత, దర్శకుడు ఎన్‌ఆర్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ హరికృష్ణకు అభిమానినైన తనపై ఆయన ప్రభావం ఉంటుందని, ఆయనలా ఒక్క సన్నివేశంలో కనిపించినా సక్సెస్ అయినట్టేనన్నారు. ఓ మంచి సినిమాకు దర్శకత్వం వహించేందుకు సహకరించిన ఆర్టిస్టులు, టెక్నీషియన్లకు కృతజ్ఞతలు తెలిపారు. అల్లు రమేష్, శివ, శిరీష, నాగిరెడ్డి, రమ్య, ప్రమీల, పుష్పలత తదితరులు మిగిలిన పాత్రలు పోషిస్తున్న చిత్రానికి దంటు వెంకట్ సినిమాటోగ్రఫీ అందించాడు.



ఫిబ్రవరిలోనే సెట్స్‌పైకి..



టాలెంటెడ్ దర్శకుడు విక్రమ్ కుమార్ దర్శకత్వంలో నాని 24వ చిత్రంలో నటించనున్న విషయం తెలిసిందే. అయితే, ఇంతవరకూ సెట్స్‌మీదకు వెళ్లని సినిమా, రెగ్యులర్ షూటింగ్‌ను ఫిబ్రవరి 19నుండి మొదలుపెట్టే అవకాశం కనిపిస్తోంది. పూర్తి థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో చిత్రాన్ని డిజైన్ చేశారని, మహిళలకు సంబంధించి మంచి సోషల్ మెసేజ్ ఉండే అవకాశముందని అంటున్నారు. చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. సినిమాకి పిసి శ్రీరాం సినిమాటోగ్రాఫర్. త్వరలోనే చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా ప్రకటించనున్నారు.

వజ్రకవచధర.. సప్తగిరి



స్టార్ కమెడియన్‌గా రాణిస్తూనే 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్', 'సప్తగిరి ఎల్‌ఎల్‌బీ' చిత్రాలతో హీరో ట్రాక్ వేసుకున్నాడు సప్తగిరి. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్'ను తెరకెక్కించిన దర్శకుడు అరుణ్‌పవార్ దర్శకత్వంలోనే శివశివమ్ ఫిలింస్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దర్శకుడు అరుణ్‌పవార్ మాట్లాడుతూ 'కథకు కరెక్ట్ టైటిల్ ఇది. ఇందులో సప్తగిరి పాత్ర పేరు గోవిందు. ఇతనొక ఫన్నీ దొంగ. ఇతనికో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం అతనేం చేశాడన్నదే సినిమా ప్రధాన కథాంశం. కడుపుబ్బా నవ్వించే అంశాలతోపాటు, మంచి యాక్షన్, ఎమోషన్, ఇతర వాణిజ్య అంశాలు బాగా కుదిరాయి. సప్తగిరి బాడీ లాంగ్వేజ్‌కి పర్‌ఫెక్ట్‌గా సూటయ్యే కథ ఇది' అన్నారు. నిర్మాతలు నరేంద్ర యెడల, జీవిఎన్ రెడ్డి మాట్లాడుతూ సప్తగిరి ఎక్స్‌ప్రెస్ లాంటి మంచి సినిమా తరువాత సప్తగిరి, అరుణ్‌పవార్ కాంబినేషన్‌లో సినిమా చేసే అవకాశం దక్కడం హ్యాపీగా ఉందన్నారు. ఇదొక హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని, ఇప్పటికే 60 శాతం చిత్రం పూర్తయిందన్నారు. వైభవీ జోషీ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రంలో అర్చనావేద, టెంపర్ వంశీ, అప్పారావుతదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

బికినీ రచ్చ

సామాజిక మాధ్యమాల వేదికగా ఈ యంగ్ బ్యూటీ.. ఫొటోషూట్లు వీడియో షూట్లతో చెలరేగిపోతుంటుంది. 2018లో అదా ట్రీట్ అదరహో అన్న తీరుగా సాగింది. వీనులవిందైన పసందైన ఫొటోలు- వీడియోల జాతరతో సంవత్సరం అంతా అగ్గిరాజేస్తూనే ఉంది. వీలున్న ప్రతి సందర్భాన్ని ఈ అమ్మడు సామాజిక మాధ్యమాల్లో క్యాష్ చేసుకునేందుకు ప్రయత్నించింది. ట్విట్టర్ ఇన్స్టాల్లో అదా గొప్పగా ఫాలోవర్స్‌ని పెంచుకుంది. తాజాగా మరో అదిరిపోయే ట్రీట్‌ని తన ఫాలోవర్స్‌కోసం రెడీ చేసింది. ఇంకా కొత్త సంవత్సరంలో అడుగుపెట్టక ముందే అభిమానులకు మతిచెడే ట్రీట్ ఇచ్చింది అదా. ఈసారి కూడా వేడెక్కించే బికినీ ట్రీట్. అదా అందాల్ని పీక్స్‌లో ఆవిష్కరించింది. ఇలా రెగ్యులర్‌గా ఫొటోషూట్లతో చెలరేగడం సరే! కనీసం 2019లో అయినా ఈ కుర్ర బ్యూటీ బిగ్‌గోల్స్‌ను సెట్ చేసుకుని కెరీర్‌పరంగా ఎదిగేందుకు ఏం చేస్తుందో మాత్రం తేలాల్సి ఉంది. ఇప్పటివరకూ తనకు ఎంతో ఆశావహ అవకాశాల్ని ఇచ్చిన టాలీవుడ్‌లో కొత్త సినిమాకి సంతకం చేసింది లేదు. అటు తమిళం హిందీలో అవకాశాలు ఉన్నాయని చెబుతున్నా ఇంతవరకూ ఏదీ రిలీజ్‌కి రాలేదు. తమిళంలో చార్లీచాప్లిన్ 2 చిత్రంలో నటిస్తోంది. హిందీలో బైపాస్‌రోడ్ అనే సినిమాతో పాటు కమెండో 3 అనే వెబ్ సిరీస్ చేస్తోంది.



ఆకట్టుకుంటున్న నేను లేను



ఓ.యస్.యం.విజన్- దివ్యాశిక క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నేను లేను'. 'లాస్ట్ ఇన్ లవ్' అనేది ఉప శీర్షిక. హర్షిత్ హీరో. ఈ చిత్రం ట్రైలర్ ఇటీవలే విడుదలై వన్ మిలియన్ వ్యూస్‌ను అందుకుంది. ఫిబ్రవరి 1 విడుదలవుతున్న ఈ చిత్రం గురించి దర్శకుడు రామ్‌కుమార్ మాట్లాడుతూ.. ''ఒక అందమైన ప్రేమకథతో తెరకెక్కిన సైకలాజికల్ థ్రిల్లర్ ఇది. ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తిస్తూ రక్తికట్టిస్తుంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కి అనూహ్య స్పందన వచ్చింది. 1 మిలియన్ వ్యూస్‌ను మా ట్రైలర్ రీచ్ అయింది. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా థ్రిల్లింగ్ కాన్సెప్టుతో తీసిన సినిమా ఇది. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు అనే నమ్మకం ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 1 సినిమాను విడుదల చేస్తున్నాం. ఇండియన్ సినిమా స్క్రీన్‌పై ఇప్పటివరకు రానీ, చూడని సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న చిత్రమిదని అన్నారు.

మహాభిమాన యాత్ర



ఉమ్మడి ఏపీ సీఎం దివగంత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ముఖ్య ఘట్టాలతో దర్శకుడు మహి వి రాఘవన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యాత్ర'. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న చిత్రంలో వైఎస్సార్ పాత్రను మలయాళ సీనియర్ హీరో మమ్మట్టి పోషిస్తున్నారు. వరుసగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్, టీజర్, డైలాగ్ టీజర్, మొదటి సింగిల్ సాంగ్‌తో యాత్ర కథలోని హైఇంటెన్సిటీని చూపించారు. తాగాజా 'రాజన్నా నిన్నాపగలరా' అంటూ సాగే రెండో సింగిల్‌లో వైఎస్సార్ పాదయాత్రతో ప్రజల్లో పెల్లుబుకిన ఆనందాన్ని కళ్లకుకట్టారు. రాజకీయ అనిశ్చితి తలెత్తిన సమయంలో మొదలుపెట్టిన పాదయాత్రతో వైఎస్సార్ ప్రజలకు ఎంతదగ్గరయ్యాడు, ప్రజా సమస్యలను ఎలా అవగతం చేసుకున్నాడు.. ముఖ్యమంత్రి అభ్యర్థిగా బడుగు బలహీనవర్గాలకు ఎలా చేరువయ్యాడన్న అంశాలను ప్రధానంగా కళ్లకుకట్టారు. ఏపీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఫిబ్రవరి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజకీయ నేపథ్యంగా తెరకెక్కుతున్న చిత్రానికి ప్రమోషన్ ప్రక్రియను సైతం వైవిధ్యంగా నిర్వహించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సెకెండ్ సింగిల్ విడుదల చేసిన సందర్భంగా నిర్మాతలు విజయ్ చల్లా, శశి దేవిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ పాత్రధారి మమ్మట్టి పరకాయ ప్రవేశాన్ని ఈ చిత్రంలో చూస్తారని నమ్మకంగా చెప్పారు. 'యాత్ర' చిత్రం పట్ల ఉభయ రాష్ట్రాల్లో అనూహ్య స్పందన, ఆసక్తి కనిపిస్తోందని, భలే మంచిరోజు, ఆనందోబ్రహ్మ చిత్రాల తరువాత తమ బ్యానర్‌లో నిర్మిస్తున్న యాత్ర హ్యాట్రిక్ సక్సెస్ అవుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రాజకీయ ప్రజ్ఞాశాలి వైఎస్సార్ వాస్తవిక, భావోద్వేగ సంఘటనల సమాహారంగా తెరకెక్కిస్తున్న చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తుండటం హ్యాపీగా ఉందన్నారు. ప్రతి తెలుగువాడినీ సినిమా రీచ్ అయ్యేలా ప్రమోషన్స్ ప్రక్రియను ప్లాన్ చేస్తున్నామని, తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఏకకాలంలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. రావ్‌రమేష్, జగపతి బాబు, సుహాసిని, అనసూయ, పోసాని, సచిన్ కద్కర్, వినోద్‌కుమార్, జీవా, పృథ్వీ ఇతర పాత్రలు పోషిస్తున్న చిత్రానికి సంగీతం 'కె' సమకూరుస్తుంటే, సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.